మన సమగ్ర
# ప్రజావాణి
తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY








| రాజన్న సిరిసిల్ల | శనివారం | 12.09.2026 | సంపుటి : 01 | సంచిక : 254 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | SATURDAY | 12.09.2026 | Volume : 01 | Issue : 254 | Pages : 12 | Cost : 2/- |




## రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

- రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- రేవంత్ అధికారంలోకి వచ్చాక పెరిగిన దందాలు
- పరాకాష్ఠకు చేరిన భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు
- అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారు
- గాంధీల పేరు చెప్పుకుని ఏలుతున్న గజదొంగలు
- రాష్ట్రంలో మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- 22ఏ జాబితా అనేది దురుద్దేశంతో చేసిన దుర్మార్గం
- 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి'
- కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- మంత్రి పొంగులేటి రాజీనామాకు హరీష్ రావు డిమాండ్
- తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో సమావేశం

**హైదారాబాద్,సెప్టెంబర్ 11:** తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ దూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మిగతా2లో...

# ఉద్యోగులకు ప్రమాద బీమా

● కోటి రూపాయల బీమా అందిస్తున్నాం ● ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా ● ఈ బీమాతో 12.91 లక్షల మందికి లబ్ది
● అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి



**హైదారాబాద్,సెప్టెంబర్ 11 :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధాన మిచ్చారు. రాష్ట్ర ఖజానాపై, ఉద్యోగుల వేతనాలపై రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు.

మిగతా2లో...



# వికృత రూపాలతో పోటీతత్వం

● రష్యా అధ్యక్షుడు పుతిన్ ● స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెరగాలి : పెజెష్కియాన్ ● ఆర్థిక వారధులను నిర్మిస్తున్న భారత్: బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశాల్లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ ,సెప్టెంబర్ 11:** 20వ శతాబ్దం చివరి వరకు అగ్ర స్థానాల్లో వున్న దేశాల స్థానే కొత్తగా ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థలు వచ్చి చేరుతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. ఈ పోటీ ఇప్పుడు వికృత రూపాలను అంటే సైనిక దాడులు, ఆంక్షల బెదిరింపులు వంటి రూపాలను సంతరిం చుకుం టోందని వ్యాఖ్యానించారు. మిగతా2లో...

# అనలాగ్ పనీర్‌పై నిషేధం

నాన్-డెయిరీ పనీర్‌పై ఏడాది పాటు నిషేధం: టీజీసేఫ్ కీలక నిర్ణయం



**హైదరాబాద్ ,సెప్టెంబర్ 11:** ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలోఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విచ్చలవిడిగా చెలామణి అవుతున్న నకిలీ, కృత్రిమ పనీర్‌పై తెలంగాణ సేఫ్టీ ఆఫ్ ఫుడ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. తెలంగాణ వ్యాప్తంగా నాన్-డెయిరీ, అనలాగ్, ఆర్టిఫిషియల్ పనీర్ తయారీ, విక్రయాలపై ఏడాది పాటు పూర్తి నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పనీర్ పేరుతో అనలాగ్ లేదా నాన్-డెయిరీ పదార్థాలను తయారు చేయడం, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ చేయడం, పంపిణీ, రవాణా, విక్రయించడంపై రాష్ట్రవ్యాప్తంగా కఠిన నిషేధం అమలులో ఉంటుందని అధికారులు మిగతా2లో...

# రైతులు కోరుకున్న పనిముట్లే అందిస్తున్నాం

● సబ్సిడీ సొమ్ము నేరుగా వారి ఖాతాల్లోకే బదిలీ : మండలిలో మంత్రి తుమ్మల



**హైదారాబాద్,సెప్టెంబర్ 11 :** రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధాన మిచ్చారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్‌స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన మిగతా2లో...



## నాణ్యమైన విద్యే లక్ష్యం

'జెన్ ఆల్ఫా, జెన్ బీటా'కు సరిపడా విద్యా విధానం
ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నాం
సలహాలు, సూచనలిస్తే స్వీకరిస్తాం
ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య
అదే విద్యాశాఖ మంత్రిగా నా పనితీరుకు నిదర్శనం : విద్యా వ్యవస్థలో సంస్కరణలపై స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదారాబాద్,సెప్టెంబర్ 11 :** జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాలను కూడా దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో సరికొత్త విద్యా విధానాన్ని రూపొంది స్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మిగతా2లో...

## ఆర్మీ రిటైర్డ్ హవల్దారే నిందితుడు

వీడిన ఆర్మీ ఆయుధాల చోరీ మిస్టరీ
ఆయుధాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం : వివరాలు వెల్లడించిన డీజీపీ సీవీ ఆనంద్




## వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేస్తాం

- వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేస్తాం :రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి




# చెరువుల హద్దులకు రక్షణ కవచం

నెల్లికల్ ఎత్తిపోతల పథకం నుంచి ప్రారంభం
వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి
24 వేల ఎకరాల ఆయకట్టుకు జలాలు
:శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదారాబాద్,సెప్టెంబర్ 11** చెరువుల పూర్తి నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో పలువురు సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఆయన ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రం ఏర్పడే నాటికి 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ఆరు వేలకుపైగా పెరిగాయని చెప్పారు. వాటిలో సభ్యత్వం 6.5 లక్షలకు చేరిందన్నారు. మిగతా2లో...



## రామగుండం బీపీఎల్ భూములను వెనక్కి తీసుకుంటాం

- 1800 ఎకరాల స్వాధీనానికి ప్రయత్నాలు : మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్, 11 య:** రామగుండంలో బీపీఎల్ కు ఇచ్చిన 1800 ఎకరాలను తిరిగి తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శు క్రవారం శాసనసభలో పలువురు సభ్యులు మిగతా2లో...

# ఉద్యోగులకు ప్రమాద బీమా

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందులో సింగరేణిలో 50, విద్యుత్ శాఖ ఉద్యోగులు 15, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారన్నారు. శాలరీ, పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం సంభవిస్తే ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఉచిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది , 2,72,615 మంది పెన్షనర్లు కవర్ అవుతారని వివరించారు. ఈ పథకాన్ని మొదటిగా ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభలో తెలిపారు.

# రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్‌వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత భూముల జాబితా (22ఏ) వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో ప్రజల భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆయన ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేశందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ బాధితులు నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు.

# నాణ్యమైన విద్యే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆ వ్యవస్థలోకి ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నామని ఆయన చెప్పారు. శుక్రవారం శాసన సభలో విద్యా వ్యవస్థలో సంస్కరణలపై నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో సీఎం మాట్లాడారు. తెలంగాణ విద్యా విధానంపై సభలో చర్చ జరగడం ఒక శుభ పరిణామమని అన్నారు. చర్చ సందర్భంగా సభ్యుల నుంచి వచ్చే సూచనలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్ని స్తుందని హామీ ఇచ్చారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెండు అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోని ఏ విద్యా సంస్థ అయినా నెహ్రూ వేసిన పునాదులపైనే నిర్మితమైందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న చాలా యూనివర్సిటీలు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వేనని తెలిపారు. విద్య ఒక్కటే ప్రజల జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సీపెక్ సర్వేలో సామాజిక వెనుకబాటుకు ఆస్తులు, అంతస్తులు కాకుండా విద్య లేకపోవడమే కారణమని తేలిందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.

ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యా విధానంలో తీసుకు రావాల్సిన అంశంపై చర్చించాల్సిన అవసరం ఉందని అభి ప్రాయపడ్డారు. ఆ దిశగా విద్యా కమిషన్ ఏర్పాటు చేశామనీ, ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలిం చినట్టు తెలిపారు.

అనంతరం కె. కేశవరావు నేతృత్వం లో కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆ కమిటీకి సభ్యులు సలహాలు, సూచ నలు అందిస్తే ప్రభు త్వం స్వీకరిం చేందుకు సిద్ధం గా ఉందని స్పష్టం చేశారు. విద్య కోసం బడ్జెట్ ను 15 శాతానికి పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2023-24 బడ్జెట్ లో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖ కు రూ.19,093 కోట్లు కేటాయిస్తే, తమ ప్రభుత్వం 2024-25 బడ్జెట్ లో రూ.21,292 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. దానిని 2025-26 బడ్జెట్ లో రూ.23,108 కోట్లకు, 2026-27 బడ్జెట్ లో రూ. 26,647 కోట్లకు పెంచినట్టు తెలిపారు.కేవలం మూడేండ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ.7,554 కోట్లకు పెంచామని వివరించారు. విద్యా శాఖకు పూర్తి స్థాయి మంత్రి లేరని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శిం చడాన్ని ప్రస్తావి స్తూ, ముఖ్య మంత్రి ఆ శాఖను నిర్వ హిస్తున్నా రంటే ఆది అత్యంత ప్రధాన మైనదని అర్థమని సీఎం తెలిపారు.ముఖ్య మంత్రిగా తాను విద్యపై సమీక్షిస్తే ఆ సమీక్షలో మొత్తం వ్యవస్థ ఉంటుందని చెప్పారు.ఆ మాత్రం తేడా కూడా సభ్యునికి తెలియకపోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. తనకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉందని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నే ఉందని, తలరాతలు మార్చేది విద్యా అని నమ్మి విద్యా శాఖ తన దగ్గర పెట్టుకున్నానని వివరణ ఇచ్చారు. ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొచ్చే క్రమంలో కొన్ని నిర్ణయాలు చేసినప్పుడు కొన్ని వివాదాలు తలెత్తుతాయంటూ, అలాంటిదే పాలిటె క్నిక్ కాలేజీలకు సంబంధించిన జీవో ఎంఎస్ నెం.97 అని సీఎం ఉదహరించారు.

## చెరువుల హద్దులకు రక్షణ కవచం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. తొలి దశలో వచ్చే ఏడాది జూన్ నాటికి 7,800 ఎకరాలకు, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ నాటికి నీరందిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ.25.42 కోట్లు మాత్రమే విడుదల చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.310.681 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మంత్రిగా తాను రెండు సార్లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు.

# వికృత రూపాలతో పోటీతత్వం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ప్రపంచంలో నిర్మాణాత్మకమైన, వ్యవస్థా గతమైన మార్పులకు లోనవుతోందని పుతిన్ అన్నారు. 20వ శతాబ్దం ద్వితీయా ర్థంలో ఆర్థిక అభివృద్ధికి అగ్రగామిగా నిలిచిన దేశాల స్థానే క్రమేపీ నూతన అభివృద్ధి చోదక శక్తులు ఆక్రమిస్తున్నాయని పుతిన్ పేర్కొ న్నారు. అయితే ఈ దేశాలు ఇంకా బాగా అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలను, సాంకేతి కతను, శాస్త్రీయ అవకాశాలను కలిగివు న్నాయనే వాస్తవాన్ని మనం గుర్తిం చాలన్నారు. మానవాళి స్వభావం, ఆర్థిక వ్యవస్థ రెండూ మార్పు చెందుతునే వుంటా యన్నారు. ఈ మార్పుతో పాటూ రష్యాకు చెందిన పశ్చిమ దేశాల పోటీదారులు తమ పూర్వపు పోటీ తత్వాన్ని తిరిగి సముపార్జిం చుకునేందుకు శాయశక్తులా పనిచేస్తున్నారని పుతిన్ పేర్కొన్నారు. అయితే ఈ పోటీతత్వం అనేది చాలాసార్లు వికృత చేష్టలతో ముడిపడి వుంటుందన్నారు. భౌతిక దాడులకు దిగడం, చమురు పైప్‌లైన్లు ధ్వంసం చేయడం, అంతర్జాతీయ రవాణా కారిడార్లను అడ్డుకోవడం,సముద్రపు నౌకలను స్వాధీనం చేసుకోవడం, అక్రమంగా ఇతరత్రా ఆంక్షలు విధించడం వంటి చర్యలకు దిగుతూంటారని అన్నారు. **స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెరగాలి : పెజెష్కియాన్** అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కేవలం కొన్ని దేశాలపైనే ఆధారపడడం వల్ల ఎదురయ్యే ముప్పులు, ప్రమాదాల గురించి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రముఖంగా పేర్కొన్నారు. స్థానిక కరెన్సీల్లో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం పెరగాలని పిలుపిచ్చారు. ఆర్థిక భద్రతను దేశ, ప్రాంతీయ భద్రత నుండి ఎలా వేరుచేయలేమో తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడులు రుజువు చేశాయని అన్నారు. రాజకీయంగా ఒత్తిడి తీసుకురా వడానికి ఆర్థిక సాధనాలను ఉపయోగించడం పెరిగిందని అన్నారు. ఈనాడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ సవాళ్ళకు బ్రిక్స్ దేశాల స్పందన ఎలా వుండబోతోందో చెప్పాలని ఆయన అక్కడ వున్న నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. ఒక ఆర్థిక సాధనంపై లేదా సాంకేతికతపై గుత్తాధిపత్యాన్ని ప్రదర్శించడం ద్వారా ఏ దేశమూ మరో దేశం యొక్క చట్టబద్ధమైన వాణిజ్యాన్ని దెబ్బతీయలేని వాతావరణాన్ని బ్రిక్స్ సృష్టించాలని ఆయన కోరారు.

# అనలాగ్ పనీర్‌పై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. పాలతో కాకుండా రసాయనాలు,వెజిటబుల్ ఆయిల్స్, ఇతర కృత్రిమ పదార్థాలతో చేసే అనలాగ్ పనీర్ ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తుండటంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నిషేధాజ్ఞలు 2026 సెప్టెంబర్ 10 నుంచి తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని టీజీ సేఫ్ ప్రకటించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 లోని సెక్షన్ 30(2)(ఏ) కింద ఆధారాలు లభించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి నకిలీ, అనలాగ్ పనీర్‌ను విక్రయించినా, నిల్వ చేసినా ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తప్పవని టీజీ సేఫ్ అధికారులు హెచ్చరించారు.

# ఆర్మీ రిటైర్డ్ హవల్దారే నిందితుడు

**హైదరాబాద్,సెప్టెంబర్ 11 :** దేశంలోనే సంచలనం రేపిన మద్రాస్ ఆర్మీ రెజిమెంట్ లోని ఆయుధాగారం నుంచి భారీ ఎత్తున ఆయుధాల చోరీ మిస్టరీని రాష్ట్ర పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడ్డ ఆర్మీ రిటైర్డ్ హవల్దార్‌ను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ అయిన ఆయుధాలను స్వాధీన పర్చుకున్నారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో హవల్దారుగా పనిచేసిన ఉప్పుతోళ్ళ మల్లేష్ ఈ ఏడాది జూన్ నెలలో రిటైర్డ్ అయ్యారు. ప్రవర్తన సరిగా లేకపోవడంతో పాటు అనారోగ్య కారణాల వల్ల ఉన్నతాధికారులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. మద్రాస్ రెజిమెంట్ ఆయుధాగారాల నుంచి 7 పిస్టళ్లు , 4 ఏకే 47, ఇన్సాస్, మందుగుండు సామాగ్రీ చోరీ జరిగిందని ఆగస్టు 30న ఆర్మీ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసును నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించాం. సమస్య తీవ్రత దృష్ట్యా రాష్ట్ర పోలీసులతో పాటు ఆర్మీ ఇంటెలిజెన్స్ అధికారులు, ఎన్ఐఏ అధికారులు రంగంలోకి దిగి దర్యాప్తును ప్రారంభించారు. రాష్ట్ర పోలీసు దర్యాప్తు బృందాలు బొల్లారంలోని ఘటనా స్థలాన్ని సందర్శించి అన్ని కోణాల్లో విచారణ ప్రారంభించాయి.ఆయుధాగార ఇన్‌చార్జీలు వినోద్ నాయర్, మధు నాయర్లతో పాటు సెక్యూరిటీ గాడ్స్, ఆ ప్రాంత పర్యవేక్షక ఆర్మీ అధికారులను ప్రశ్నించారు. ఆ సమయంలోనే వచ్చిన సమాచారం మేరకు జూన్ లో రిటైర్డ్ అయిన హవల్దార్ మల్లేష్ కదలికలపై దృష్టి సారించాం. మా దగ్గర ఉన్న ఆధారాలతో నిందితుడి కదలికల గురించి ప్రశ్నించాం. వాస్తవాలు చెప్పకుండా అతడు దాచిపెట్టాడు. తొలుత విచారణ కోసం మేం పిలిస్తే రాలేదు. ఫోన్ కాల్ లిస్ట్, వాట్సప్ చాటింగ్‌లు డిలీట్ అయ్యాయి. ఆ తర్వాత మల్లేశ్‌ను ప్రశ్నిస్తున్నప్పుడు ఆయన ముఖంలో చెమటలు పట్టి భయం కనిపించింది. కేసు తీవ్రతను ఆయన భార్యకు వివరించాం. ఆమె గట్టిగా ప్రశ్నించడంతో నిందితుడు నిజం అంగీకరించాడు. చోరీ చేసిన ఆయుధాలను నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని స్వగ్రామానికి తీసుకెళ్లి గుంతతీసి పాతిపెట్టాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు వాటిని స్వాధీనం చేసుకున్నాం" అని డీజీపీ వివరించారు.

# వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేస్తాం

**హైదరాబాద్,సెప్టెంబర్ 11 :** రాష్ట్రంలో 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏ వారసు లకు న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో సీపీఐ సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. జీవో నెంబర్ 81 ప్రకారం మిగిలిన 3,797 మంది వీఆర్ఏ వారసులను ఉద్యోగంలోకి తీసుకునేం దుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కొన్ని న్యాయపరమైన చిక్కులు, ఇతర సమస్యల ను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని సభకు వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు నీడ కల్పిస్తున్నట్టు పొంగులేటి తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు మహేశ్‌కుమార్ గౌడ్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ రాష్ట్రంలోని రూరల్ ఏరియాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫేజ్-1 కింద 4.5 లక్షలు, ఫేజ్-2 కింద 2.5 లక్షలు మంజూరు చేసినట్టు సభకు తెలిపారు. ప్రతి నియోజక వర్గానికి రెండు విడతల్లో 5,500 ఇండ్లను అందించ నున్నట్టు తెలిపారు. అర్బన్ ఏరియాల్లో మొదటి సారీగా హైదరాబాద్‌లో లక్ష ఇండ్లను టవర్ల రూపంలో నిర్మించనున్నట్టు వెల్లడించారు. త్వరలో కరీంనగర్, వరంగల్, ఖమ్మం మొదలగు కార్పొరేషన్లలో ఈ పథకాన్ని వర్తింప జేయనున్నట్టు తెలిపారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు ఇండ్ల పథకాలకు ఆర్థిక సాయం అందిస్తున్న కేంద్రం తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపించిందని విమర్శించారు.

# రామగుండం బీపీఎల్ భూములను వెనక్కి తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

అడిగిన వివిధ ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా బీపీఎల్ భూములపై కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీని గ్లోబల్ సిటీగా మార్చుతామన్నారు. హైదరబాద్- బెంగళూరు హైవేని డిఫెన్స్ కారిడార్‌గా మార్చనున్నట్టు వెల్లడించారు. రైజింగ్ తెలంగాణలో వరంగల్‌కు ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ 163 ఇండస్ట్రియల్ కారిడార్‌పై తమ దృష్టి ఉందన్నారు. దావోస్‌లో రూ.2 లక్షల కోట్ల విలువ చేసే ఏడు ఎంఒయులు జరిగాయనీ, రైజింగ్ సమ్మిట్‌లో రూ.3.82 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు నమోదయ్యాయని వివరించారు. మొత్తంగా రూ.5.8 లక్షల కోట్ల పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారనీ, అయితే వారి ఫైనాన్సియల్ క్లోజర్‌తో ఈ పెట్టుబడులు ముడిపడి ఉంటాయని తెలిపారు.

# రైతులు కోరుకున్న పనిముట్లే అందిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

తర్వాతే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు.యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదనీ, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న యంత్రాలను ఎక్కువగా అందించాలని, డ్రోన్లను కూడా అధిక సంఖ్యలో అందించాలని కోరారు.దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ, ఎమ్మెల్సీ ప్రస్తావించిన అంశాలు గతంలో ఉన్న పరిస్థితులకు సంబంధించినవనీ, ప్రస్తుతం ఆ విధానం లేదని స్పష్టం చేశారు. రైతులు తమకు నచ్చిన పనిముట్టును, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత యాంత్రీకరణ విధానాన్ని రూపొందించామని తెలిపారు. రైతులు కోరుకునే విధంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండేలా ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో వారికి కూడా భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామని చెప్పారు. **ఇమామ్‌ల వేతనం పెంపు పరిశీలనలో ఉంది.... : ?మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్** ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతనం పెంపు పరిశీలనలో ఉందని మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం వారి గౌరవ వేతనం రూ.5 వేలుగా ఉందని తెలిపారు. గౌరవ వేతనం అందని ఇమామ్, మౌజమ్‌లకు సంబంధించి సమాచారాన్ని ఇస్తే వారికి కూడా అందజేస్తామని పేర్కొన్నారు.

## ఇస్కాన్‌కు రూ.5 లక్షలు.. సాయి బాబా గుడికి రూ.1 లక్ష.. జొన్నలగడ్డ దంపతుల విరాళం




**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 ప్రజా వాణి** శింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబ శివారెడ్డి దంపతులు భక్తి, దాతృత్వాన్ని చాటుకున్నారు.అనంతపురం సమీపంలోని సోములదొడ్డి వద్ద ఉన్న ఇస్కాన్ ఆలయానికి గతేడాది రూ.1 లక్ష, ఈ ఏడాది రూ.4 లక్షలు, అనంతపురం రెండో రోడ్డులోని సాయిబాబా ఆలయానికి రూ.1 లక్ష చొప్పున విరాళంగా అందించారు. మొత్తంగా రూ.6 లక్షల విరాళాన్ని అందజేశారు. ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణుడు, రాధారాణి దివ్య మూర్తులను దర్శించుకుని జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సాయి బాబా ఆలయానికి వెళ్లి సాయి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడం సంతోషంగా ఉందని జొన్నలగడ్డ దంపతులు తెలిపారు. భక్తి, సేవా కార్యక్రమాల్లో తమ వంతు భాగస్వామ్యం కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబ శివారెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు -2026 మండల టాపర్స్ గా విక్టోరియా మాంటిసోరి హై స్కూల్ విద్యార్థులు



**ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం సెప్టెంబర్ 11** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కూనవరం మండలం లో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు -2026 లో భాగంగా 11/09/2026 శుక్రవారం జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు 8 పాఠశాల నుండి విద్యార్థులు హాజరు కాగా అత్యధికముగా మార్కులు సాధించిన విక్టోరియా మాంటిసోరి హై స్కూల్ విద్యార్థులు వల్లల సాయి ప్రతిభ పదవ తరగతి షేక్ అబ్దుల్ అహద్ 9వ తరగతి పల్లంటి మార్క్ సత్య 8వ తరగతి ఈ ముగ్గురు విద్యార్థులు చెకుముకి సైన్స్ మండల స్థాయి పోటీలో ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలో అర్హత సాధించారు ఈ ముగ్గురు విద్యార్థిని, విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ విక్కిసింగ్, వైస్ ప్రిన్సిపాల్ రూబీ సింగ్ మరియు , విక్టోరియా సింగ్,సూపర్ వైజర్ రాజ్ , ఆఫీస్ స్టాఫ్ సంధ్య , మహేష్ ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## అనంతపురం నగరంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**అనంత పురం సెప్టెంబర్ 11** నేటి శుభోదయ సెప్టెంబర్ 13వ తేదీ ఆదివారం రోజున అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ నందు భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో, సక్షమ్ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి నెల రెండో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పరీక్ష అనంతరం కంటి ఆపరేషన్ అవసరమైన వారికి కడపలోని పుష్పగిరి హాస్పిటల్ నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడునని, దీనికి సంబంధించిన రవాణా, వసతి సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా కల్పించబడునని తెలిపారు. ఈ సమాచారాన్ని మరింత మందికి తెలియజేయాలని కోరారు,మరిన్ని వివరాలకు 7093227885,6301815453 సంప్రదించగలరు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 11 మన ప్రజావాణి** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో, భక్తులకు వైద్య సేవలు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, అనిగండ్లపాడు (ఆయుష్ శాఖ) వారి సహకారంతో ఆలయ ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో భక్తులకు, స్థానికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చుంచు రమేష్ బాబు, ఆలయ ధర్మకర్త గుగులోతు రమేష్, ఆయుర్వేద వైద్యశాల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి వైద్య శిబిరాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ సుంచు రమేష్ బాబుతెలిపారు.

## కూనవరం మండలంలో టీడీపీ అత్యవసర సమావేశం - ఎమ్మెల్యే పర్యటనపై చర్చ



**ప్రజావాణి ప్రతినిధి కూనవరం సెప్టెంబర్ 11** పోలవరం జిల్లా కంప చోడవరం నియోజకవర్గం కూనవరం మండల తెలుగుదేశం పార్టీ అత్యవసర సమావేశం శనివారం నాడు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు తెలిపారు. టేకులబోరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ బుధవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి గారి కూనవరం మండల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు, బూత్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇన్చార్జిలు మరియు వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

# కళ్యాణదుర్గంలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం

- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- మాజీ ఎంపీ రంగయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ




**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 ప్రజా వాణి** మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హాజరైన నియోజకవర్గ పరిశీలకులు మహిందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అనంత కామెంట్స్ గతంలో మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఇదే టీడీపీతో పోరాడి గట్టిగా పోరాటాలు చేసి అభ్యర్థులను గెలిపించుకున్నాం. పార్టీకి నిబద్ధులై, క్రమశిక్షణగా ఉన్న అభ్యర్థులను బరిలో దింపి వాళ్ళ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయండి. ఉన్నోడు మాత్రమే గెలుస్తాడు అనే అపోహను వీడండి. ప్రజల వద్దకు వెళ్లి కూటమి అవినీతి, అరాచకాలను తెలియజేయండి. ఈ ప్రభుత్వం వచ్చాక కరెంట్ చార్జీలు పెంచినప్పుడు, రైతన్నల కోసం, విద్యార్థుల కోసం, ఆర్డీటీ కోసం.. ప్రజలకు ఏ కష్టం వచ్చినా మనం అండగా నిలబడ్డాం. ఇక ఎన్నికలు ఆలస్యం చేస్తే ఉన్నవి కూడా పోతాయి అనే ఆలోచనలో కూటమి నేతలు ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనమంతా సిద్ధంగా ఉందాం.అరాచక పాలన నుండి రక్షించుకోవాలి అంటే కలిసికట్టుగా పని చేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలి.కూటమి ప్రభుత్వం వచ్చాక రెండేళ్లలో 5 లక్షల పింఛన్ లు తీసేశారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని కొత్త పింఛన్ల పేరుతో నాటకాలు ఆడుతున్నారు.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూడా దోపిడీ పాలన సాగుతోంది. ప్రజాప్రతి నిధులు ఇంత నీచంగా దిగజారిపోతారా అంటూ ప్రజలే చెప్పుకుంటున్నారు. మనం ఐక్యమత్యంతో పని చేస్తే కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలలో పాటు, మున్సిపాలిటీను కూడా కైవసం చేసుకుంటాం.గతంలో మన చేసిన అభివృద్ధి, సంక్షేమం చెప్పుకోలేక ఒడిపోయాం.. మాజీ ఎంపీ కళ్యాణ్ దుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య కామెంట్స్ :పోరాటాలు మనకు కొత్త కాదు.. గొంచితండాలో మొదలు పెట్టి ఢిల్లీ వరకు తెలిసేలా ఆర్డీటీ కోసం పోరాటం చేశాం. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి లేదు.. కొండ మొదలు గుట్ట వరకు ఏది వదలకుండా దోచేస్తున్నారు.నియోజకవర్గంలో ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా నియోజకవర్గంలోని చెరువులకు నీరు ఇచ్చే వరకు పోరాడుదాం.

కష్టపడే ప్రతి కార్యకర్తలకు న్యాయం చేస్తాం. నియోజకవర్గంలోని అన్ని ఊర్లలో బెల్ట్ షాపులు, ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇదే కూటమి అభివృద్ధి. క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే అభ్యర్థులను స్థానిక ఎన్నికల బరిలో నిలిపి గెలిపించుకుందాం.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపు.
- గ్రామస్థాయి నుంచి సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారిని గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలి
- “ఇవి సాధారణ ఎన్నికలు కావు.. కచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు” అని కార్యకర్తలకు దిశానిర్దేశం



**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 మన ప్రజా వాణి** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాప్తాడు నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి బలమైన, ప్రజలకు అందుబాటులో ఉండే సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు.“ఇవి సాధారణ ఎన్నికలు కావు.. మనం కచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు. ప్రతి స్థానంలో సరైన అభ్యర్థిని నిలబెట్టి, గెలిపించి తీసుకురావాలి. అందుకు మీకు మేము పూర్తి అండగా ఉంటాం. మనం ఘన విజయం సాధించి ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడాలి” అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.“రైతుల సమస్యలపై ఆందోళన అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న రైతుల సమస్యలపై ప్రకాష్ రెడ్డి గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేక బోర్లు ఎండిపోవడంతో కరువు తీవ్రరూపం దాల్చిందని, రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హంద్రీ-నీవా కాలువలకు లైనింగ్ పనులు చేయడం వల్ల వేలాది ఎకరాల భూములు సాగుకు దూరమవుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.పేరూరు డ్యామ్‌కు నీటిని అందించకుండా రాప్తాడు నియోజకవర్గ రైతులతో పాటు రొద్దం, పెనుకొండ మండలాల రైతులను కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు.అలాగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, భూగర్భ జలాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల భవిష్యత్తులో రైతులు మరింత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు.రైతులకు సాగునీరు, విద్యుత్, గిట్టుబాటు ధరలు, కరువు సమస్యల నుంచి ఉపశమనం కల్పించాలంటే ప్రజల తరఫున నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నా.. గ్రామస్థాయిలో ప్రజలకు అండగా నిలవాలన్నా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాల్సిన అవసరం ఉందని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు.

# నేతన్నలకు ఊరట

- నూతన నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తులో కీలక నిబంధన మినహాయింపు
- బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదు
- మాస్టర్ వీవర్ ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు అందిస్తే సరిపోతుంది
- 50 ఏళ్లు నిండిన నేత న్నలందరికీ పెన్షన్లు ఇస్తాం
- అర్హులు ఆందోళన చెం దాల్సిన అవసరం లేదు..
- నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చడమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 మన ప్రజా వాణి** నూతన నేతన్న భరోసా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న చేనేతలకు ఊరటనిచ్చేలా కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నేతన్న భరోసా పథకం కింద పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే చేనేతలు బ్యాంకు స్టేట్ మెంట్ అందజేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. మాస్టర్ వీవర్ నుంచి వేతనాలు తీసుకున్న వివరాలు అందజేస్తే సరిపోతుందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల పెన్షన్లు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల ఏడో తేదీ నుంచి వృద్ధాప్యం, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత సహా అన్ని రకాల పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేతన్న భరోసా పెన్షన్ కు దరఖాస్తు చేస్తుకుంటున్న నేతన్నలకు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధన తీవ్ర ప్రతిబంధకంగా మారింది. మాస్టర్ వీవర్ దగ్గర పనిచేసే చేనేతలకు వ్యక్తిగతంగానే వేతనాలు చెల్లిస్తూ వస్తుంటారు. అటువంటి సమయంలో బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధన పెట్టడంతో చేనేతలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇదే విషయమై పలువురు నేతన్నలు, చేనేత సంఘాల ప్రతినిధులు మంత్రి సవిత దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. తక్షణమే ఆమె స్పందించి, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి చేనేతల సమస్యను తీసుకెళ్లారు. బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధనను సడలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో, అర్హులైన చేనేతలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేసే అవకాశం కలిగిందని మంత్రి సవిత తెలిపారు. నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంకు ఖాతా స్టేట్ మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేస్తామని, అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్లు లేకున్నా దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది నేతన్నలకు ఉపశమనం కలగనుందని మంత్రి సవిత తెలిపారు. నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మందికిపైగా నేతన్నలకు నేతన్న భరోసా పెన్షన్ పథకం కింద రూ.4 వేలు చొప్పున అందజేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం కింద ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి సవిత గుర్తు చేశారు.

## మూత్రం నుండి ఉత్పత్తి చేసిన విద్యుత్‌తో ఎలక్ట్రిక్ కారును (EV) విజయవంతంగా ఛార్జ్ చేయవచ్చని నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు



**కూకట్పల్లి విలేజ్: (ప్రజావాణి) సెప్టెంబర్ 11 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్** .మూత్రం నుండి ఉత్పత్తి చేసిన విద్యుత్‌తో ఎలక్ట్రిక్ కారును (EV) విజయవంతంగా ఛార్జ్ చేయవచ్చని నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు నిరూపించారు. నెదర్లాండ్స్‌లోని ‘వెట్సస్’ వాటర్ టెక్నాలజీ పరిశోధన కేంద్రం ఈ వినూత్న ప్రయోగాన్ని పైలట్ ప్రాజెక్ట్ రూపంలో విజయవంతంగా నిర్వహించింది.నెదర్లాండ్స్‌లోని ఒక వాటర్ బోర్డ్ కార్యాలయంలో పనిచేసే సుమారు 260 మంది పురుష ఉద్యోగుల కోసం ప్రత్యేక యూరినల్స్ ఏర్పాటు చేశారు. వారి నుండి సేకరించిన మూత్రాన్ని ఒక ప్రత్యేక బ్యాక్టీరియా ఆధారిత ఎలక్ట్రోకెమికల్ వ్యవస్థకు (షిప్పింగ్ కంటైనర్ రియాక్టర్) తరలించారు. విధానం ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తుతో, ఆ కార్యాలయంలోని ఎలక్ట్రిక్ కారు రోజుకు సుమారు 50 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు అవసరమైన ఛార్జింగ్ లభించింది.మూత్రం నుండి విద్యుత్ ఎలా తయారవుతుంది?బ్యాక్టీరియా పాత్ర: ఈ సాంకేతికతలో ఆక్సిజన్ లేని వాతావరణంలో కొన్ని రకాల బ్యాక్టీరియాలు (Microbial Fuel Cells) మూత్రంలోని కర్బన పదార్థాలను (Organic matter/Urea) విచ్ఛిన్నం చేస్తాయి.ఎలక్ట్రాన్ల విడుదల: ఈ విచ్ఛిన్న ప్రక్రియలో ఎలక్ట్రాన్లు విడుదలవుతాయి. ఆ ఎలక్ట్రాన్ల ప్రవాహం ద్వారా కరెంట్ (విద్యుత్) ఉత్పత్తి అవుతుంది.అధిక వాహకత: మూత్రంలో సహజంగానే లవణాలు (Salts) ఎక్కువగా ఉండటం వల్ల ఇది విద్యుత్ వాహకంగా అద్భుతంగా పనిచేస్తుంది. విలువైన ఎరువులు: మూత్రం నుండి విద్యుత్‌ను వేరు చేయడమే కాకుండా శాస్త్రవేత్తలు దాని నుండి అమ్మోనియా, ఫాస్ఫేట్ వంటి విలువైన పోషకాలను కూడా వేరు చేశారు. వీటిని వ్యవసాయ ఎరువుల తయారీకి ఉపయోగించవచ్చు. కాలుష్య నివారణ: సాధారణ మురుగునీటితో కలవకముందే మూత్రాన్ని విడిగా సేకరించడం (Source Separation) వల్ల మురుగునీటి శుద్ధి ప్రక్రియ మరింత సులువవుతుంది.భవిష్యత్తు లక్ష్యాలుప్రస్తుతం ఈ సాంకేతికత ప్రాథమిక ప్రయోగ దశలోనే ఉంది. ఇళ్లలోని సాధారణ ప్లంబింగ్ వ్యవస్థలను మార్చడం ప్రస్తుతానికి కాస్త ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ, భవిష్యత్తులో ఈ టెక్నాలజీని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసి విద్యుత్‌తో పాటు హైడ్రోజన్ ఇంధనాన్ని కూడా భారీ స్థాయిలో ఉత్పత్తి చేయాలని పరిశోధకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# పుట్టపర్తిలో అర్హులైన పేదలకు ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేస్తాం

- అర్బన్ హౌసింగ్ కింద ప్రభుత్వ గృహాలకు అర్హులు దరఖాస్తు చేసుకోండి
- త్వరలో రూ.2 .50 లక్షలతో పీఎంఏవై కింద ప్రభుత్వ పక్కా గృహాలు
- టీడీపీ హయంలో మంజూరైన టిడ్కో గృహాలను 288 మంది లబ్ధిదారులకు త్వరలో అప్పగిస్తాం.
- ఈనెల 16లోగా నియోజవర్గంలోఅర్హులైన వారు పెన్షన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి



**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 ప్రజా వాణి** పుట్టపర్తి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పుట్టపర్తి టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.పుట్టపర్తి పట్టణ పరిధిలో అర్బన్ హౌసింగ్ కింద ప్రభుత్వ గృహాల కోసం అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు త్వరలో పీఎంఏవై పథకం కింద రూ.2.50 లక్షల వ్యయంతో పక్కా గృహాలు మంజూరు చేసి నిర్మించి అందిస్తామని తెలిపారు.అలాగే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన టిడ్కో గృహాల్లో 288 ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అప్పగిస్తామని వెల్లడించారు. ఆయా గృహ సముదాయాల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు పెన్షన్లకు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలి. .నియోజక వర్గంలో అర్హులైన కొత్త పెన్షన్‌దారులు ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెన్షన్లు, ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు.

# కూటమి సర్కార్ కొత్త ఫెన్షన్ మంజూరుకు నిబంధనలు పది..

- కొత్త ఫెన్షన్లు మంజూరు లో కూటమి సర్కారు నీతి నియమావళి ఎక్కువే..
- ఆరు మాసాలు కరెంట్ బిల్లు
- భూమి లేకపోయినా వన్ బి కావలి..
- ఓటర్ ఐడీ కార్డు ఇలా ఎన్నో నిబంధనలు
- ఆధార్ కార్డు హిస్టరీ సర్టిఫికెట్ కావాలన్నారు.
- తప్పుడు ఆధార్ కార్డులు పై ముందుస్తు చర్యలు తీసుకున్న స్టేట్ సర్కారు
- గత ప్రభుత్వం హయాములో నకిలీ ఆధార్ కార్డులు ద్వారా లబ్ది పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఉత్తరాంధ్ర లో మూడు వేల నకిలీ ఆధార్ కార్డులను సస్పెండ్ చేశారట...
- గత సర్కారు లో ఉత్తరాంధ్రలో ఆరువేల నకిలీ ఆధార్ కార్డులు తో లబ్ది పొందారని గణాంకాలు
- తప్పుడు ఆధార్ కార్డులు తో ఫెన్షన్లు పొందాలనుకున్న
- వారి ఆధార్ కార్డులను సస్పెండ్ చేశాము.
- విశాఖలోని ఆధార్ ప్రాంతీయ కార్యాలయ ఆఫీసర్






**పలాస ప్రజావాణి ప్రతినిధి** ప్రభుత్వము పేదవర్గాలకు మేలు చేసేందుకు వీలుగా ప్రభుత్వము వయో వృద్ధులు అలాగే ఇతర బాధితులకు ఇస్తామన్న ఫెన్షన్ పథకం లో సర్కారు నిబంధనలుపేరుతో కొర్రీలు పెట్టారని కొత్త ఫెన్షన దారులు ఆగ్రహము వ్యక్తము చేస్తున్నారు.

నిజానికి గత సర్కారు కాలములో నకిలీ ఆధార్ కార్డులు తో ఫెన్షన్లు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.నిజానికి ఆధార్ కార్డు లో తప్పుడు పుట్టిన తేదీ నమోదు కావడము వల్ల కొందరు నయా మధ్యవర్తులు వద్దకు వెళ్లి ఆధార్ కార్డులను డేట్ ను సరిదిద్దాలని కోరిక మేరకు ఫెన్షన్ కోసము ఆధార్ కార్డులో డేట్ మార్చారని తెలిసింది.గత ప్రభుత్వము లో నకిలీ ఆధార్ కార్డులు తయారు కోసము రూపాయలు వసూలు చేసి నకిలీ ఆధార్ కార్డులు ఇచ్చారు.అయితే కూటమి సర్కారు కొత్తగా ఫెన్షన్ మంజూరు కోసము దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీని కోసము కొత్తగా ఆధార్ హిస్టరీ సర్టిఫికేట్ కావాలన్నారు . దీంతో ఇ సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు నెంబర్ నమోదు చేస్తే ... మీ నెంబర్ సస్పెండ్ చేశామని వస్తుంది.. దీంతో ఇలా సస్పెండ్ చేసిన ఆధార్ కార్డుదారులందరూ విశాఖపట్నంలోని ఆధార్ కార్యాలయం వెళ్లి వివరాలు అడిగితే అక్కడ ఆఫీసర్ ఇలా అన్నారు.ప్రభుత్వము కొత్త ఫెన్షన్లు మంజూరు లో అవినీతి జరిగేందుకు ఆస్కారం లేకుండా ఇలా తప్పుడు సర్టిఫికెట్ తో వయస్సును పెంచిన వారందరి ఆధార్ కార్డులు రద్దు చేశామని ఆ ఆఫీసర్ తెలిపారు.

తప్పుడు ఆధార్ కార్డులు లబ్దిదారులకు నోటీసులు ఇవ్వకుండా ఆధార్ కార్డులు రద్దు చేయడం పై సర్వత్రా ఆసక్తికరంగా మారింది...నకిలీ ఆధార్ కార్డులు దారులకు నోటీసులు ఇవ్వకుండా కార్డులు రద్దు ఎలా చేస్తారు ..

మూడు వేలమంది ఆధార్ కార్డులు రద్దు చేస్తే వారికి అనారోగ్యం వస్తే ఆరోగ్య శ్రీ పథకము వర్తించదు. దీంతో రద్దు చేసిన ఆధార్ కార్డులు లబ్దిదారులు ఇబ్బందులు పడక తప్పదు.

నకిలీ ఆధార్ కార్డులు ఇచ్చి లక్షల్లో డబ్బులు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

గంపెడు ఆశలు తో ఆధార్ కార్డుదారులకు తగిన అవకాశము ఇస్తామని చెప్పి నమ్మించి మోసము చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.

ఆశ చూపి లక్షల్లో డబ్బులు వసూలు చేసిన నకిలీ దళారులు పై చర్యలు తీసుకోవాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.

# హార్న్ ఒకే ప్లీజ్ లారీల వెనక 'OK' అని ఎందుకు రాస్తారు? దీని అర్థం 'సరే' కాదు, మరేంటో తెలుసా?

**కూకట్పల్లి విలేజ్ : (ప్రజావాణి) సెప్టెంబర్ 11 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.** మనం రోడ్ల మీద వెళ్లేటప్పుడు లారీల వెనుక 'HORN OK PLEASE' అని రాసి ఉండటం చూస్తుంటాం. "HORN PLEASE" రాస్తే సరిపోతుందిగా.. మధ్యలో ఈ 'OK ఎందుకు? అని అనుకుంటాం. కానీ ఇలా రాయడం వెనక ప్రత్యేక కారణం ఉంది...అదేంటో ఓసారి తెలుసుకుందాం.. లారీల వెనకాల 'OK' అని ఎందుకు రాస్తారు?

మనం హైవేలపై ప్రయాణించేటప్పుడు పెద్దపెద్ద సరుకు రవాణా లారీలు, ట్రక్కులు పక్కనుండి వేగంగా దూసుకెళుతుంటాయి. ఇలా లారీలు మనల్ని ఓవర్ టేక్ చేసినప్పుడు లేదా వాటివెనకాల మన వాహనం వెళుతున్నప్పుడు ఓ విషయాన్ని కచ్చితంగా గమనిస్తాం... అదే "HORN OK PLEASE" అనే పదాలు రాసివుండటం. ఇక్కడ HORN OK PLEASE" అంటే లారీని ఓవర్ టేక్ చేసేటప్పుడు హారన్ కొట్టండి... డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని పక్కకు తీసుకుని సైడ్ ఇస్తాడని అర్థం. మరి మధ్యలో ఈ 'OK' ఎందుకుంటుంది?

HORN OK PLEASE : లారీల వెనక 'OK' అని ఎందుకు రాస్తారు? దీని అర్థం 'సరే' కాదు, మరేంటో తెలుసా?

మనం రోడ్ల మీద వెళ్లేటప్పుడు లారీల వెనుక 'HORN OK PLEASE అని రాసి ఉండటం చూస్తుంటాం. "HORN OK PLEASE" రాస్తే సరిపోతుందిగా.. మధ్యలో ఈ 'OK' ఎందుకు? అని అనుకుంటాం. కానీ ఇలా రాయడం వెనక ప్రత్యేక కారణం ఉంది... అదేంటో ఓసారి తెలుసుకుందాం.

లారీల వెనకాల 'OK' అని ఎందుకు రాస్తారు?

మనం హైవేలపై ప్రయాణించేటప్పుడు పెద్దపెద్ద సరుకు రవాణా లారీలు, ట్రక్కులు పక్కనుండి వేగంగా దూసుకెళుతుంటాయి. ఇలా లారీలు మనల్ని ఓవర్ టేక్ చేసినప్పుడు లేదా వాటివెనకాల మన వాహనం వెళుతున్నప్పుడు ఓ విషయాన్ని కచ్చితంగా గమనిస్తాం... అదే "HORN OK PLEASE" అనే పదాలు రాసివుండటం. ఇక్కడ HORN OK PLEASE" అంటే లారీని ఓవర్ టేక్ చేసేటప్పుడు హారన్ కొట్టండి... డ్రైవర్ అప్రమత్తమై




వాహనాన్ని పక్కకు తీసుకుని సైడ్ ఇస్తాడని అర్థం. మరి మధ్యలో ఈ 'OK' ఎందుకుంటుంది?

HORN OK PLEASE వెనక ఇంత్రస్టింగ్ స్టోరీ దాగుందా..!

మనం 'ఒకే' అనే పదాన్ని ప్రతిరోజూ ఎన్నోసార్లు ఉపయోగిస్తాం... దీనర్థం సరే అని. కానీ లారీల వెనక ఉండే 'ఒకే' కి మాత్రం మరో మీనింగ్ ఉంది. అదేంటో తెలుసుకోవాలంటే దాదాపు 80 ఏళ్ల వెనక్కి రెండవ ప్రపంచ యుద్ద కాలానికి వెళ్లాలి.

1939 నుండి 1945 వరకు రెండో ప్రపంచ యుద్దం జరిగింది.. ఈ సమయంలో ఇండియాలో తీవ్రమైన పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది... దీంతో వాహనాలను కిరోసిన్ తో నడిపించాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే పెట్రోల్ లేదా డీజిల్ కంటే చాలా త్వరగా మండే స్వభావం ఈ కిరోసిన్ కు ఉంటుంది.. ఇది ప్రమాదకరం కావడంతో వాహనాలను మరింత జాగ్రత్తగా నడపాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే ఈ లారీ కిరోసిన్ తో నడుస్తుంది అని ఇతర వాహనదారులకు తెలియజేసేందుకు వెనకాల 'OK' అని రాయడం ప్రారంభించారు. OK అంటే ON Kerosine (కిరోసిన్ తో నడిచే వాహనం) అన్నమాట.

'HORN OK PLEASE'అంటే లారీని ఓవర్ టేక్ చేయాలంటే ముందు హారన్ మోగించాలని చెప్పడమే కాదు ఇది కిరోసిన్ తో నడిచే వాహనం అనికూడా అర్థం. ప్రమాదాలను నివారించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ OK అన్న పదం రెండో ప్రపంచ యుద్ద సమయంలో మొదలై ఇప్పటికీ కొనసాగుతోంది. ఇప్పుడు పెట్రోల్, డీజిల్ తో లారీలు నడుస్తున్నా ఒకే అనే పదాన్ని రాయించుకోవడం ఓ సాంప్రదాయంగా మారింది.

OK వెనకున్న ఇంకో స్టోరీ

లారీల వెనకాల 'OK' అనే పదాన్ని రాయడంవెనక మరో కథ కూడా ప్రచారంలో ఉంది. టాటా ఆయిల్ మిల్స్ కంపెనీకి చెందిన OK' అనే సబ్బు డిటర్జెంట్ బ్రాండ్‌ను ప్రమోట్ చేయడానికి గతంలో లారీలపై OK' అని రాసేవారని ఒక థియరీ చెబుతోంది. ఆ తర్వాత అది లారీ అలంకరణలో ఒక భాగమైపోయిందని అంటారు. అయితే దీనికి కూడా కచ్చితమైన చారిత్రక ఆధారం లేదు. కాబట్టి ఒకే అన్. కిరోసిన్ అయినా ఒకే యాడ్ బ్రాండ్ అయినా... ఈ రెండు కథలూ నిరూపితమైన నిజాలు కావు.

హార్న్ ఒకే ప్లీజ్

అని ఇప్పటికీ ఎందుకు రాస్తారు?

కాలం మారింది... ఇప్పటి లారీల్లో ఆధునిక మిర్రర్లు, కెమెరాలు, సెన్సార్ల లాంటి ఎన్నో సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. అయినా కూడా 'Horn OK Please' అనేది భారత లారీ కల్చర్‌లో ఒక సింబల్‌గా మారిపోయింది.లారీల వెనుక రాసే ఈ రాతలు కేవలం సమాచారం కోసం మాత్రమే కాదు దేవుడి పేర్లు, కవితలు, సామెతలు, ఫన్నీ కొటేషన్లు, హెచ్చరికలతో ఇవి ఇండియాకే ప్రత్యేకమైన 'ట్రక్ ఆర్ట్ కల్చర్'లో ఒక భాగమయ్యాయి. అయితే అనవసరంగా హారన్ కొట్టడాన్ని ప్రోత్సహిస్తోందని భావించి మహారాష్ట్రలో 'Horn OK Please' అనే స్లోగన్‌పై చర్యలు కూడా తీసుకున్నారు. అయినా కూడా ఈ వాక్యం ఇప్పటికీ భారత రోడ్లపై కనిపిస్తూనే ఉంది.

ఒకే మీనింగ్ ఇదే.. హార్న్ ఒకే ప్లీజ్

అంటే లారీని ఓవర్‌టేక్ చేసే ముందు హారన్ కొట్టి డ్రైవర్‌కు చెప్పాలనేది వాడుకలో ఉన్న అర్థం. కానీ అందులోని 'OK' అనే పదం అసలు ఎలా వచ్చిందనేది ఇప్పటికీ కచ్చితంగా ఎవరికీ తెలియదు. 'On Kerosene' అనేది బాగా పాపులర్ అయిన థియరీనే అయినా, దాన్ని చారిత్రక నిజం అని చెప్పలేం. ఈ రెండు అక్షరాల వెనక ఉన్న అసలైన ఇంట్రెస్టింగ్ విషయం ఇదే!

# ఆశా కార్యకర్తల చలో అసెంబ్లీ భగ్నంకే ముందస్తు అరెస్టులు

- మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్




**మద్దూరు సెప్టెంబర్ 11, ప్రజా వాణి,** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని శుక్రవారం హైదరాబాద్ లో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకే ఆశా కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసినట్లు మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్ తెలిపారు.ఈ సందర్భంగా లద్నూరు గ్రామానికి చెందిన మాచేపల్లి ప్రవలిక, ఇమ్మడి పద్మ, మర్మాముల గ్రామానికి చెందిన కొండ మణెమ్మ, ఉప్పల నాగమణి, సాలకపూర్ గ్రామానికి చెందిన,మరియు, అరెస్టుఅయినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కనకయ్య, మహిళ పి సి భార్గవి,ఉన్నారు.

# గొడవను సర్ది చెప్పేందుకు వెళ్లిన సర్పంచ్ పై హత్యాయత్నం...



**హుజురాబాద్ సెప్టెంబర్ : 11 ( ప్రజావాణి ).** హుజురాబాద్ మండలం. లోని శాలపల్లి – ఇందిరానగర్ గ్రామ సర్పంచ్ కొడిగూటి ప్రవీణ్ పై అదే గ్రామానికి చెందిన దుబాసి రాజు అనే వ్యక్తి బటన్ చాకు తో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. " ఈ ఘటనపై బాధితుడు హుజురాబాద్ సీఐ టి. కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. గురువారం రాత్రి ఇందిరానగర్ గ్రామంలో యువకుల మధ్య ఘర్షణ జరుగుతోందని, గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారని సర్పంచ్ ప్రవీణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందింది. దీంతో గ్రామ ప్రథమ పౌరుడిగా గొడవను సర్దిచెప్పేందుకు ఆయన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.అక్కడ ఇరువర్గాలకు సర్దిచెప్పి గొడవను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తుండగా, ఘర్షణతో ఎలాంటి సంబంధం లేని దుబాసి రాజు తన అనుచరులతో కలిసి అక్కడికి వచ్చినట్లు సర్పంచ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గత కొంతకాలంగా తనపై కక్ష పెంచుకున్న దుబాసి రాజు అకస్మాత్తుగా తన వద్ద ఉన్న బటన్ చాకును తీసి తన గొంతు, పొట్ట, మెడ భాగాలపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించాడని తెలిపారు. ఈ దాడిలో తన పొట్ట, మెడకు గాయాలయ్యాయని, అప్రమత్తంగా వ్యవహరించడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని పేర్కొన్నారు.ఘటన సమయంలో అక్కడ ఉన్న గ్రామస్తులు దుబాసి రాజును నిలదీయగా, సర్పంచ్‌ను ఎప్పటికైనా చంపి తీరుతానంటూ బహిరంగంగా హెచ్చరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనపై హత్యాయత్నానికి పాల్పడిన దుబాసి రాజుపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తనకు రక్షణ కల్పించాలని సర్పంచ్ ప్రవీణ్ పోలీసులను కోరారు.

# మహిళలకు తీపి కబురు.. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లలో విజయ డెయిరీ ఉత్పత్తులు.. రూ.2 లక్షల రుణసాయం




**(ప్రజావాణి) సెప్టెంబర్ 11 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.** తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నడుస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లలో విజయ డెయిరీ పార్లర్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ నిర్ణయించింది. ఈ బృహత్తర కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యాంశాలు:అదనపు ఆదాయం: మహిళా స్వయం సహాయక సంఘాల (Women SHGs) సభ్యులకు ఇప్పటికే క్యాంటీన్ల ద్వారా వస్తున్న ఆదాయానికి తోడు, ఈ డెయిరీ పార్లర్ల ద్వారా అదనపు జీవనోపాధి లభిస్తుంది. రెండు దశల్లో విస్తరణ: ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 221 మహిళా శక్తి క్యాంటీన్లలో వీటిని తీసుకువస్తున్నారు. తొలి దశలో భాగంగా 96 క్యాంటీన్లలో డెయిరీ పార్లర్లను ప్రారంభించనుండగా, ఈ ఏడాది చివరి నాటికి మిగిలిన 125 క్యాంటీన్లకూ విస్తరిస్తారు. ఆర్థిక సహాయం (రుణ సదుపాయం): ఒక్కో పార్లర్ ఏర్పాటుకు దాదాపు రూ. 2 లక్షల వ్యయం అవుతుందని అంచనా. ఈ మొత్తాన్ని జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (NRLM) కింద సెర్ప్ (SERP) ద్వారా మహిళా సంఘాలకు రుణంగా అందిస్తారు. ఉత్పత్తుల విక్రయాలు: ఈ పార్లర్లలో విజయ డెయిరీకి చెందిన పాలు, పెరుగు, లస్సీ, మజ్జిగ, ఐస్‌క్రీమ్‌లతో పాటు టీ, కాఫీలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతారు. మహిళలను కేవలం గృహిణులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడనుంది.

# శ్రావణమాసంచివరిశుక్రరం

- అభిషేకాలు కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు
- శ్రీ చాముండేశ్వరి దేవి ప్రత్యేక అలంకరణ పూజలు
- పెద్ద సంఖ్యలో దర్శనానికి తరలి వచ్చిన భక్తులు



**చిలిపిచెడ్. సెప్టెంబర్ 11 ప్రజావాణి** శు క్రవారం(శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మెదక్ జిల్లా, చిలిపిచెడ్ మండలం, చిట్కుల్ గ్రామ శివారులోని ప్రసిద్ధ శ్రీ చాముండేశ్వరి దేవి ఆలయం భక్తులతో పోటెత్తింది. పవిత్ర మంజీరా నదీ తీరాన వెలసిన ఈ క్షేత్రంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్, పరిసర జిల్లాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.శ్రావణ మాసపు ముగింపు వేడుకల సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక విశేషాలు ప్రత్యేక అభిషేకాలు ఉ అలంకరణ: ఉదయం నుంచే అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శ్రావణ చివరి శుక్రవారం కావడంతో చాముండేశ్వరి దేవిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.భక్తుల క్యూలైన్లు తెల్లవారుజాము నుంచే భక్తులు మంజీరా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి, అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం, గాజులు కుంకుమార్చన ప్రత్యేక హారతి నిర్వహించారు.అన్నదానం ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా మధ్యాహ్నం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారు విస్తృతంగా నిర్వహించారు. ఆలయ విశేషాలు

దక్షిణ భారతదేశంలోనే రెండవ చాముండేశ్వరీ దేవి ఆలయంగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో అమ్మవారి విగ్రహం 18 చేతులతో, 9 అడుగుల ఎత్తుతో అత్యంత రమణీయంగా భక్తులకు దర్శనమిస్తుంది అని ఆలయ పూజారి తెలియజేశారు

మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ
శనివారం, సెప్టెంబర్ 12, 2026


# గాగిల్లాపూర్ లో వైద్య శిబిరం



**మద్దూరు సెప్టెంబర్ 11, ప్రజా వాణి,**మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ ఇట్టబోయిన కనక చంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ డాక్టర్లతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనక చంద్రం మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించడం వల్ల దాదాపు 85 మంది రోగులు హాజరు కావడం జరిగింది 30 మంది రక్ష పరీక్షలు చేయించుకొన్నారు. జ్వరంతో బాధపడుతున్న రోగులను ఇద్దరిని గుర్తించి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రజిత ఎంఓ,శ్రీనివాస్ సిహెచ్ఓ,లక్ష్మి హెచ్ ఎస్,ప్రశాంత్ ల్యాబ్ టెక్నీషియన్,నిర్మల హెచ్ ఏ, గ్రామ కార్యదర్శి రజియా, కారోబార్ శ్రీకాంత్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భూమిగారి రాజేందర్



**చేర్యాల సెప్టెంబర్11, ప్రజా వాణి,**సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రానికి చెందిన భూమిగారి రాజేందర్ ను జాతీయ కమిటీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఇటీవల హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నిర్మాణం చేయడం జరిగింది. ఇందులో భాగంగా భూమిగారి రాజేందర్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొని ఆమోద పత్రం అందించిన జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ ఈ సందర్భంగా భూమిగారి రాజేందర్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో ఇంతటి బాధ్యతను ఇచ్చిన జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ గార్లకు రాష్ట్ర కమిటీ మరియు జిల్లా కమిటీ మండలాల కమిటీ నాయకులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ను బలోపేతం చేస్తూ దళిత జాతి అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాశపాక రాజేందర్ మరియు గంట సుదర్శన్.మేడ స్వామి.సిద్ధిని రాజ మల్లయ్య . బొంబాయి వెంకన్న జిల్లా అధ్యక్షులు దేవులపల్లి రాజేందర్,జిల్లా ఇన్చార్జి లింగాల కృష్ణ,బాలిగారి కృష్ణ,దప్పు ఎల్లం,ముస్త్యాల నవీన్,గడ్డం వెంకటేష్,లింగాల మహేష్, లింగాల నర్సింలు తదితరులు పాల్గొన్నారు

# వరుసగా 4 రోజుల పాటు బ్యాంకులు బంద్...

● దేశవ్యాప్తంగా క్లోజ్- ముందే జాగ్రత్త పడండి..




**సెప్టెంబర్ 11 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** సెప్టెంబర్ 11న దేశవ్యాప్త బ్యాంక్ సమ్మెకు బ్యాంక్ యూనియన్లు పిలుపు నిచ్చాయి. వారానికి ఐదు రోజుల పని విధానం , పింఛను సమస్యల పరిష్కారం వంటి డిమాండ్లతో ఈ సమ్మె చేపడుతున్నారు. దీని ప్రభావంతో బ్యాంకులు వరుసగా నాలుగు రోజుల పాటు మూత పడ నున్నాయని చెప్పవచ్చు. సెప్టెంబర్ 11న సమ్మె ప్రభావంతో బ్యాంకు సేవలు ప్రభావితం కానుండగా..ఆ తర్వాత సెప్టెంబర్ 12న రెండో శని వారం బ్యాంకులకు సాధారణ సెలవు కావడం తో ఆ రోజు మూతపడ నున్నాయి. ఇక సెప్టెంబర్ 13న ఆదివారం బ్యాంకులు ఉండవు. ఆ తర్వాతి రోజు సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ సెలవుల కారణం గా బ్యాంకింగ్ కార్య కలాపాలు దేశవ్యాప్తంగా నిలిచిపోనున్నాయి. దీంతో సెప్టెంబర్ 11 నుంచి 14 వరకు వరుసగా నాలుగు రోజుల పాటు దేశ వ్యాప్తంగా బ్యాంకులు మూతపడనున్నాయని చెప్పవచ్చు. దీంతో వల్ల బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు , విత్‌డ్రాయల్స్, చెక్కుల క్లియరెన్స్‌తో పాటు ఇతర సేవలు నిలిచిపోనున్నాయి. సాధారణ ప్రజలతో పాటు వ్యాపార , వాణిజ్య వర్గాల పై ఇది ప్రభావం చూప నుంది. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే సెప్టెంబర్ 28 నుంచి మరో మూడు రోజుల పాటు , ఆపై అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగు తామని బ్యాంక్ ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి.

# ప్రజావాణి కథనానికి స్పందన..

● రోడ్డు పక్కన పడిపోయిన స్తంభాలను నిలబెట్టిన విద్యుత్ శాఖ అధికారులు.


ప్రజావాణి
రోడ్డు పక్కన స్తంభం పడి రోజులు గడుస్తున్నా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు.



**హుజూర్నగర్ సెప్టెంబర్ 11 (ప్రజావాణి)** "రోడ్డు పక్కన స్తంభం పడి రోజులు గడుస్తున్న పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు" అనే వార్త కథనానికి విశిష్ట స్పందన లభించింది. శుక్రవారం విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి హుజూర్నగర్ నియోజకవర్గ మఠంపల్లి మండలం లోని పెదవీడు, సుల్తాన్ పురం మధ్యలో గత వారం రోజులుగా రోడ్డు పక్కన రెండు స్తంభాలు పడిపోగా ఆ సమస్య గురించి ఎవరు పట్టించుకోకపోవడంతో "ప్రజావాణి దినపత్రిక" లో రోడ్డు పక్కన స్తంభాలు పడి ఉన్న వార్త ప్రచురణ అయింది. వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఉదయాన్నే రెండు స్తంభాలను నిలబెట్టి, సరిచేసి, విద్యుత్ లైన్ పునరుద్ధించారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, వార్తలను అధికారుల దృష్టికి చేరవేస్తున్న "ప్రజావాణి" దినపత్రిక కు మఠంపల్లి మండల మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొడ్డు కమలాకర్



**దండేపల్లి (సక్రమ ప్రజావాణి):**కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దండేపల్లి మండలానికి పెద్ద పేట గ్రామానికి చెందిన బొడ్డు కమలాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కమలాకర్ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# తల్లి దండ్రుల ఆశీర్వాదం.... గురువుల దీవెనలు విద్యార్థులకు ఉండాలి

● ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్







**మద్దూరు సెప్టెంబర్ 11, ప్రజా వాణి,**మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మద్దూరులో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమానికి అధ్యక్షులు కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఉచిత పుస్తకాలు నోట్ బుక్స్ ఉపకార వేతనాలు యూనిఫామ్స్ అందిస్తుంది దసరా తర్వాత నుండి మధ్యాహ్న భోజనం అమలు చేయుటకు సిద్ధంగా ఉంది కావున విద్యార్థులు విద్యార్థులు క్రమశిక్షణతో సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించి మెడిసిన్ ఇంజనీరింగ్ వైపు వెళ్లాలని మీరు మీ తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ దామర మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరు హాజరు అయ్యారు. వారు విద్యార్థిని విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అందుకోసం నా వంతు కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది గతంలో మెడిసిన్ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ రాసే విద్యార్థిని విద్యార్థులకు ఫీజు చెల్లించి విద్యార్థిని విద్యార్థులకు ఎంట్రన్స్ రాయించడం జరిగింది. ఈ సంవత్సరం కూడా అదేవిధంగా సొంత ఖర్చులతో మెడిసిన్ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ రాసే విద్యార్థిని విద్యార్థులకు ఫీజు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎండి సర్వర్,సర్పంచ్ మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ఆటపాటలతో సందడి చేశారు.


# ధాన్యం మా దగ్గర.. నష్టం మా మీదే!

■ మిల్లింగ్ చేస్తే నష్టాలు.. చేయకపోతే చర్యలు!
■ ఫిజికల్ వెరిఫికేషన్లు, రికవరీ భారం.. ఎఫ్‌సీఐలో స్థలం లేక డెలివరీకి బ్రేక్
■ కరెంట్, కూలీలు, రవాణా ఖర్చులు తడిసి మోపెడు.. రబీకి 100% బాయిల్డ్ రైస్ కోటా ఇవ్వాలని డిమాండ్
■ సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక మిల్లింగ్ బంద్.. జిల్లా కలెక్టర్ జోక్యంపై మిల్లర్ల ఆశలు








RICE MILLERS ASSOCIATION, NIRMAL DISTRICT

ధన్యవాదములతో ...

నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్



**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, సెప్టెంబర్ 10:--**ప్రభుత్వానికి ధాన్యం మిల్లింగ్ చేసి (సి ఎం ఆర్) బియ్యం అందిస్తున్న రైస్ మిల్లర్ల పరిస్థితి "ముందు నుయ్యి.. వెనుక గొయ్యి" అన్న చందంగా మారిందని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. మిల్లింగ్ ప్రక్రియలో సహజంగా వచ్చే నష్టాలను పరిగణనలోకి తీసుకోకుండా రికవరీ భారం మోపుతున్నారని, మరోవైపు ఎఫ్‌సీఐలో స్థలం లేక బియ్యం డెలివరీ ఆలస్యమైనా మిల్లర్లపైనే బాధ్యత పడుతోందని పేర్కొంది. ఇక విద్యుత్, కార్మికులు, రవాణా, యంత్రాల నిర్వహణ తదితర ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో మిల్లింగ్ నిర్వహణ ఆర్థికంగా భారంగా మారిందని సంఘం తెలిపింది. దీనికి తోడు ఫిజికల్ వెరిఫికేషన్లు, తనిఖీలతో మిల్లర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొంది. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రైస్ మిల్లర్స్ సంఘం నిర్ణయం మేరకు సెప్టెంబర్ 10 నుంచి మిల్లింగ్, ప్రొడక్షన్ కార్యకలాపాలను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లు ప్రకటించారు. మిల్లింగ్ సమయంలో నూకలు, తేమ, సోర్టెక్స్‌లో తొలగించే గింజలు తదితర కారణాలతో సహజంగా జరిగే నష్టాలను రికవరీలో పరిగణనలోకి తీసుకోవాలని మిల్లర్లు కోరుతున్నారు. ప్రతి రకం ధాన్యంపై టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి,వాస్తవంగా వచ్చే బియ్యం, నూకలు, సోర్టెక్స్ రిజెక్షన్‌ను ఆధారంగా చేసుకుని రికవరీ ప్రమాణాలు నిర్ణయిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నాణ్యమైన బియ్యం కోసం సోర్టెక్స్‌లో నల్లబడిన, రంగు మారిన, దెబ్బతిన్న గింజలను తొలగించాల్సి వస్తుందని, దీనివల్ల జరిగే నష్టాన్ని మిల్లర్ల తప్పిదంగా పరిగణించకూడదని చెబుతున్నారు. ఎఫ్‌సీఐలో స్థలం లేక డెలివరీ ఆలస్యమైతే తమను ఎందుకు బాధ్యులను చేయాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. మిల్లర్ల తప్పు లేకుండా జరిగిన ప్లేస్‌మెంట్ జాప్యాలకు పెనాల్టీలు, ఇతర చర్యలు తీసుకోకుండా వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. ఎక్కువకాలం నిల్వ ఉండటం వల్ల బియ్యం నాణ్యత తగ్గినా, దానికి మిల్లర్లను బాధ్యులను చేయడం సరికాదని పేర్కొన్నారు. రబీ ధాన్యాన్ని రా రైస్‌గా మిల్లింగ్ చేయడం వల్ల నూకలు అధికంగా రావడంతో పాటు నాణ్యత సమస్యలు తలెత్తుతున్నాయని మిల్లర్లు తెలిపారు. అందువల్ల రబీ సీజన్‌కు 100 శాతం బాయిల్డ్ రైస్ కోటా కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో పెరిగిన విద్యుత్, కూలీలు, రవాణా, హ్యాండ్లింగ్, డ్రైయేజ్, యంత్రాల నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా మిల్లింగ్ చార్జీలను పెంచాలని కోరుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న మిల్లింగ్ చార్జీలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణలోనూ క్వింటాల్‌కు రూ.150 వరకు మిల్లింగ్ చార్జీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ఫిజికల్ వెరిఫికేషన్లు, తనిఖీల పేరుతో మిల్లర్లపై అనవసర ఒత్తిడి,వేధింపులు ఉండకూడదని సంఘం కోరింది. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని రైస్ మిల్లర్ల సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కారం చూపాలని మిల్లర్లు కోరుతున్నారు. సమస్యలు పరిష్కారం కాకుండా మిల్లింగ్ కొనసాగిస్తే మరింత ఆర్థిక నష్టం తప్పదని, అందుకే నిరవధికంగా మిల్లింగ్ నిలిపివేయాల్సి వచ్చిందని వారు స్పష్టం చేస్తున్నారు. "ప్రభుత్వానికి బియ్యం అందించేది మేమే.. కానీ మిల్లింగ్ ఖర్చుల భారాన్ని కూడా మేమే భరించాల్సి వస్తోంది. మా సమస్యలను ప్రభుత్వం వాస్తవ పరిస్థితుల దృష్టితో పరిశీలించి న్యాయం చేయాలి" అని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

● పైడిపల్లి ప్రభుత్వ పా ఠశాలకు 50 బెంచీలు అందజేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి వెల్గటూరు, సెప్టెంబర్ 11:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా వెల్గటూరు మండలం పైడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు విశాఖ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50 బెంచీలను ఎంపీ గడ్డం వంశీకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గత 35 ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్నామని, భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలలకు కావాల్సిన ఇతర మౌలిక వసతులను కూడా సమకూర్చేందుకు కృషి చేస్తామని ఎంపీ పేర్కొన్నారు. పాఠశాలకు 50 బెంచీలు అందించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం మండల 'డబ్ల్యూజేఐ' నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.!





**కేసముద్రం, సెప్టెంబర్ 11, ప్రజావాణి.**జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) పనిచేస్తోందని జిల్లా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో డబ్ల్యూజేఐ కేసముద్రం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలు:గౌరవ అధ్యక్షుడు: కొత్తపల్లి రాములు,అధ్యక్షుడు: మారేపాక జగన్,ఉపాధ్యక్షుడు: బబురి సతీష్, ప్రధాన కార్యదర్శి: గంధం సతీష్, కోశాధికారి: రాజేంద్ర చారి,సహాయ కార్యదర్శి:గంధసిరి యాకన్న,అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మారేపాక జగన్, ప్రధాన కార్యదర్శి గంధం సతీష్‌లను జిల్లా అడహాక్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులు, భద్రత కోసం సంఘం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే హెల్త్ కార్డులు, ఫీజు రాయితీలు, సంక్షేమ పథకాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ బాధ్యులు పల్లె శ్రీనివాస్, కొండి సాయికిరణ్, ఆలకుంట్ల శ్రీనివాస్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై వివక్ష, దోపిడీని అరికట్టాలి

- పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి: కేవీపీఎస్






**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి: సెప్టెంబర్ 11** దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, భూ సమస్యలు, విద్య, ఉపాధి, గృహ వసతి, సంక్షేమ పథకాల అమలు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ రాజ్యాంగం దళితులకు సమాన హక్కులు కల్పించినప్పటికీ క్షేత్రస్థాయిలో నేటికీ కుల వివక్ష, అంటరానితనం, సామాజిక బహిష్కరణ, భూ ఆక్రమణలు, దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై నమోదయ్యే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదులు స్వీకరించడం, కేసులు నమోదు చేయడం, బాధితులకు పరిహారం అందించడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు.

అట్రాసిటీ బాధితులకు తక్షణ న్యాయం అందించాలని, కేసు నమోదైన 45 రోజుల్లో అర్హులైన బాధితులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అర్హత సహాయాలను వెంటనే విడుదల చేయడంతో పాటు కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నగదు బహుమతులను తక్షణమే అందించాలని కోరారు. దళితుల పట్టా, అసైన్డ్ భూములకు రక్షణ కల్పించి భూ సమస్యలను పరిష్కరించాలని, ఇల్లు లేని దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు దళితుల సమస్యలపై ఐక్యంగా పోరాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోదుంపల్లి శ్రవణ్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు.

దళితవాడల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని, దళిత యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధికే వినియోగించాలని, దళితులకు ప్రత్యేకంగా కేటాయించిన శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

దళిత మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టి రక్షణ కల్పించాలని, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలాంటి వివక్ష లేకుండా దళిత కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, ప్రతి సమస్య పరిష్కారానికి గడువు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.

దళితులపై జరుగుతున్న వివక్ష, దాడులు, భూ సమస్యలు, విద్య, ఉపాధి, గృహ సమస్యలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోదుంపల్లి శ్రవణ్, ప్రశాంత్, నాయకులు కుమ్మరి నవీన్, ఈర్ల లత, శ్రీనివాస్, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెరక సతీష్‌రెడ్డి, ఆది కృష్ణ, అభివర్ధన్, మధు, అరవింద్, శ్రీనాథ్, ఓంకార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై మెరిసిన కోదాడ ఉపాధ్యాయుడు చారుగుండ్ల రాజశేఖర్..

- జపాన్‌లో చారుగుండ్ల రాజశేఖర్‌కు అంతర్జాతీయ పురస్కారం..
- రీసెర్చ్ పేపర్ ప్రజెంటేషన్‌తో విశేష గుర్తింపు..








**కోదాడ, సెప్టెంబర్ 11/ ప్రజావాణి** జపాన్ దేశంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక విద్యా అధ్యయన పర్యటనలో కోదాడకు చెందిన ప్రముఖ ఉపాధ్యాయుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగుండ్ల రాజశేఖర్ అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రత్యేక గుర్తింపు పొందారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ నేతృత్వంలో సెప్టెంబర్ 5 నుండి 11 వరకు జరిగిన ఈ 7 రోజుల 'ఎక్స్‌పోజర్ విజిట్'లో జపాన్ విద్యా విధానంపై రాజశేఖర్ సమర్పించిన రీసెర్చ్ పేపర్ ప్రజెంటేషన్ విద్యావేత్తలను ఎంతగానో ఆకట్టుకుంది. అంతర్జాతీయ వేదికపై ఆయన చూపిన నైపుణ్యాన్ని గుర్తిస్తూ జపాన్ అంతర్జాతీయ విద్యాశాఖ సంచాలకులు తోసుఖా నోబో, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ లు రాజశేఖర్‌కు ప్రశంసా పత్రం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో కోదాడ ప్రాంతానికి, విద్యాశాఖకు ఖ్యాతి తెచ్చిపెట్టిన చారుగుండ్ల రాజశేఖర్‌ను స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్, విజయీభవ ట్రస్ట్, అవోపా కోదాడ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ నీలా సత్యనారాయణ, చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, కందిబండ వెంకటేశ్వరావు, పైడిమర్రి నారాయణ రావు, పైడిమర్రి సత్యబాబు, అవోపా జిల్లా అధ్యక్షులు ఇమ్మడి రమేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్
- పాత రికార్డులు, మ్యాపు ల ఆధారంగా భూ సరిహద్దుల కచ్చితమైన నిర్ధారణ
- సీఎస్ఆర్ నిధులతో రహదారి నిర్మాణానికి చర్యలు







**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (11 సెప్టెంబర్ 26):** భూ రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి, భూ సరిహద్దులను కచ్చితంగా నిర్ధారిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్, ట్యాబ్ పరికరాలతో చేపడుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. డిజిటల్ విధానంలో సర్వే నిర్వహించడం వల్ల సమయం, సిబ్బంది ఆదా కావడంతో పాటు ట్యాబ్‌లో నమోదైన సమాచారాన్ని నేరుగా కంప్యూటర్, ఆటోక్యాడ్‌లోకి మార్చుకునే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అమ్మగారిపల్లి, కుమ్మగూడెం పరిధిలో కాడస్ట్రల్ మ్యాపులు, పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సుమారు 1,900 ఎకరాలకు పైగా భూముల సరిహద్దులను నిర్ధారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 1920ల నాటి ఫసలీ రికార్డులతో పాటు బూర్గంపాడు తాలూకాకు సంబంధించిన పాత రికార్డులను పరిశీలిస్తున్నట్లు వివరించారు. మూడు తరాలుగా భూములను అనుభవిస్తున్నప్పటికీ రికార్డుల్లో ఉపవిభజనలు నమోదు కాకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గోదావరి వరదలు, భూమి కోతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పాత భూ సరిహద్దులు మారిపోయాయని, సీతారామ ప్రాజెక్టు పరిసరాల్లో కొన్ని చోట్ల సుమారు 250 మీటర్ల మేర మార్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు వివరించారు. 57/1 తదితర సర్వే నంబర్లలో నీట మునక, ఇసుక మేటల కారణంగా పాత భూ గుర్తులు కనుమరుగైనట్లు తెలిపారు.

కేఎంఎల్ ఫైళ్ల ఆధారంగా సుమారు 7.91 కిలోమీటర్ల మేర సరిహద్దులను గుర్తిస్తున్నామని, రోజుకు సుమారు 2 కిలోమీటర్ల చొప్పున సర్వే నిర్వహించి 2 నుంచి 4 రోజుల్లో పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు భూములపై స్పష్టత కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ప్రాంతంలో రహదారి నిర్మించాలని కలెక్టర్‌ను కోరగా, అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో అవసరమైన మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, సర్వే అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి..

- విద్యార్థులకు యూనిఫాంలు, షూలు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ..
- పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం..



**కోదాడ, సెప్టెంబర్ 11/ ప్రజావాణి** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ఆకాంక్షించారు. శుక్రవారం పట్టణంలోని 34వ వార్డు ప్రాథమిక పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ గంధం బాలేంద్ర, పాండుతో కలిసి ప్రభుత్వం నుంచి సరఫరా అయిన పాఠశాల యూనిఫాంలు, షూలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, షూలు అందజేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంధం బాలేంద్ర, పాండు, పంది తిరపయ్య, గుండెపంగు రమేష్, ఏపూరి రాజు, కాంపాటి పుల్లయ్య, కుడుముల రాంబాబు, వెంకటేష్, మహేష్, కృష్ణమూర్తి, తిరుపతయ్య, సైదులు, అజయ్, వంశీ ఉపాధ్యాయులు, వార్డు నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తుర్కపల్లి ఐటీ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి...

- టైర్ల పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి.
- ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య.



**సెప్టెంబర్ 11 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర శాసన సభలో తెలంగాణ ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండల అభివృద్ధి , యువతకు ఉపాధి అవకాశాలు , పరి శ్రమల కాలుష్య సమస్యల పై ప్రభుత్వ దృష్టికి పలు అంశాలను తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలంలో ఐటీ పార్క్ ఏర్పాటు కోసం సుమారు 110 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించడం జరిగిందని తెలిపారు. తుర్కపల్లి మండలం గిరిజన తండాలు , వెనుకబడిన గ్రామాలతో కూడిన ప్రాంత మని , ఇక్కడ ఐటీ పార్క్‌లో ఐటీ సంస్థలు , పరిశ్రమలు , ఇతర ఉపాధి కల్పించే సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. తుర్కపల్లి ప్రాంతంలో ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేసి ప్రముఖ సంస్థలను ఆకర్షిస్తే స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి స్థానిక యువతకు తగ్గుతుందని , తద్వారా తుర్కపల్లి ప్రాంతం ఆర్థికం గా అభివృద్ధి చెందు తుందని పేర్కొన్నారు. తుర్కపల్లి ప్రాంతంలో 110 ఎకరాల భూమిని ఐటీ పార్క్ కోసం సేకరించాం. ఇక్కడ పరిశ్రమలు , ఐటీ సంస్థలు ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవ కాశాలు లభిస్తాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ఐటీ పార్క్‌ను త్వరగా అభివృద్ధి చేయాలి" అని బీర్ల అయిలయ్య కోరారు.

టైర్ల పరిశ్రమల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి...

ఆలేరు నియోజకవర్గం లోని కాటేపల్లి , బొమ్మల రామరాం మండలం రంగపూర్ తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న టైర్ పరిశ్రమల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీర్ల అయిలయ్య శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు.

టైర్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ , కాలుష్య కారకాల వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడు తున్నారని , పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతి కూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలుష్యానికి గురయ్యే ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ముప్పు పెరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసి ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం , పర్యా వరణ పరిరక్షణ విషయం లో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని, సంబంధిత అధికారులు టైర్ పరిశ్రమలను సమగ్రంగా తనిఖీ చేసి , కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నాయా..లేదా పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లం ఘిస్తున్న పరిశ్రమలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని , ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని బీర్ల అయిలయ్య కోరారు. తుర్కపల్లి ఐటీ పార్క్ ద్వారా యువతకు ఉపాధి కాలుష్య నియంత్రణ ద్వారా ప్రజలకు ఆరోగ్యం అనే లక్ష్యంతో ప్రభుత్వం రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫైనాన్స్ వేధింపులే శ్యామ్‌కుమార్ ఆత్మహత్యకు కారణమా?

- నమ్రా ఫైనాన్స్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 11** పెద్దపల్లి: ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల వేధింపుల కారణంగానే దళిత యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని నమ్రా ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శ్యామ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఈ ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా రాణాపూర్ సర్పంచ్ భర్త ఇటికల శ్రీకాంత్ మాట్లాడుతూ.. మృతుడు శ్యామ్‌కుమార్ భార్య స్వర్ణలత నమ్రా ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.70 వేల రుణం తీసుకున్నట్లు తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఈ నెల రుణ వాయిదా చెల్లింపులో రెండు, మూడు రోజులు ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. అయితే వాయిదా చెల్లింపు ఆలస్యమైన కారణంగా ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు రెండు, మూడు రోజులుగా ఇంటికి వచ్చి శ్యామ్‌కుమార్, ఆయన భార్య స్వర్ణలత, తల్లిని అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ మానసికంగా వేధించారని ఆరోపించారు. ఈ వేధింపులతో శ్యామ్‌కుమార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని తెలిపారు. కుటుంబ సభ్యులు అప్పు తెచ్చేందుకు పక్కింటికి వెళ్లిన సమయంలో ఇంట్లో శ్యామ్‌కుమార్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఫైనాన్స్ ప్రతినిధుల వేధింపులే శ్యామ్‌కుమార్ ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

శ్యామ్‌కుమార్ మరణానికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫైనాన్స్ నిర్వాహకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుణ వసూళ్ల పేరుతో చట్టవిరుద్ధంగా వేధింపులకు పాల్పడుతున్న ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా రుణగ్రహీతలను వేధిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నమ్రా ఫైనాన్స్‌తో పాటు ఇతర ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల కార్యకలాపాలపై అధికారులు తక్షణమే విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. మృతుడు శ్యామ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

# మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**దండేపల్లి, సెప్టెంబర్ 11 ( ప్రజావాణి):** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. మండలంలోని లింగాపూర్, తాళ్లపేట గ్రామాలకు చెందిన రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసింది. లింగాపూర్ గ్రామానికి చెందిన రజిత ఇటీవల తన ఆరేళ్ల కుమార్తెతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడంతో, ఆమెకు చెందిన మూడేళ్ల కుమారుడు అనాథగా మిగిలాడు. ప్రస్తుతం వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్య గోట్ల లచన్న దంపతుల సంరక్షణలో ఉన్న బాలుడి పోషణ కోసం మండల కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా తాళ్లపేట గ్రామానికి చెందిన బతిని మహేష్ కాలేయ వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన మహేష్ చికిత్స కోసం ఆయన కుటుంబ సభ్యులకు మండల కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ మండల కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ముద్దసాని వేణు, మాజీ ఎంపీపీ జాబు కాంతారావు, సర్పంచ్ ఎల్తపు శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు మలవత్ రాజు, బానావత్ తిరుపతి, కారుకూరి తిరుపతి, బొడ్డు చరణ్, మాజీ ఎంపీటీసీలు ఇప్ప సురేందర్, బొడ్డు కమలాకర్, శివలాల్, మండల నాయకులు వనపర్తి రవి, కంది సతీష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుడు అడ్డై కాంతారావు, నాయకులు ప్రభాకర్, గెల్లు శ్రీనివాస్, సాదిక్, సల్లు, మాధవి శ్రీనివాస్, తాహజీమ్, డి. శంకర్, మన్సూర్, జాహిద్, వజీద్, కేసీఆర్, లక్ష్మయ్య, అంజన్న, సతీష్, కె. అంజి, ఎస్. అంజి, రవీందర్, రాజన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఓలకు గౌరవ వేతనం ఎప్పుడిస్తారు?

- వెంటనే నెలకు రూ.20 వేల గౌరవ వేతనం చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- గరిడేపల్లి తహసీల్దార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో బీఎల్ఓల వినతి



**గరిడేపల్లి, సెప్టెంబర్ 11 (ప్రజావాణి)** :ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ఎన్నో ఏళ్లుగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్ఓలకు) వెంటనే గౌరవ వేతనం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బీఎల్ఓలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గరిడేపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ.. 2013 నుంచి బీఎల్ఓలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇంతకాలం సేవలందిస్తున్నప్పటికీ వారికి తగిన గౌరవ వేతనం చెల్లించకపోవడం బాధాకరమన్నారు.నిరుపేద కుటుంబాలకు చెందిన అనేక మంది బీఎల్ఓలు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ రోజుకు సుమారు 12 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని యాకూబ్ పేర్కొన్నారు. ప్రారంభంలో నామమాత్రంగా రూ.1,000, రూ.1,500 చొప్పున చెల్లించినప్పటికీ, అనంతరం సరైన గౌరవ వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గత 16 సంవత్సరాలుగా సేవలందిస్తున్న బీఎల్ఓల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, నెలకు రూ.20 వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే దీర్ఘకాలంగా సేవలందిస్తున్న బీఎల్ఓలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.బీఎల్ఓల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రావుల వెంకన్న, ఎం. ఉమా, సైదమ్మ, ఎస్. నర్సిరెడ్డి, జయమ్మ, పద్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులను అరికట్టాలి

- బాధితుల ఫిర్యాదులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి
- కలెక్టర్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల ఐక్యవేదిక ధర్నా



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 11** దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు.పెద్దపల్లి మండలం పెద్దకల్వలో ప్లాట్ కొనుగోలు చేసేందుకు వెళ్లిన తనను కులం పేరుతో దూషించి, చంపుతామని చెలుకల శ్రీనివాస్, ఐలయ్య, మనోజ్ బెదిరించారని బాధితుడు కుక్క కనకరాజు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారుఈ విషయం తెలుసుకున్న దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బాధితుడి ఫిర్యాదుపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.దళితులపై దాడులు, కుల వివక్ష, బెదిరింపులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు యంత్రాంగాన్ని వారు కోరారు.బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని,సమస్యను పరిష్కరించక పోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, కుక్క అశోక్, బొంకూరి నరేందర్, మామిడిపల్లి బాపయ్య, నంబయ్య, సతీష్, రామిళ్ల శారద, కల్లపెల్లి అశోక్, మోదుంపెల్లి శ్రావణ్, నూనె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో 24 గంటల భజన





**చిలిపిచెడ్. సెప్టెంబర్ 11 ప్రజావాణి** చండూరు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం 7 గంటల 30 నిమిషాలకు 24 గంటల భజన కార్యక్రమం ప్రారంభం అయినది శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండి వర్షాలు పడాలని ఈ కార్యక్రమాన్ని శ్రీ రామలింగేశ్వర భజన మండలి సభ్యులు చేపట్టారు గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమం జరుగుతూనే ఉన్నది ఈరోజు ఉదయం ప్రారంభమైన భజన శనివారం ఉదయం 7:30కు నిమిషాలకు మూగియా నున్నదే గ్రామంలోని భజన మండలి సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు 24 గంటల భజన కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి గ్రామ సర్పంచ్ శేషాద్రి ఉప సర్పంచ్ వెంకటేశం సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి నారి స్వామి భజన మండలి గురుభక్తులు అనంతం నారాయణ కిష్టయ్య సోమ మల్లేశం పాండురంగం తోపాటు వందల మంది భక్తులు పాల్గొన్నారు

# చేపూర్‌లో ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



**ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్ 11 (మన సమగ్ర ప్రజావాణి):** ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామంలో గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎడ్ల పొలాల అమావాస్య వేడుకలను రైతులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పనుల్లో తమకు చేదోడు వాదోడుగా నిలిచే మూగజీవాలను, ముఖ్యంగా ఎడ్లను (బసవన్నలను) దైవస్వరూపంగా భావించి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం పశువులకు కృతజ్ఞతగా ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా చేపూర్ గ్రామ రైతులు ఉదయాన్నే తమ బసవన్నలను చెరువులు, వాగుల వద్దకు తీసుకెళ్లి శుభ్రంగా కడిగారు. అనంతరం ఎడ్ల కొమ్ములకు రంగులు పూసి, పూలదండలు, గజ్జలు, అందమైన జూళ్లతో వాటిని ముస్తాబు చేశారు. అనంతరం పశువులను ఇళ్లకు తీసుకువచ్చి మహిళలు ప్రత్యేకంగా హారతులు ఇచ్చారు. వివిధ రకాల నైవేద్యాలను తయారు చేసి బసవన్నలకు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ పశువుల ఆరోగ్యం, పంటల సమృద్ధి కోసం ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి, చేపూర్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బద్దం రాజు, రిక్కల రాజు, ఎన్ఎస్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఎస్కే సీను, మెడికల్ గంగారెడ్డితో పాటు గురడి రెడ్డి సంఘం సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు

- కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి
- వినాయక చవితి సందర్భంగా పటిష్ఠ బందోబస్తు
- వీపీఓల సేవలను సమర్థవంతంగా వినియోగించాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,






**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 11** మెదక్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లాలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా దర్యాప్తును పూర్తి చేసి, సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు.గ్రేవ్ కేసుల్లో సంఘటనా స్థలంలో లభించే ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని తెలిపారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా పటిష్ఠమైన కేసులు నమోదు చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక దృష్టి సారించి బాధితుల ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని, ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో వారెంట్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.రాబోయే వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.
విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వీపీఓల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిమజ్జన మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.
నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన ఐఓలు రేణుకరెడ్డి, వెంకటరాజాగౌడ్, రంగా కృష్ణతో పాటు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.ఈ సమావేశంలో డీఎస్పీలు సుభాష్‌చంద్రబోస్, నరేందర్‌గౌడ్, సీఐలు రేణుక, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరాజాగౌడ్, జార్జ్, సందీప్‌రెడ్డి, కృష్ణమూర్తి, రంగా కృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలు మానుకోవాలి

- మంథని మార్కెట్ ను యుద్ధప్రతీపదికన వెంటనే పూర్తిచేసి రైతులకు,,, ప్రజలకు అందుబాటులోకి తేవాలి
- ప్రజల కోసం మా స్వంత భూములు ఇచ్చిన సుదీర్ఘ చరిత్ర మా కుటుంబా నికి ఉంది
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** ఈరోజు మంథని బిజెపి పార్టీ ఆఫీసులో జరిగిన సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ..మంథని అభివృద్ధి కాంక్షించే రాజకీయ పార్టీలలో మొదటి స్థానంలో నిలిచేది భారతీయ జనతా పార్టీ అని అందుకుగాను కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు మంథని పురపాలక సంఘానికి వస్తున్న కోట్లాది నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులకు భారతీయ జనతా పార్టీ ఎప్పుడు మద్దతుగా నిలుస్తుందని ఈ అభివృద్ధికి ఆటంకం కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదని చెప్పారు.కానీ కొందరు పనిగట్టుకుని మంథని మున్సిపల్ మార్కెట్ భవన నిర్మాణ పనులలో జాప్యానికి తమ కుటుంబమే కారణం అంటూ విష ప్రచారం తో రాజకీయం చేయాలని చూస్తున్న వారికి గట్టి హెచ్చరిక చేశారు.చందుపట్ల రామ్ రెడ్డి గారి హయాంలో మంథని మార్కెట్ కి పునాదులు పడ్డాయని ఆ మార్కెట్ అభివృద్ధి లో మా సలహా సూచనలు ఎప్పుడు అందిస్తూనే ఉన్నామని. అనాలోచితంగా తొందరపడి భవన నిర్మాణం చేయకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అన్ని సౌకర్యాలతో ఆ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ సిబ్బందికి గాని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి గాని భారతీయ జనతా పార్టీ నుండి నిరంతరం సూచనలు చేస్తూనే ఉన్నాం అని ఆయన చెప్పారు.
మంథని అభివృద్ధి చెందకూడదని కేవలం అసూయ ద్వేషంతో బట్ట కాల్చి మీద పడేసి రాజకీయాలు చేద్దామని చూసే వారికి మంథని ప్రజానీకం ఎప్పుడు కర్ర కాల్చి వాత పెడుతుందనే విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు.రాజకీయంలో వ్యక్తిత్వమే ప్రధానమని కొందరు నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం ఎదుటి వారిపై అసత్య ప్రచారాలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ప్రజాసేవలో తమ కుటుంబానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని గుర్తు చేశారు. గత 15 సంవత్సరాలుగా ప్రజల కోసమే నిరంతరం పనిచేస్తూ సేవా భావంతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్ మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ వొజ్జల మురళీకృష్ణ పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్ ఎడ్ల సాగర్ ఉపాధ్యక్షులు బొల్లంపల్లి లక్ష్మణ్ ఆ ఇంటి మల్లేష్ కార్యదర్శి పార్వతి విష్ణుఓబీసీ మోర్చా అధ్యక్షులు గుడ్లగురవేష్ మండల ఉపాధ్యక్షులు ఎల్ల వేణి సమ్మయ్య నాయకులు చందు సాయి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# వైద్యం వికటించి ఆరు నెలల గర్భవతి మృతి.. కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

- ఎదుగుదల లేని శిశువు తొలగింపు.. చికిత్స పొందుతూ గాంధీలో వివాహిత కన్నుమూత
- పెళ్లయిన ఎనిమిది నెలలకే అనంత లోకాలకు.. కొండాపూర్, రామకృష్ణపూర్ లో తీవ్ర విషాదం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంతాపం



**కోనరావుపేట:- సెప్టెంబర్ 11 ప్రజావాణి**
కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో ఆరు నెలల గర్భవతి హారిక (25) మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన మల్యాల ప్రభాకర్, లక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె హారికకు ఎనిమిది నెలల క్రితం కొడిమ్యాల మండలం రామకృష్ణాపూర్ కు చెందిన వ్యక్తితో వివాహమైంది. ప్రస్తుతం ఆరు నెలల గర్భవతి అయిన ఆమె, వైద్య పరీక్షల కోసం ఇటీవల సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా.. గర్భంలో శిశువు ఎదుగుదల లేదని వైద్యులు తెలిపారు. దీంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడ శస్త్రచికిత్స చేసి శిశువును తొలగించారు.
అనంతరం హారిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు బుధవారం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్ ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. విప్ ఆది శ్రీనివాస్ గాంధీ హాస్పిటల్ వైద్య బృందంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయితే చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం హారిక మృతి చెందింది. భర్త బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశంలో ఉండగా, పెళ్లయిన ఎనిమిది నెలలకే హారిక అనంతలోకాలకు వెళ్లడంతో కొండాపూర్, రామకృష్ణపూర్ గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. హారిక మృతిపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సర్పంచ్ గౌతమి ప్రశాంత్, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, గ్రామస్తులు, తోటి స్నేహితులు తీవ్ర సంతాపం తెలిపారు.

# భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి.. అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

- చిట్టిరామవరం తండాలో డిజిటల్ భూ రీ సర్వే పనుల పరిశీలన





**కొత్తగూడెం/మన ప్రజావాణి (11 సెప్టెంబర్ 26):** కొత్తగూడెం మండలం చిట్టిరామవరం తండాలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను శుక్రవారం రోజు అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను వినియోగిస్తూ చేపడుతున్న డిజిటల్ భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్, సర్వేలో అనుసరిస్తున్న విధానం, భూముల కొలతలు, వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతిపై సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. అనంతరం స్థానిక రైతులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి భూ రీ--సర్వేకు సంబంధించి వారి అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రీ సర్వే ద్వారా భూముల వివరాలు మరింత కచ్చితంగా నమోదు కావడంతో పాటు, భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్ డాక్టర్ స్వప్న, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ హనుమాన్ ఆలయంలో తృటిలో తప్పిన పెను ప్రమాదం!

**హుజూరాబాద్ సెప్టెంబర్ : 11 ( ప్రజావాణి )**హుజూరాబాద్ పట్టణ కేంద్రంలోని పురాతన హనుమాన్ ఆలయంలో శుక్రవారం ఉదయం తృటిలో పెను ప్రమాదం తప్పింది.

హుజూరాబాద్ రూరల్: హుజూరాబాద్ పట్టణ కేంద్రంలోని పురాతన హనుమాన్ ఆలయంలో శుక్రవారం ఉదయం తృటిలో పెను ప్రమాదం తప్పింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆలయంలో భక్తులు ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో గర్భగుడి పైకప్పు (స్లాబ్) పెచ్చులు ఒక్కసారిగా భారీ శబ్దంతో కిందపడ్డాయి. అయితే ఆ సమయంలో భక్తులు కొద్దిదూరంలో ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అక్కడున్న భక్తులు తీవ్ర భయాందోళనలకు గురై ప్రాణభయంతో ఆలయం నుంచి బయటకు పరుగులు తీశారు. తృటిలో పెను ముప్పు తప్పడంతో ఆలయ వర్గాలు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

హుజూరాబాద్ హనుమాన్ ఆలయానికి సుమారు 75 ఏళ్ల చరిత్ర ఉన్నప్పటికీ, సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఆలయ పునరుద్ధరణ, మరమ్మతుల కోసం ప్రభుత్వాలు తగిన నిధులు



మంజూరు చేయలేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలయం శిథిలావస్థకు చేరుకుంటున్నప్పటికీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఘటనా స్థలానికి ఆలయ కమిటీ సభ్యులు"ఘటనా స్థలానికి ఆలయ కమిటీ సభ్యులు

స్లాబ్ పెచ్చులు కూలిన విషయం తెలియగానే ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక శంకర్, డైరెక్టర్ బళ్ళు పున్నం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిపడిన స్లాబ్ శకలాలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఈ విషయాన్ని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ప్రణవ్ బాబు దృష్టికి తీసుకెళ్లారు.ఆలయ దుస్థితిపై స్పందించిన ప్రణవ్ బాబు.. ఆలయ పునరుద్ధరణ, మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి తక్షణమే ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని ఆలయ కమిటీకి హామీ ఇచ్చారు.

భక్తుల భద్రతకు భరోసా కల్పించాలి

తమ కష్టాలు తీర్చి, రక్షణ కల్పించమని మొక్కుకునేందుకు దేవాలయానికి వెళ్తే.. అక్కడే ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆలయానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీ హనుమాన్ ఆలయంలో 24 గంటల అఖండ రామ నామ భజన





**చిలిపిచెడ్, సెప్టెంబర్ 11 (ప్రజావాణి):** చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్ గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో శ్రావణ మాస ముగింపు సందర్భంగా 24 గంటల అఖండ శ్రీరామ నామ భజన కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు.గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన "శ్రీరామ జయరామ జయ జయ రామ" అనే బీజాక్షర మంత్రంతో కూడిన అఖండ భజన శుక్రవారం ఉదయం 10 గంటల వరకు నిర్విరామంగా, ఎలాంటి ఆటంకం లేకుండా సాగింది. భక్తులు జట్లు జట్లుగా ఏర్పడి భజనలో పాల్గొని ఆలయ ప్రాంగణాన్ని రామ నామ స్మరణతో మార్మోగించారు.ఈ అఖండ భజన కార్యక్రమాన్ని శ్రీ హనుమాన్ భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా నిర్వహిస్తుండడం విశేషం. శ్రావణ మాసం పవిత్ర మాసం కావడంతో ప్రతి ఏటా ఈ మాసం ముగింపు సందర్భంగా రామ నామ భజన చేయడం ద్వారా గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు వృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం.ఈ కార్యక్రమంలో భాగంగా గురుస్వామి రాజేందర్ (రాజు) ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయానికి స్థల దానం చేసిన నిర్మాణం చేసిన దాతలను, ఎంతో కాలంగా భజన మండలికి సేవలందిస్తున్న భజన మండలి సభ్యులను, గ్రామ పెద్దలను ఘనంగా శాలువాతో సత్కరించారు. అదేవిధంగా భజన మండలి సభ్యులు గురుస్వామి రాజేందర్ ను శాలువా కప్పి ప్రత్యేకంగా సన్మానించారు.భజన అనంతరం టేకుల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు, భజన మండలి సభ్యులు, మహిళా భక్తులు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైస్ మిల్లల సమస్యలు పరిష్కరించాలి..

- సమస్యలు పరిష్కరించే వరకు నిర్వాదిక సమ్మె కొనసాగుతాం.
- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట రైస్ మిల్లర్ల నిరసన

**రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి** రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో రైస్? మిల్లులపై కొనసాగుతున్న విజిలెన్స్, ఎన్?ఫోర్స్?మెంట్?దాడులను వెంటనే నిలిపివేయాలని, మిల్లర్లను దొంగలుగా చిత్రీకరించడం మానుకోవాలని రైస్? మిల్లర్లు ప్రభుత్వాన్ని డిమాండ్? చేశారు. ఏండ్లుగా పెండింగ్?లో ఉన్న మిల్లింగ్?, హమాలీ చార్జీలు, కమీషన్? బకాయిలను వెంటనే చెల్లించాలనే తదితర 13 ప్రధాన డిమాండ్లతో జిల్లా వ్యాప్తంగా మిల్లులను బంద్? చేసిన సిబ్బంది, హమాలీలు, మిల్లర్లు నల్ల కండువాలు ధరించి కలెక్టరేట్ల వద్ద మహా ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రా రైస్ మిల్ అసోసియేషన్? జిల్లా అధ్యక్షులు పబ్బ నాగరాజు బైల్డ్ రైస్ మిల్



జిల్లా అధ్యక్షులు చేపూరి నాగరాజ మాట్లాడారు.కొద్దిమంది తప్పు చేస్తే అందరినీ బాధ్యుల్ని చేస్తూ గత 48 రోజులుగా విజిలెన్స్? దాడుల పేరుతో కేసులు నమోదు చేసి జైళ్లకు పంపడం, మానసిక క్షోభకు గురిచేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కెపాసిటీకి మించి ధాన్యాన్ని కేటాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సీఎంఆర్? బకాయిల పేరుతో 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీ విధించడాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్? చేశారు. ఖరీఫ్? ధాన్యాన్ని పూర్తిగా రా రైస్?గా, రబీ ధాన్యాన్ని బాయిల్డ్? రైస్?గా మాత్రమే స్వీకరించాలని, 2014 నుంచి పెండింగ్?లో ఉన్న మిల్లింగ్?, స్టోరేజీ, హమాలీ చార్జీలు, కమీషన్? బకాయిలను క్వింటాలుకు రూ.150 చొప్పున చెల్లించాలని కోరారు.ప్రభుత్వం సూచన మేరకు కోట్ల రూపాయలు వెచ్చించి మిల్లులను అప్?గ్రేడ్? చేసినా కనీస బకాయిలు కూడా ఇవ్వకుండా సీఎంఆర్? త్వరగా ఇవ్వాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోయి డిఫాల్ట్? అయిన మిల్లర్లకు లెక్కలు పూర్తిగా తేల్చి, బకాయిలను నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించాలని, మిల్లులకు సబ్సిడీపై కరెంట్? సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, కలెక్టరేట్?లోకి వెళ్లడానికి మిల్లర్లు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు జరిగింది. అనంతరం జెసి నగేష్ కు మిల్లర్లు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు.

# జామ్లతండాలో జ్వరాలు..

- సర్పంచి సూచనతో అప్రమత్తమైన ఇనుగుర్తి పీహెచ్సీ
- వైద్య పరీక్షలు నిర్వహణ, ఉచిత మెడిసిన్ అందజేత..

**ప్రజావాణి,ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి శివారు జామ్ల తండాలో ప్రజలు వైరల్ జ్వరాలకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచి మద్దెల బిక్షపతి గౌడ్ తండాలోని జ్వరాల పరిస్థితిని మండల కేంద్రం ఇనుగుర్తి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.సురేష్ దృష్టికి తీసుకువచ్చారు.దీంతో తక్షణమే



స్పందించిన వైద్యాధికారి డా.సురేష్ ఆదేశాల మేరకు శుక్రవారం జామ్ల తండాలో వైద్య సిబ్బంది జ్వర బాధితులై న 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ తండాలోని చాలామంది గిరిజనులకు వాతావరణ పరిస్థితుల దృష్ట్యానో మరేదైనా కారణం వలననో జ్వరాలకు గురికావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.త్వరగా అందరూ కోలుకోవాలని ఆకాంక్షించారు. సంబంధిత డిసీజ్ పట్ల వెంటనే స్పందించిన మెడికల్ ఆఫీసర్ సురేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.మళ్లీ మళ్లీ తండాను సందర్శించి అన్నా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచి ఇస్లావత్ బాబు, పంచాయతీ కార్యదర్శి రమణ మూర్తి, ఏఎన్ఎం మంజుల, వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మట్టి మనుషులు నడిపిన మహత్తర పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటము

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం
- అమరజీవి అనుమాల లింగయ్య గారు పార్టీకి చేసిన సేవలు అమోఘం
- గన్నా చంద్రశేఖర్ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

**గరిడేపల్లి సెప్టెంబర్ 11(ప్రజావాణి)**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటము నిస్వార్థంగా చేసిన పోరాటం అని,సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాలలో చేర్చి బావి తరాలకు అందించాల్సిన అవసరం వున్నదనితెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 80 వ వార్షికోత్సవాల సందర్భంగా సిపిఐ గరిడేపల్లి మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ మండలంలోని పొనుగోడు గ్రామం లో, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పొనుగోడు గ్రామ మాజీ సర్పంచ్, తన ఆస్తిలో కుమారుడితో సమానం గా పార్టీ కి ఆస్తిని పంచి ఇచ్చిన మహా మనిషి అనుమాల లింగయ్య గారి స్తూపం వద్ద ఈరోజు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నవాబ్ నిరంకుశంత్వానికి వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం, 1946 నుండి 1951 వరకు చారిత్రాత్మకమైన పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని ఆయన అన్నారు.

225 సంవత్సరాల పాటు హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నవాబ్



పరిపాలన చేసినారని ,

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో హైదరాబాద్ సంస్థానం లోని ప్రజలపై వేధింపులు,పన్నుల పై పన్నులు వేసేవారని,మహిళలను చిత్ర హింసలకు గురి చేసినారని ఆయన అన్నారు.

నైజాం నవాబ్ అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఆయుధాలు ధరించి పోరాడినారని ఆయన అన్నారు.ఆనాడు వెట్టిచాకిరీ పేరు తో ప్రజలను దోచుకునే వారని,రైతులు పండించిన పంటలను పన్నుల రూపంలో దోచుకునే వారని, వాటన్నిటికీ వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు చేసి ప్రజలను విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టులదని ఆయన అన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను హిందూ, ముస్లింల పోరాటంగా బీజేపీ చెప్తుందని ఆది తప్పని,

చరిత్రను వక్రీకరించి బీజేపీ పబ్బంగడుపుకోవాలని చూస్తుందని ఆయన అన్నారు.ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో ప్రజలు గ్రామాల్లో సంఘం ఏర్పాటు చేసుకుని ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు సాగినారని ఆయన అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదని ఆయన అన్నారు.4000 మంది కమ్యూనిస్టులు ఆ పోరాటంలోప్రాణాలు కోల్పోయినారని ఆయన అన్నారు.3000 వేల గ్రామాల్లో స్వయం పాలన ఏర్పాటు చేసుకున్నారని. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడి నారని. ఆయన అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వలన దేశ వ్యాప్తంగా ఉన్న అనేక సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసినారని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా అనేక పోరాటాలకు మార్గదర్శిగా తెలంగాణ రైతంగా సాయుధ పోరాట చరిత్ర వున్నదని ఆయన అన్నారు..తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపాల వద్ద,పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండాలను ఆవిష్కరించి నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య,ఏ ఐ టియు సి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి,రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు బిల్లా కనకయ్య,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, వేశాల ఆంజనేయు లు,కుందూరు వెంకటరెడ్డి,పోకల ఆంజనేయు లు, రంగాపురం గ్రామ సర్పంచ్ కట్టా కళ్యాణి,ప్రతాని సైదులు, చేవ్వా వెంకన్న, సాగి వెంకటేశ్వరావు,కుంభం వెంకటి,రెడపంగు సైదులు,పగడాల శ్రీనివాస్,బాల శౌరి,నవీన్ చారీ,అంబటి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, పంగ గోవిందు ,పంగా సైదులు, ఈశ్వరాచారీ, పంగ సైదయ్య, సోమయ్య, బండారు నాగయ్య, లక్షమయ్య,జక్కంపూడి శ్రీనివాస్, షేక్ నబి సాహెబ్, పీర్ సాహెబ్, దొండపాడు సైదులు,నబి సాహెబ్, ఈద నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# చలో అసెంబ్లీకి వెళ్లకుండా ముదిరాజుల ముందస్తు అరెస్టులు

- డిమాండ్ల సాధన కోసం 'హలో ముదిరాజ్--చలో అసెంబ్లీ' కార్యక్రమం





**ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 11:**ముదిరాజుల సమస్యలు, హక్కుల సాధన కోసం చేపట్టిన 'హలో ముదిరాజ్--చలో అసెంబ్లీ' కార్యక్రమానికి వెళ్లకుండా నంగునూరు మండల కేంద్రంలో పలువురు ముదిరాజులను రాజగోపాల్‌పేట పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి ముదిరాజులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లే అవకాశం ఉండడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ముదిరాజులు మాట్లాడుతూ తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం బీసీ–డీ కేటగిరీలో ఉన్న ముదిరాజులను బీసీ–ఏలోకి మార్చాలని, ముదిరాజుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.అలాగే చేప పిల్లల పంపిణీలో జరుగుతున్న అవినీతిని అరికట్టి అర్హులైన మత్స్యకారులకు పారదర్శకంగా చేప పిల్లలను పంపిణీ చేయాలని కోరారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ముదిరాజులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సోప్పరి ఎల్లాదాసు,కొండిళ్ల రాజు, తదితరులు ఉన్నారు.తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా కార్యక్రమానికి వెళ్తున్న తమను ముందస్తుగా అరెస్టు చేయడం సరైన చర్య కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముదిరాజుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

**మంథని నియోజకవర్గ ఇన్చార్జ్, సెప్టెంబర్ 11, ప్రజావాణి:** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం లో ఈ నెల 8న మంథని రూరల్, మంథని అర్బన్, ముత్తారం, రామగిరి ఎస్‌జీఎఫ్ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా ప్రారంభించగా, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. "గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం -- క్రీడల ద్వారా ప్రతిభకు ప్రోత్సాహం" అనే లక్ష్యంతో క్రీడా



పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ పోటీల ద్వారా ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, వ్యాయామ



ఉపాధ్యాయులు, నిర్వాహకులను ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మాచ్ది రాజు గౌడ్, ఆర్ టిఐ మెంబర్ మంథని సురేష్, పీఈటి దొమ్మటి రవి, కొమురోజు శ్రీనివాస్, వివిధ పాటశాలల ఉపాద్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.. ముళ్ళ పొదలతో కుసంగి దన్నారం రోడ్డు

- ముళ్ళ పొదల మధ్య ప్రయాణం.. ప్రమాదాల బాటగా కుసంగి దన్నారం రోడ్డు



**టేక్మాల్ సెప్టెంబర్ 11: (మన ప్రజావాణి)** ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు టేక్మాల్ మండలం కుసంగి నుంచి దన్నారం, మల్కాపూర్, వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అంచుల వరకు ముళ్ల పొదలు విస్తరించడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకోవడం కష్టంగా మారింది.ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారి ఇరువైపులా పెరిగిన పొదల కారణంగా ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు మరింత ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు వెళ్లే సూచిక బోర్డులు లేక కూడా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారుఅధికారులు స్పందించి రహదారి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను వెంటనే తొలగించి, ప్రయాణికులకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



**ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 11:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శివకోటి ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట ఏసీపీ క్రైమ్ బ్రాంచ్ సదన్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి హాజరయ్యారు. వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన దశ అని, ఈ రెండేళ్లను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.ప్రిన్సిపల్ శివకోటి మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చేలా క్రమశిక్షణతో మెలగాలని, చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల సూచనలను పాటిస్తూ తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో నంగునూరు సర్పంచ్ సానాదుల బాలపోచయ్య పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన విద్యార్థులు ఎలాంటి భయాలు, సంకోచాలు లేకుండా కళాశాల వాతావరణానికి అలవాటు పడుతూ విద్యలో రాణించాలని ఆకాంక్షించారు అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మడూర్ క్లస్టర్ పరిధిలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్11, మన ప్రజావాణి:** చిన్నశంకరం పేట మండల పరిధిలోని మడూర్ క్లస్టర్ లో ఉన్న రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ రైతు గుర్తింపు కార్డు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి శేకర్ తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే పి యం కిసాన్ వంటి పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అని పేర్కొన్నారు.కావున మడూర్ క్లస్టర్ పరిధిలోని ప్రతి రైతు తప్పనిసరిగా రైతు గుర్తింపు కార్డు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోని రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని లేదా తమకు సమీపంలోని మీసేవ కేంద్రం ద్వారా కూడా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవచ్చని రైతులకు సూచించారు.

# 13న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి భూమిపూజ



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సక్రమ ప్రజావాణి):** ఈ నెల 13న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం కార్యదర్శి ఎలుగురి వేణు మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలోని ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరూ అధిక సంఖ్యలో హాజరై భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రోడ్లపై గుంతలు.. వాహనదారులకు ప్రమాదాలు.

● మోరీలు వేసి రోడ్లు మరిచారు



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంథని నుండి గోదావరిఖని వెళ్లే ప్రధాన రోడ్డుపై మోరీలు ( డ్రైనేజీ పనులు ) వేసినా అనంతరం వాటిని సక్రమంగా పూడ్చి రోడ్లను పునరుద్ద రించక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పనులు పూర్తయిన ప్రాంతాల్లో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీరు చేరడంతో అవి కనిపించగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి గాయపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు రాత్రి వేళలో గుంతలు కనిపించగా ప్రమాదాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగాలు సాధించిన గాయత్రి కళాశాల విద్యార్థినులు




**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 11:** పెద్దపల్లి జిల్లాలో టాస్క్ (టాస్క్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ డ్రైవ్‌లో గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.కళాశాలకు చెందిన పెగడ అంజలి (బీబీఏ), కాసర్ల శ్రీజ (బీఎస్సీ--ఎంఎస్‌టీడీఎస్) ఐసీఐసీఐ బ్యాంకులో ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్‌లుగా ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.3.12 లక్షల నుంచి రూ.3.80 లక్షల వరకు వేతన ప్యాకేజీ లభించనుంది.జాబ్ డ్రైవ్‌లో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ గంగ ప్రసాద్, టాస్క్ రీజినల్ సెంట్రల్ మేనేజర్ కౌసల్య, ఐసీఐసీఐ బ్యాంకు ప్రతినిధి కందునూరి సతీష్‌తో పాటు వారి బృందం పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు.ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అభినందించారు. అలాగే కళాశాల ప్రిన్సిపల్ జే. రవీందర్, టాస్క్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె. కుమార్, అధ్యాపకులు విద్యార్థినులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# కోతులపై కొరడా!

- 6,500 కోతుల కథకు ఫుల్‌స్టాప్!
- కోతుల బెడదపై సమరం..
- యుద్ధప్రాతిపదికన నియంత్రణ చర్యలు
- దశలవారీగా పట్టుకుని నిర్మల్‌కు తరలింపు:
- కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబరు 11:** మెదక్ జిల్లాలో కోతుల బెడదకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అధికార యంత్రాంగం సమరానికి సిద్ధమైంది. ప్రజలు, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న కోతుల నియంత్రణకు భారీ కార్యాచరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో, వాటి నియంత్రణ కార్యక్రమాన్ని ఉద్యమంలా, యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు.

ప్రజలు, రైతులకు కోతుల బెడద నుంచి త్వరితగతిన ఉపశమనం కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. కోతుల సంఖ్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా నియంత్రణ చర్యలు అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.

మెదక్‌లో 3 వేలు.. నర్సాపూర్‌లో 2 వేలు

మున్సిపల్ కమిషనర్లు రూపొందించిన నివేదికల ప్రకారం మెదక్‌లో సుమారు 3,000, నర్సాపూర్‌లో 2,000, తూప్రాన్‌లో 1,000, రామాయంపేటలో 500 కోతులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఆయా ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రతను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో ముందుగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ ప్రతిమా సింగ్ గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు, ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోతుల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

పట్టుకుని.. నిర్మల్‌కు తరలింపు

కోతులను పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి, అవసరమైన ఆపరేషన్ అనంతరం అక్కడి అటవీ ప్రాంతాల్లో వదిలేలా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. కోతుల బెడద వల్ల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్యల్లో వేగం పెంచాలని ఆమె ఆదేశించారు. ఒక్కో ప్రాంతాన్ని ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకుని దశలవారీగా చర్యలు చేపడితే జిల్లాలో కోతుల సమస్యను గణనీయంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

ఉద్యమంలా.. సమష్టిగా

కోతుల నియంత్రణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ముందుకు సాగాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అధికారులు,ప్రజలు, రైతులు సమష్టిగా సహకరించాలని కోరారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ప్రజలు, రైతులకు కోతుల బెడద నుంచి శాశ్వత ఉపశమనం కల్పించడంతో పాటు మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమీక్షలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం..

- రోగిని కదిలించాల్సిన అవసరం లేకుండా పడక వద్దే ఎక్స్‌రే
- రేడియాలజీ సేవలకు నిపుణుల బలం.. ఖాళీల భర్తీకి చర్యలు





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆసుపత్రిలోని అవసరాలను గుర్తించడం, వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకు రావడం, వాటికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, వైద్య నిపుణుల కొరతను అధిగమించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విస్తరణకు రాష్ట్ర మంత్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల బలోపేతానికి అందుబాటులోకి వచ్చాయి. దీంతో అవసరమైన రోగులకు వేగంగా అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని బట్టి పరీక్షలు నిర్వహించేందుకు ఈ పోర్టబుల్ యంత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని సమాచారం.అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి తరలించాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వైద్యుల సూచన మేరకు అవసరమైన ప్రదేశంలోనే పరీక్ష నిర్వహించే వెసులుబాటు ఏర్పడుతోంది.

ఖమ్మం సర్వజనాసుపత్రిలో త్వరలో ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రానుంది. ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవతో వేగంగా పూర్తి చేస్తున్నారు. ఎంఆర్ఐ యంత్రానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యంత్రం ఏర్పాటు చేసిన తర్వాత అది నిరంతరాయంగా ప్రజలకు సేవలందించేలా అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు.

మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలు, తదితర ప్రాంతాలకు సంబంధించిన అనేక సమస్యలను గుర్తించడంలో ఎంఆర్ఐ పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవ అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు అధిక వ్యయంతో కూడిన ప్రైవేటు పరీక్షల భారం తగ్గనుంది.

సర్వజనాసుపత్రిలో పోర్టబుల్ ఎక్స్‌రే, స్థిర ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఓపీ, ఐపీ రోగులకు అవసరాన్ని బట్టి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం అందుబాటులో ఉండటం వల్ల కదలలేని రోగులను పడక నుంచి ఎక్స్‌రే విభాగానికి తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గింది. రోగిని పడకపైనే ఉంచి అవసరమైన సమయంలో అక్కడికక్కడే ఎక్స్‌రే తీసే సదుపాయం ఏర్పడింది.తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, అత్యవసర చికిత్స పొందుతున్నవారు, కదలడానికి ఇబ్బంది ఉన్న రోగులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. రోగిని తరలించే సమయంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంతో పాటు వైద్యులకు త్వరగా పరీక్షా ఫలితాలు అందే అవకాశం ఏర్పడింది. అదనంగా ఓపీ, ఐపీ సేవలకు ఎక్స్‌రే యంత్రాలను వినియోగిస్తున్నారు. టీ-హబ్‌లో అదనపు ఎక్స్‌రే యంత్రంతో పాటు మామోగ్రఫీ, స్కానింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అల్ట్రాసౌండ్ సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు.జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, అత్యవసర తదితర విభాగాలకు వచ్చే రోగులకు అవసరాన్ని బట్టి అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జూలైలో 1,977, ఆగస్టులో 1,943 స్కాన్లు నిర్వహించడం ద్వారా సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్న విషయం స్పష్టమవుతోంది.గర్భిణీలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ఖమ్మం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 16,961 స్కాన్లు నిర్వహించారు. వీటిలో 8,945 ఓబీజీ స్కాన్లు , 5,417 ఉదర భాగం స్కాన్లు , 546 టిఫ్ఫా స్కాన్లు, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి.

నెలవారీగా పరిశీలిస్తే ఓబీజీ స్కాన్లు జనవరిలో 910 నుంచి ఆగస్టులో 1,329కు పెరిగాయి. ఉదర భాగం స్కాన్లు జనవరిలో 455 ఉండగా జూలైలో 999కు చేరాయి. చిన్నారులకు నిర్వహించిన స్కాన్లు ఆగస్టులో 388కు చేరాయి.ఇది మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరీక్షా సేవల వినియోగం పెరుగుతున్న దానికి నిదర్శనంగా నిలుస్తోందిమాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణీల కోసం ప్రత్యేకంగా టిఫ్ఫా స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భధారణలో సాధారణంగా ఐదు నుంచి ఆరో నెల మధ్య నిర్వహించే ఈ పరీక్ష ద్వారా గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే పరిశీలించే అవకాశం ఉంటుంది. పిండంలో అవయవ లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ముందుగానే వైద్య ప్రణాళిక రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రైవేటు వైద్య కేంద్రాల్లో సాధారణంగా సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చయ్యే ఈ తరహా సేవను ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఉచితంగా అందించడం గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరం. టిఫ్ఫా స్కాన్ల సంఖ్యలోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఫిబ్రవరిలో 19 గా ఉన్న స్కాన్లు , ఆగస్టులో 136కు చేరాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 546 టిఫ్ఫా స్కాన్లు నిర్వహించారు.సర్వజనాసుపత్రిలో కలర్ డాప్లర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. రక్త నాళాల్లో రక్తప్రసరణను పరిశీలించడం, రక్త నాళాల్లో ఏర్పడే అడ్డంకులను గుర్తించడం వంటి వాటికి ఈ పరీక్ష ఉపయోగపడు తుంది. రక్తనాళాల్లో కొవ్వు నిల్వలు లేదా ఇతర కారణాలతో ఏర్పడే అడ్డంకులను గుర్తించేందుకు కలర్ డాప్లర్ సహాయపడు తుంది. డీప్ వీన్ థ్రాంబోసిస్, సిరలకు సంబంధించిన సమస్యలు, ధమనుల్లో రక్తం గడ్డకట్టడం వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది.

సకాలంలో వ్యాధిని గుర్తించి అవసరమైన వైద్య చికిత్స లేదా శస్త్రచికిత్స అందించడం ద్వారా చేతులు, కాళ్లకు కలిగే నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుంది.

ప్రైవేటు వైద్య కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు సుమారు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ఖర్చయ్యే సేవను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోంది.

సర్వజనాసుపత్రిలో కాంట్రాస్ట్ సీటీ స్కాన్ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నారు. పగలు, రాత్రి మూడు షిఫ్టుల్లో సేవలు కొనసాగిస్తూ అవసరమైన రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కణితులు, వివిధ అవయవాల స్థితిగతులు, ప్రమాదాల్లో గాయాల తీవ్రత వంటి అంశాలను తెలుసుకోవడంలో సీటీ స్కాన్ కీలకంగా ఉంటుంది. హెచ్‌ఆర్ సీటీ స్కాన్ ద్వారా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులను స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుంది.

మెదడు సంబంధిత వ్యాధులు, పక్షవాతం, మెదడు కణుతులు, ప్రమాదాల్లో గాయాలు తదితర సమస్యలను గుర్తించడంలో కూడా సీటీ స్కాన్ సేవలు ఉపయోగపడు తున్నాయి. ఈ సేవలు ప్రభుత్వ ఆసుపత్రి లోనే అందుబాటులో ఉండటం వల్ల రోగులు బయటకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతోంది.

గతంలో రేడియాలజిస్టుల కొరత కారణంగా రేడియాలజీ సేవల నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి. సమస్య తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవ తీసుకుని రేడియాలజీ సేవలను బలోపేతం చేసే చర్యలు చేపట్టారు. ఇటీవల డాక్టర్ సురేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. దీంతో రేడియాలజీ విభాగానికి మరింత నిపుణుల బలం చేకూరింది.

అదే విధంగా అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా, పరిధిలోని వైద్య నిపుణుడు డాక్టర్ మురళీకృష్ణను సర్వజనాసుపత్రికి కేటాయించేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఫలితంగా రేడియాలజీ సేవలు మరింత పటిష్టమై ప్రజలకు నాణ్యమైన నిర్ధారణ సేవలు అందించే అవకాశం ఏర్పడింది.ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన మానవ వనరులపై కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసేలా చర్యలు చేపట్టారు. వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు వాటిని సమర్థవంతంగా వినియోగించేందుకు అవసరమైన వైద్య నిపుణుల సేవలు కూడా అందుబాటులోకి రావడం ద్వారా ఆసుపత్రి వైద్య సామర్థ్యం మరింత పెరుగుతోంది.

కొత్త వైద్య పరికరాలు అందుబాటులోకి రావడం ఒక దశ మాత్రమే. వాటిని ప్రజలకు నిరంతరం ఉపయోగపడేలా చేయడం మరింత ముఖ్యమైన అంశం. ఈ దిశగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

యంత్రాల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులు, విద్యుత్ సదుపాయాలు, వైద్య నిపుణుల అందుబాటు, సిబ్బంది ఖాళీల భర్తీ వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందుబాటులో ఉండటమే కాకుండా వాటి ద్వారా ప్రజలకు నిరంతర సేవలు అందే పరిస్థితి ఏర్పడుతున్నదని

అత్యాధునిక పరీక్షలు అందుబాటులోకి రావడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఆర్థిక భరోసా లభిస్తోంది. అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్‌ఆర్ సీటీ, మామోగ్రఫీ, టిఫ్ఫా వంటి అనేక సేవలు అందుబాటులో ఉండటంతో ఖరీదైన ప్రైవేటు పరీక్షా కేంద్రాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతోంది. గర్భిణీల నుంచి చిన్నారుల వరకు, సాధారణ రోగుల నుంచి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి వరకు వివిధ వర్గాలకు అవసరమైన వైద్య సేవలను ఒకే ప్రభుత్వ వైద్య వ్యవస్థలో అందించే దిశగా ఆసుపత్రి ముందుకు సాగుతోంది.ఆసుపత్రిలో అందుబాటులోకి వస్తున్న కొత్త సేవలను ప్రజలు క్రమంగా వినియోగించు కుంటున్నారు. జనవరి నుంచి ఆగస్టు వరకు అల్ట్రాసౌండ్ సేవల్లో నమోదైన 13,816 పరీక్షలు, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన 16,961 స్కాన్లు దీనికి నిదర్శనం.అత్యాధునిక పరీక్షా సదుపాయాలు, వైద్య నిపుణుల సేవలు, నిరంతర రేడియాలజీ సేవలు, అత్యవసర రోగులకు పడక వద్దే ఎక్స్‌రే వంటి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతోంది.ఆరోగ్య సమస్యలు తీవ్రతరం అయ్యే వరకు వేచి చూడకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించు కోవడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. వైద్యుల సూచన మేరకు అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్‌ఆర్ సీటీ, మామోగ్రఫీ వంటి పరీక్షలను వినియోగించుకోవాలి.ప్రజలు ఈ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రి మీ ఆరోగ్యానికి అందుబాటులో ఉంది.. ఆధునిక వైద్య సేవలు మీ కోసం అందుతున్నాయి.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

## కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబానికి పోలీస్ శాఖ అండ

- రూ.4.21 లక్షల ఆర్థిక సాయం చెక్కు అందజేత
- మహిపాల్ భార్యకు ఉద్యోగం వచ్చేలా చర్యలు:
- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,






**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 11** విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివంపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అండగా నిలిచింది. మహిపాల్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి సేకరించిన రూ. 4.21 లక్షల ఆర్థిక సాయం చెక్కును శ జిల్లా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, మహిపాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కొన్ని రోజుల క్రితం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిపాల్ మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మహిపాల్ కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. "మీరు కూడా పోలీస్ కుటుంబంలో భాగమే. మీకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా నన్ను సంప్రదించండి. పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుంది" అని ఎస్పీ భరోసా ఇచ్చారు.

మహిపాల్‌కు సంబంధించి శాలరీ అకౌంట్ ద్వారా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిపాల్ భార్యకు త్వరగా ఉద్యోగం వచ్చేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి మహిపాల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## చిలిప్‌చెడ్ మండల స్థాయి క్రీడా పోటీలలో సత్తా చాటిన జడ్పీహెచ్‌ఎస్ ఫైజాబాద్ విద్యార్థులు



**చిలిపిచెడ్. సెప్టెంబర్ 11 ప్రజావాణి** తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల క్రీడా సంఘం (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో చిలిప్‌చెడ్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఫైజాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలలో పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలు:

1. కబడ్డీ అండర్ -14 బాలుర విభాగం - ప్రథమ స్థానం

మండలంలోని పలు పాఠశాలలను ఓడించి ఫైజాబాద్ బాలుర జట్టు విజేతగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది.

2. ఖో-ఖో అండర్ -17 బాలికల విభాగం - ప్రథమ స్థానం

బాలికలు చూపిన చురుకుదనం, సమిష్టి కృషికి నిదర్శనంగా ఖో-ఖో పోటీలలో ప్రథమ స్థానం సాధించి పాఠశాలకు పేరు తెచ్చారు.

3. కబడ్డీ అండర్ -14 బాలికల విభాగం - ద్వితీయ స్థానం

బాలికల కబడ్డీ జట్టు హోరాహోరీగా పోరాడి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారా సింగ్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్ మాట్లాడుతూ, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని, జిల్లా స్థాయిలో కూడా రాణించి రాష్ట్ర స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, ఏ ఏ పీ సీ చైర్మన్, గ్రామ పెద్దలు మరియు తల్లిదండ్రులు అభినందించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## షేక్ నాసిర్ భీ కి నివాళి

- కార్యక్రమంలో పాల్గొన్న నూర్ భాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాషా



**ముదిగొండ సెప్టెంబర్ 11 ప్రజావాణి ప్రతినిధి** ముదిగొండ మండల పరిధిలోని అమ్మపేట సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు షేక్ సైదులు సతీమణి షేక్ నాసిర్ బి పార్థివదేహానికి పుష్పగుచ్చాలు తో నూర్ భాష దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ భాష పాల్గొని నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మేకపోతుల వెంకయ్య వార్డు సభ్యులు ఊటుకురి రామారావు , ఊటుకూరి యాలాద్రి , పిచ్చయ్య,మేకపోతుల సత్యం ,షేక్ హాసన్ రాధాకృష్ణ నాగుల్ మీరా,ముప్పిడి సర్వయ్య ,ముప్పిడి స్వామి , దుగ్గి వీరయ్య ,మునగాల గోపి ,ఉడుం సైదులు,కుమ్మయ్య మరియు కుటుంబ సభ్యులు పార్టీ కార్యకర్తలు మైనార్టీ సెల్ నాయకులు నివాళులు అర్పించారు.

## నాణ్యమైన విద్యుత్ ఇవ్వకపోతే జాతీయ రహదారి దిగ్బంధం, సబ్ స్టేషన్ల ముట్టడి చేస్తాం..

- కళ్లముందే పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు..
- సూర్యాపేట విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ నిరసన.




**కోదాడ, సెప్టెంబర్ 11/ ప్రజావాణి** రైతులను ఆదుకోవాలనే కనీస ఆలోచన, చిత్తశుద్ధి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆయన బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి సూర్యాపేట జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కి వినతిపత్రం అందచేసి, అనంతరం ఎస్ఈ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఏ మారుమూల గ్రామంలో చూసినా నేడు రైతులు ఆందోళన చేసే పరిస్థితి దాపురించింది. అప్పులు చేసి నాట్లు వేసుకుంటే, కళ్ల ముందే పచ్చని పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. దున్నపోతు మీద వర్షం పడ్డట్లుగా ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది. నీళ్లు, కరెంటు ఇవ్వలేని ఈ ప్రభుత్వం రైతుల మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. పంటలు పండితే ధాన్యం కొనాల్సి వస్తుందని, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే నెపంతో అసలు పంటలే పండకుండా చేయాలని కుట్ర చేస్తోంది. కృష్ణా జలాలను పక్క రాష్ట్రాలకు తరలిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోంది. అప్రకటిత విద్యుత్ కోతలు, నాణ్యత లేని కరెంటు వల్ల రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయి. మోటార్లు బాగుచేయించుకోవడానికి రైతులు వారాల తరబడి మెకానిక్ షాపుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. కేసీఆర్ పదేళ్ల పాలనలో కనురెప్పపాటు కూడా కరెంటు పోలేదు. కానీ నేడు ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితి ఉంది. వెంటనే విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి, పచ్చని పంటలను రక్షించడానికి 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందించాలనీ, చెరువులు నింపడానికి, భూగర్భ జలాలు పెంచడానికి నిరంతరాయంగా సాగర్ జలాలను విడుదల చేయాలనీ. వరి పంటల కోతలు పూర్తయ్యే వరకు సాగర్ నీటిని ఆయకట్టుకు ఏ విధంగా ఇస్తారో వెంటనే షెడ్యూల్ (క్యాలెండర్) ప్రకటించాలనీ , బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించినట్లుగా 14వ తేదీలోపు క్యాలెండర్ ప్రకటించకపోతే పాదయాత్ర చేపడతామని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఎస్ఈ ని కలిసి పరిస్థితిని వివరించాం. కిందిస్థాయి అధికారులు తాము పైనుంచి వచ్చిన ఆదేశాలే పాటిస్తున్నాం అంటున్నారు. ఉన్నతాధికారులతో, మంత్రులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. మరో మూడు, నాలుగు రోజులు వేచి చూస్తాం. అప్పటికీ పరిస్థితి చక్కబడక, నాణ్యమైన విద్యుత్ అందించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, రైతుల సమన్వయంతో హైవేలను (జాతీయ రహదారులను) దిగ్బంధిస్తాం, నియోజకవర్గంలోని అన్ని సబ్ స్టేషన్లను ముట్టడిస్తాం అని ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

## ఎన్టీఆర్ చౌరస్తా వద్ద బస్ షెల్టర్ ప్రారంభం..




**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,సెప్టెంబర్ 11:**వికారాబాద్ పట్టణంలోని 29వ వార్డు ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కొత్తగా నిర్మించిన బస్ షెల్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య శుక్రవారం ప్రారంభించారు. వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి,ఇతర కౌన్సిలర్లతో కలిసి ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.?ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ. నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఎండ,వానల నుంచి ఉపశమనం కల్పించేందుకే ఈ బస్ షెల్టర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. పట్టణంలో ప్రజా సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యమిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు,పురపాలక అధికారులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి...!

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.
- వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్.
- వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీ సమీక్ష.





**//వేములవాడ నియోజకవర్గం// సెప్టెంబర్ - 11 (ప్రజావాణి)** వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ, ఇతర శాఖల అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు.

వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మురికి నీటి కాలువ, విద్యుత్ టవర్ల నిర్మాణం, రోడ్డు నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఒక్కో పనిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో అడిగి తెలుసుకున్నారు.

ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధునాతన గోశాల పురోగతిపై వివరాలు సేకరించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని,నిర్మాణ ప్రక్రియలో జాప్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు మరింత మంది కూలీల సంఖ్యను పెంచాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్ గడువులోగా ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఆయా శాఖల అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలిం చాలని, పనులు వేగంగా పూర్తి అయ్యేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

కార్యక్రమాల్లో ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ భీమ్లా నాయక్, డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, తహసీల్దార్ జయంత్, రాజన్న ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## "ప్రజావాణి కథనానికి" స్పందన .. కేసముద్రం స్కూల్‌కు బయాలజీ టీచర్ నియామకం!

- డిప్యూటేషన్ పై గూడూరు పాఠశాలకు చెందిన వి.రాజును కేసముద్ర పాఠశాలకు బదిలీ


ప్రజావాణి
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
బడి ఉంది.. పిల్లలూ ఉన్నారు.. మరి 'బయాలజీ' టీచర్ ఎక్కడ?

**కేసముద్రం సెప్టెంబర్ 11,ప్రజావాణి.** మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'ప్రజావాణి' ప్రచురించిన కథనానికి జిల్లా అధికారులు తక్షణమే స్పందించారు. గత రెండు, మూడు నెలలుగా ఇక్కడ బయాలజీ బోధన నిలిచిపోవడంతో విద్యార్థుల చదువు దెబ్బతింటున్న విషయాన్ని పత్రిక వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు.. విద్యార్థులకు బయాలజీ బోధించేందుకు ఉపాధ్యాయుడు వి.రాజును తక్షణమే సదరు పాఠశాలకు డిప్యుటేషన్ పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేసిన అధికారులకు, ఇందుకు కృషి చేసిన 'ప్రజావాణి' పత్రికకు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## లక్నపూర్ రోడ్డు సమస్య వల్ల, ప్రాణాలు పోతున్నాయి.



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా పరిగి,సెప్టెంబర్ 11:**మా తరపున కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాటం చేయాలనీ పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ని కలిసిన మిట్టకోడూరు,చిగురల్ పల్లి,లక్నపూర్, గోవిందపూర్, కిష్టమ్మా గుడి తండా,పరిగి మున్సిపల్ 8వ వార్డు గ్రామస్థులు. వెంటనే లక్నపూర్ రోడ్డు పనులు మొదలు పెట్టకుంటే త్వరలో గ్రామాల తరపున ధర్నాలో పాల్గొంటా అని,గ్రామస్థులకు హామీ ఇచ్చిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి,శిలాపలకం వేసి,రెండు ఎడ్లు గడిచిన, రోడ్డు వేయలేదు అని ఆయా గ్రామస్తులు పాదయాత్రగా రోడ్డు పైన బైటయించిన గ్రామస్తులు. మహా అర్భటంతో మొదలు పెట్టిన,లక్నపూర్ రోడ్డు పనులు శిలాపథకానికే పరిమితం అయింది అని,గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సరిగ్గా లేక,మా గ్రామస్తుల ప్రాణాలు పోతున్న కూడా,స్థానిక ఎమ్మెల్యే కి బుద్ధి రావడం లేదు ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారులు కూడా మా సమస్యల పట్ల నిర్లక్ష్యం వాయిస్తూన్నారు అని,లక్నపూర్ రోడ్డు పనులు పూర్తి చేసి పరిగి నుంచి లక్నపూర్ రోడ్డు మార్గన ఉన్న గ్రామాల ప్రజల ప్రాణాలు కాపాడాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు.

## డీజే పెడితే కేసులే --సిఐ రమేష్



**చేర్యాల సెప్టెంబర్ 11 ప్రజావాణి** చేర్యాల దూలిమిట్ట మద్దూరు కొమురవెల్లి మండలాలలోని ఆయా గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల ముందు డీజే లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ అన్నారు శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయా మండలాలలోని గ్రామాల సర్పంచుల తో సమావేశం నిర్వహించారు మట్టి విగ్రహాలు ప్రోత్సహించాలని ఎలాంటి గొడవలు పడకుండా భక్తితో పండుగను జరుపుకోవాలని డీజే పెడితే మాత్రం కఠిన చర్యలు తప్పవని తెలిపారు ఈ కార్యక్రమంలో చేర్యాల ఎస్సై అపూర్వ రెడ్డి మద్దూరు ఎస్సై అసిఫ్ ఆయా గ్రామాల సర్పంచులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

# సీపీ అంబర్ కిషోర్‌ను కలిసిన మంథని మున్సిపల్ చైర్మన్



**మంథని నియోజకవర్గ ఇంచార్జ్, సెప్టెంబర్ 11, ప్రజావాణి:** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ను మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంథని మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలు, ప్రజలకు సంబంధించిన అంశాలపై సీపీతో చర్చించారు. ముఖ్యంగా మంథని పట్టణంలో నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలను సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలీసు బందోబస్తు, ముందస్తు చర్యలపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ఆయుష్ వైద్య విద్యార్థులకు 'డబుల్' ధమాకా.. స్టైఫండ్ భారీగా పెంపు!

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయుష్ వైద్యులు.**
- **కృతజ్ఞతలు చెప్పిన.కేసముద్రం మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ.**



**కేసముద్రం సెప్టెంబర్ 11,ప్రజావాణి.**తెలంగాణలోని ఆయుష్ ప్రభుత్వ వైద్య విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌ను పరిష్కరిస్తూ, హౌస్ సర్జన్లు మరియు పీజీ వైద్య విద్యార్థుల స్టైఫండ్‌ను భారీగా పెంచుతూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అల్లోపతి జూనియర్ డాక్టర్లతో సమానంగా ఆయుష్ విద్యార్థులకు కూడా వేతనాలు అందించాలని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో ప్రకారం పెరిగిన స్టైఫండ్ వివరాలు హౌస్ సర్జన్లు: ఇప్పటివరకు ఉన్న రూ. 13,754 స్టైఫండ్‌ను ఏకంగా రూ. 29,792కు పెంచారు.పీజీ వైద్య విద్యార్థులు: గతంలో ఉన్న రూ. 34,385 స్టైఫండ్‌ను రూ. 74,482కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.స్టైఫండ్ పెంపు జీవో విడుదలైన నేపథ్యంలో ఆయుష్ విద్యార్థులు, సీనియర్ డాక్టర్లు సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రిని ఘనంగా సత్కరించారు.

వైద్య రంగానికి లభించిన ఆర్థిక భరోసా: డాక్టర్ అల్లం రమ.

ప్రభుత్వ నిర్ణయంపై కేసముద్రం మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆయుష్ విద్యార్థుల సమస్యను మానవీయ కోణంలో అర్థం చేసుకుని, స్టైఫండ్‌ను భారీగా పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ నిర్ణయం విద్యార్థులకు ఎంతో ఆర్థిక భరోసానిస్తుంది. భవిష్యత్తులో వారు తమ విద్యాభ్యాసం, శిక్షణపై మరింత దృష్టి పెట్టడానికి ఇది దోహదపడుతుంది, అని పేర్కొన్నారు. అలాగే రాబోయే రోజుల్లో సాంప్రదాయ ఆయుష్ వైద్య విధానాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.

# మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం: జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే...!

- **మట్టి గణపతిని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ప్రతి ఒక్కరు ముందుకు రావాలి.**
- **కాలుష్య నివారణకు మట్టి విగ్రహాల వినియోగాన్ని మనందరం ప్రోత్సాహిస్తాం.**



**//వేములవాడ నియోజకవర్గం// సెప్టెంబర్ - 11 (ప్రజావాణి)**రాజన్న సిరిసిల్ల: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మట్టి గణపతులను పూజించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రంగులు వాడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ప్రాశీూ) విగ్రహాల వల్ల జల కాలుష్యం, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. పోలీస్ శాఖ తరపున పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.అలాగే జిల్లా వ్యాప్తంగా గణేష్ మండపాల నిర్వహకులు పోలీస్ వారి సూచనలు, సలహాలు పాటిస్తూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేలా సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ రూపొందించిన గణేష్ పోర్టల్‌లో తమ మండపాల వివరాలను నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం




**మంథని నియోజకవర్గ ఇంచార్జ్, సెప్టెంబర్ 11, ప్రజావాణి:** సాంకేతిక సమస్య కారణంగా మంథని పట్టణంలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న శుక్రవారం సాయంత్రం, 12న శనివారం ఉదయం నీటి సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకుని మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ కోరారు.

# పెండింగ్ కేసులు ఇక చాలు.. దర్యాప్తు వేగవంతం చేయాలి"

- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు
- "కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు..
- నిందితులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు"
- వినాయక చవితికి హై అలర్ట్..
- నిమజ్జనం వరకు అప్రమత్తంగా ఉండాలి"
- "పెండింగ్ కేసులపై ఎస్పీ సీరియస్..
- గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాల్సిందే"
- "శాంతిభద్రతలపై ప్రత్యేక నజర్..
- గణేష్ ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు"
- "వీపీఓల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించాలి..
- అవాంఛనీయ ఘటనలకు చెక్ పెట్టాలి"
- కేసుల దర్యాప్తులో జాప్యం సహించం
- పెండింగ్ కేసులను గడువులోగా పూర్తి చేయాలి.. నిందితులకు శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు
- వినాయక చవితికి పటిష్ఠ బందోబస్తు.. వీపీఓ ల సేవలను సమర్థవంతంగా వినియోగించాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు






**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 11**మెదక్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా దర్యాప్తును పూర్తి చేసి, సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో సంఘటనా స్థలంలో లభించే ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని తెలిపారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా పటిష్ఠమైన కేసులు నమోదు చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక దృష్టి సారించి బాధితుల ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని, ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో వారెంట్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

వినాయక చవితికి పటిష్ఠ బందోబస్తు

రాబోయే వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వీపీఓల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిమజ్జన మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసలు

నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన ఐఓలు రేణుకరెడ్డి, వెంకటరాజాగౌడ్, రంగా కృష్ణతో పాటు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు సుభాష్‌చంద్రబోస్, నరేందర్‌గౌడ్, సీఐలు రేణుక, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరాజాగౌడ్, జార్జ్, సందీప్‌రెడ్డి, కృష్ణమూర్తి, రంగా కృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణనలో బీసీ కుల గణనను తప్పనిసరిగా చేర్చాలి...

- కులగణనతోనే బీసీలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం.
- తెలంగాణ కులగణన దేశానికే రోడ్‌మోడల్.
- ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య.



**సెప్టెంబర్ 11 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** జనగణనలో ఎస్సీ , ఎస్టీల వివరాలను సేకరిస్తున్న తరహాలోనే బీసీల సమగ్ర వివరాలను కూడా తప్పని సరిగా సేకరించాలని ఆలేరు ఎమ్మెల్యే , రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ఎంత ఉందో ఖచ్చితమైన లెక్కలు తెలితేనే వారికి విద్య , ఉద్యోగ , ఉపాధి , రాజకీయ అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం న్యాయం చేయడం సాధ్య మవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర శాసన సభలో 'జనగణనలో కులగణనను పొందు పరచాలి' అనే అంశంపై జరిగిన లఘు చర్చలో బీర్ల ఐలయ్య మాట్లాడారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే రోడ్ మోడల్‌గా నిలిచిందని అన్నారు. ఎన్ని కోర్టు కేసులు , ఇబ్బందులు ఎదురైనా సామాజిక న్యాయం లక్ష్యంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కుల గణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం 2025 మార్చిలో శాసనసభలో చట్టం చేసి బీసీలకు విద్య , ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో 42 శాతం , స్థానిక సంస్థల రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించి కేంద్రానికి పంపామని ఐలయ్య చెప్పారు.అయితే కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించ కుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కేంద్రం అడ్డంకులు సృష్టించినప్పటికీ స్థానిక సంస్థలు , మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు బీసీలకు 50 శాతానికిపైగా సీట్లు కేటాయించామని తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ ఆలోచన లను తొలుత తెలంగాణ లో అమలు చేసి రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపామని అన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 3,500 కిలో మీటర్లు పాదయాత్ర చేసి దేశంలోని వివిధ వర్గాల ప్రజల స్థితిగతులను తెలుసుకున్నారని చెప్పారు. 'జనాభా దామాషా ప్రకారం అవకాశాల్లో వాటా' కల్పించాలన్న ఆయన ఆలోచనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**1931 తర్వాత తొలిసారి తెలంగాణలో కులగణన...**

స్వాతంత్ర్యానికి ముందు 1931లో జరిగిన కుల గణన తర్వాత తెలంగాణ లో ప్రజా పాలనలోనే తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టామని బీర్ల ఐలయ్య తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెడ్డి సామాజిక వర్గానికి చెందినప్పటికీ బీసీల సంక్షేమం కోసం ఆలోచించి కులగణన నిర్వహించారని అన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికి మార్గ దర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2027లో చేపట్టనున్న జనగణనలో బీసీల వివరాలను పొందు పరచకపోతే ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీసీల జనాభాపై సమగ్ర సమాచారం లేకపోతే వారికి అందాల్సిన వాటా, అవకాశాలను నిర్ణయించ డం సాధ్యం కాదన్నారు. బీసీ కులగణనను జనగణనలోని 10వ ప్రశ్నావళిలో చేర్చాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణలో బీసీల జనాభా 56.36 శాతం...**

తెలంగాణలో సుమారు నాలుగు కోట్ల జనాభాలో బీసీలే అత్యధికంగా ఉన్నారని , రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ప్రకారం బీసీల జనాభా 56.36 శాతంగా తేలిందని ఐలయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో జనాభా దామాషా ప్రకారం విద్య , ఉపాధి , స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ముఖ్య మంత్రి , మంత్రులు , మాజీ ఎంపీ వి.హనుమంత రావు, ఆర్.కృష్ణయ్య తదితరులతో కలిసి జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించినా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. పార్ల మెంట్ సమావేశాలు జరుగుతున్న సమయం లోనూ బీజేపీ ఎంపీలు బీసీల సమస్యను ప్రస్తావించలేదని ఆరోపించారు.

**బీసీలను ప్రత్యేక షెడ్యూల్‌లో చేర్చాలి...**

బీసీలలో ముఖ్యమైన కురుమ సామాజిక వర్గాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన ఐలయ్య.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆ వర్గాన్ని వివిధ పేర్లతో పిలుస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కురుమ , ఆంధ్రప్రదేశ్ , కర్ణాటకలో కురుబ , మహారాష్ట్రలో ధంగర్ , కేరళలో ముల్ల కురుబ, తమిళనాడులో కురుంబర్ పేర్లతో పిలు స్తారని వివరించారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ఓబీసీలకు ప్రత్యేక విధానం అవసర మన్నారు. ఎస్సీ , ఎస్టీల మాదిరిగానే ఓబీసీలకు కూడా ప్రత్యేక రక్షణ , గుర్తింపు కల్పించే విధంగా రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. బీసీ కులగణనకు బీజేపీ ప్రజా ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**బీసీల విషయంలో కేంద్రం వైఖరి మార్చుకోవాలి...**

కేంద్రంలో బీసీ వర్గానికి చెందిన ప్రధానమంత్రి ఉన్నప్పటికీ బీసీలకు న్యాయం జరగడం లేదని ఐలయ్య విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన నిధులు , రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులు , జీఎస్టీ వాటా వంటి అంశాల్లోనూ కేంద్రం నుంచి తగిన సహకారం అందడం లేదన్నారు. బీసీల సమస్యలను ప్రస్తావించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం అవకాశాలు కల్పించడాన్ని జీర్ణించు కోలేక బీజేపీ నాయకులు రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటి కైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని జనగణనలో బీసీ కుల గణనను చేర్చాలని , ఈ అంశం పై తెలంగాణ శాసనసభ చేసే ఏకగ్రీవ తీర్మానానికి మద్దతు ఇవ్వాలని బీర్ల ఐలయ్య కోరారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

- విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం: వక్తలు





**మంథని నియోజకవర్గ ఇంచార్జ్, సెప్టెంబర్ 11, ప్రజావాణి:**ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారిణి దాసరి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన మొత్తం 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, రెండో వార్డు కౌన్సిలర్ నూకల కమల్, పాక్స్ పర్సన్ ఇన్‌చార్జి కొత్త శ్రీనివాస్, ఆర్‌టీఏ జిల్లా సభ్యుడు మంథని సురేష్, ఎంపీడీవో శ్రీజా రెడ్డి, ముత్తారం మండల విద్యాధికారి హరి ప్రసాద్,పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, ఈదులపల్లి నరసింహారావు, ఆర్. రమేష్ తదితరులు హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ భావి పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పలు కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందన్నారు.వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఎంపీడీవో శ్రీజా రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

# ఎన్నికలలో హామీ.. ప్రజాప్రతినిధిగా నెరవేరుస్తున్నాడు...

- మాట ఇచ్చారు.. చేసి చూపించారు!
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సర్పంచ్ లావుడ్య పూర్ణ
- ప్రతి ఏటా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తానన్న మాటకు కట్టుబాటు
- పేదల కంటి వెలుగుకు అండగా నిలిచి, ఐదుగురికి ఉచిత కంటి ఆపరేషన్లు
- ఆపరేషన్‌తో పా టు రవాణా, భోజనం, వసతి ఖర్చులూ భరించి.. సొంత వాహనంలో ఇంటికి చేర్చిన సర్పంచ్
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు.. మరికొంత మందికి ఆపరేషన్లకు ఏర్పాట్లు...





**లక్ష్మీదేవిపల్లి/మన ప్రజావాణి (11 సెప్టెంబర్ 26):** ఎన్నికల్లో హామీలు ఇవ్వడం మాత్రమే కాదు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే అసలైన ప్రజాసేవకు నిదర్శనం. అలాంటి మాటకు కట్టుబడి, ప్రజల ఆరోగ్యాన్ని తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు లక్ష్మీదేవిపల్లి మండలం పెద్దతండా గ్రామ పంచాయతీ సర్పంచ్ లావుడ్య పూర్ణ. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, ప్రతి సంవత్సరం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తానన్న మాటను మరోసారి ఆచరణలో పెట్టారు. ఈ నెల 8న పెద్దతండా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ లావుడ్య పూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురు గ్రామస్తులకు ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

**కంటి వెలుగుకు భరోసా.. ఐదుగురికి ఉచిత ఆపరేషన్లు**

వైద్య పరీక్షల్లో కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించిన ఐదుగురిని ఖమ్మంలోని అగర్వాల్ ఆసుపత్రికి సర్పంచ్ ప్రత్యేక చొరవతో పంపించారు. కేవలం ఆపరేషన్ చేయించి చేతులు దులుపుకోకుండా, వారి రవాణా, భోజనం, వసతి తదితర ఖర్చులను సైతం స్వయంగా భరించారు. ఆపరేషన్ పూర్తయ్యే వరకు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ఆపరేషన్లు విజయవంతంగా పూర్తైన అనంతరం ఐదుగురినీ సర్పంచ్ లావుడ్య పూర్ణ తన సొంత ఖర్చులతో వాహనంలో స్వగ్రామానికి సురక్షితంగా తీసుకువచ్చారు. తమ వారు తిరిగి కంటి వెలుగుతో ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న పరిస్థితుల్లో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా, సర్పంచ్ చేసిన ఈ సేవ గ్రామస్తుల మనసులను హత్తుకుంది. కాగా సర్పంచ్ కాకముందే గతంలోనూ కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఏడుగురికి ఖమ్మంలోని శరత్ మ్యాక్సివిజన్ హాస్పటల్లో తన సొంత ఖర్చులతో ఆపరేషన్లు చేపించి, వారికి కావాల్సిన భోజన, రవాణా వసతిని సైతం ఏర్పాటు చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

**సేవే మార్గం.. పదవి శాశ్వతం కాదు...**

ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ మాట్లాడుతూ “ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం నా బాధ్యత. గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి సంవత్సరం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తాను. పేద ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకూడదన్నదే నా సంకల్పం. అవసరమైన వారికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తాను” అని తెలిపారు. “పదవి శాశ్వతం కాదు. ప్రజలకు చేసిన సేవే శాశ్వతం” అనే భావనతో ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సర్పంచ్ లావుడ్య పూర్ణ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గుర్తుపెట్టుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని ఆచరణలో చూపించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గణేష్ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు

- ఎస్సై బి. సాయికుమార్





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రజా వాణి )** గణేష్ మండపాల వద్ద డీజే సౌండ్ సిస్టంల ఏర్పాటుకు ఎలాంటి అనుమతి లేదని,నిబంధనలు ఉల్లంఘించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గార్ల ఎస్సై బి.సాయికుమార్ హెచ్చరించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గార్ల మండల కేంద్రంలో శుక్రవారం గణేష్ మండపాల నిర్వాహకులకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ,ప్రతి వినాయకుడి మండపం తప్పనిసరిగా ఆన్లైన్ లో అనుమతి చేయించుకోవాలని సూచించారు.డీజే సౌండ్ సిస్టం విషయంలో నిబంధనలు పాటించాలని, రాత్రి పది గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు వాడకూడదని తెలిపారు.విద్యుత్ భద్రత, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చూడాలని మద్యం సేవించి అల్లర్లు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు,అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని,అనుమానపద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు,యువకులు పాల్గొన్నారు.

# ఉచిత యూనిఫామ్ పంపిణీ

- సూదనపల్లి గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న



**దోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 11, ప్రజావాణి :** కురవి మండలం లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సూధనపల్లి లో ఉచిత యూనిఫాం సూదనపల్లి గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న పంపిణీ చేశారు..ఈ కార్యక్రమానికి ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు చిన్నం ప్రదీప్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో ఎండి .అంజద్ పాషా, గాండ్ల బాలరాజు, బి. సరోజ, వి.శుభ, కె. సారంగం, ఏ .ప్రగతి,ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ రేఖ మాధవి, ఆయా నీలం వాసవి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎలమశెట్టి ధనమ్మ , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది..

- ఎంఈఓ రాందాస్
- 23 మంది ఉత్తమ గురువులకు పురస్కారాలు ప్రధానం



**ప్రజావాణి,నెల్లికుదురు:** ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని గురువులు ఆదర్శ సమాజ నిర్మాతలని ఎంఈఓ రాందాస్ అన్నారు.ఇటీవల జరిగిన గురుపూజోత్సవం పురస్కరించుకొని ఉత్తమ గురువులుగా మండలంలోని అన్ని పాఠశాలల నుంచి ఎంపికైన 23 మంది ఉపాధ్యాయులకు శుక్రవారం మండల స్థాయి పురస్కారాలను అందజేశారు.మండల కేంద్రం నెల్లికుదురులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పురస్కార ప్రధాన ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ గురువులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే అదృష్టవంతులని పేర్కొన్నారు.అనంతరం అవార్డు గ్రహీతలైన గురువులను సన్మానించారు.

23 మంది బెస్ట్ టీచర్లకు పురస్కారాలు అందజేత..

ఎంఈఓ రాందాస్ చేతుల మీదుగా 23 మంది బెస్ట్ టీచర్స్ కు పురస్కారాలు అందజేశారు.స్కూల్ అసిస్టెంట్లు బి.బిక్షపతి,కె.వెంకటేశ్వర్లు,డి.మధుకర్, ఎండి సలీం,ఎం. సోమయ్య,ఎం.వెంకటేష్,ఆర్.నాగమణి, పిజిటిలు పి.యుగేందర్, ఎండి.అబ్దుల్ నబీ,ఎండి.నూరిద్దీన్, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం బి.రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ ఎస్. ప్రవీణ్, టిజిటి బి.లక్ష్మణ్ సింగ్ అవార్డులు తీసుకున్నారు.ఎస్ జి టి లు ఎం.రాకేష్,కె చందన,ఎ.మమత,పి,రమేష్,వి.రజిని, జి.మురళి, కె.రాజు, టీజీటీ పి.నవీన్ కుమార్, సి ఆర్ టి బి.సరోజ,సిఆర్పి బి.కవిత లకు ఎంఏవో ఉత్తమ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమం లోకాంప్లెక్స్ హెచ్ఎంలు జె.మంగతాయి,స్వప్న ఉపాధ్యాయ సంఘం నాయకులు సొంటి రెడ్డి యుగంధర్ రెడ్డి,సంగ శ్రీనివాస్,ఎల్.రవీందర్ యాకయ్య,మండల రాజు,సిహెచ్ రమేష్,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

# భర్త మృతిపై న్యాయం కోసం ఆర్లేగూడెంలో మహిళ నిరాహార దీక్ష

- భర్త మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితురాలి డిమాండ్





**చిలుకూరు, సెప్టెంబర్ 11 (ప్రజావాణి) :**చిలుకూరు మండలంలోని ఆర్లేగూడెం గ్రామంలో తమకు న్యాయం చేయాలంటూ నాగారం గ్రామానికి చెందిన భత్తుల శేషమ్మ ఆందోళనకు దిగారు. తన భర్త భత్తుల ఆంజయ్య మృతిపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ.. అర్వపల్లిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన సమయంలో తన భర్త ఆంజయ్యను చంపటం జరిగిందని తెలిపారు. తన భర్త మృతికి ఆవుదొడ్డి లక్ష్మమ్మ, భత్తుల వెంకన్న, బత్తుల శ్రీను, ఆవుదొడ్డి మహేష్ కారణమని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై నాగారం, తిరుమలగిరి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.తన భర్తకు సంబంధించిన పోస్టుమార్టం నివేదికను ఉగ్ర నరసింహ వద్ద ఉంచి తనకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని శేషమ్మ ఆరోపించారు. పెద్దమనుషులుగా ఉన్న బండి వీరయ్య, కోటయ్య, ఉగ్ర నరసింహ, బత్తుల ఎల్లయ్యలు తమకు న్యాయం చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు.అలాగే తనకు న్యాయం జరిగే వరకు ఆవుదొడ్డి లక్ష్మమ్మ ఇంటి వద్ద నిరాహార దీక్ష కొనసాగిస్తానని తెలిపారు. తనకు అండగా నిలిచే జానపాటి కాశయ్యను కూడా చంపుతామని బెదిరింపులు వచ్చాయని ఆరోపించారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తన భర్త మృతిపై సమగ్రంగా విచారణ జరిపి, పోస్టుమార్టం నివేదికను అందజేసి, తనకు న్యాయం చేయాలని శేషమ్మ కోరారు. బాధితురాలి ఫిర్యాదుపై అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# జీవో 98 రద్దు చేయాలి

- రైతుల జీవనాధారాన్ని, పర్యావరణాన్ని కాపాడాలి
- ముల్కనూర్ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి



**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రజా వాణి )**మున్నేరు పాలేరు లింకు కెనాల్ ప్రతిపాదనతో ముల్కనూర్ ప్రాంత రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, తక్షణమే జీవో 98 రద్దు చేయాలనీ సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి డిమాండ్ చేశారు. మున్నేరు పాలేరు లింకు కెనాల్ జీవో 98 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ గార్ల మండలం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఢిల్లీకి వినతిపత్రం పంపించారు.ఈసందర్భంగా ఆయన ప్రసంగిస్తూ,కెనాల్ నిర్మాణం జరిగితే సాగుభూములు కోల్పోయే ప్రమాదం ఉండటం తో పాటు, రైతుల జీవనోపాధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు, పంట పొలాలు, చెరువులు, వాగులు, భూగర్భ జలాలపై ఈ ప్రాజెక్టు ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు.వ్యవసాయ భూములు కోల్పోవడం వల్ల రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.అదేవిధంగా కెనాల్ నిర్మాణం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం, సహజ నీటి ప్రవాహాలకు ఆటంకం కలగడం, స్థానిక ప్రజలకు తాగునీరు మరియు సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను, రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.రైతుల ప్రయోజనాలకు, ప్రజా హక్కులకు, పర్యావరణ పరిరక్షణకు విరుద్ధంగా ఉన్న జీవో 98ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రైతులకు నష్టం కలిగించే ఏ నిర్ణయాన్నీ అంగీకరించబోమని, అవసరమైతే రైతులు, ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.రైతుల భూములు--ప్రజల హక్కులు కాపాడే వరకు సిపిఐ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, ధూపాటి జనార్ధన్,భుక్య హరినాయక్,అన్నం శ్రీనివాస్, మాగం లోకేష్, గూగులోత్ సక్రు,రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి పర్యావరణ పురస్కారాలు - 2026

- ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కేంద్ర రాష్ట్ర స్వర్ణ నంది అవార్డు గ్రహీత, డా.,ప్రకృతి ప్రకాష్





**రాజన్న సిరిసిల్ల:- సెప్టెంబర్ 11ప్రజావాణి** పర్యావరణ పరిరక్షణ మరియు ప్రకృతి నిలకడ కోసం యూత్ కమిటీలు చూపిన విశేష కృషికి, నిరంతర సేవలకు గాను 2026 ఈ నెల జిల్లా స్థాయి ప్రశంసా పత్రాలు మరియు అవార్డులు అందజేస్తున్నట్టు డాక్టర్ ప్రకృతి ప్రకాష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవార్డు, నేషనల్ యూత్ ఐకాన్ మరియు స్వర్ణనంది అవార్డు గ్రహీత తెలిపారు,పర్యావరణ పరిరక్షణ కోసం గత 15, 20 సంవత్సరాలుగా మట్టి వినాయకులను తమ ప్రాంత మండపాలలో నిలుపుకొని పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న. యూత్ కమిటీలు, అసోసియేషన్ సంఘాల వారిని గుర్తించి. ఈనెల జిల్లా స్థాయిలో ప్రముఖుల చేత ప్రశాంసా పత్రంతో పాటు అవార్డులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు, అనంతరం వారి పేర్లను ప్రకటించారు,అనంతనగరఫ్రెండ్స్ యూత్, సిరిసిల్ల,సిద్ధి బుద్ధి వినాయక సమితి వేములవాడ,అశోక్ నగర్ వెంకంపేట సిరిసిల్ల ,ఎకో ఫ్రెండ్స్ యూత్, వెంకంపేట్, సిరిసిల్ల,గణేష్ ఉత్సవ కమిటీ, టెక్స్టైల్ పార్క్, సిరిసిల్ల,గౌరీపుత్ర ఉత్సవ సమితి, నాగారం,పెద్దబజార్ అభివృద్ధి సంఘం, సిరిసిల్ల,మెగా యూత్, నిజామాబాద్, కోనరావుపేట,మెహర్ నగర్ అసోసియేషన్, సిరిసిల్ల,యువజన సమైక్య, నాగం పేట్, గంభీరావుపేట హిందూ సేవక్ సమితి, అశోక్ నగర్, సిరిసిల్ల,రాజశేఖర్ కానిస్టేబుల్ యువ సమాఖ్య వారు ఉన్నారు అని తెలిపారు, అలాగే 2026 ఈ సంవత్సరంలో కూడా మొట్టమొదటిసారిగా మట్టి గణపతులను నిలుపుకునేవారు ఈ నెంబర్ కు 8985101214. ఫోన్ చేసి ఫోటో మరియు చిరునామాను తెలపగలరని కోరారు

# బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- దళితులను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు
- బీఆర్ఎస్ అరాచకంపై సంగారెడ్డి లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన కార్యక్రమం లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి




**మన ప్రజావాణి( సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11)**అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంగారెడ్డి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరాచకం, గూండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు తమకు తామే నెట్టుకుని, పోలీసులపై దాడి చేసి, తిరిగి తామే బాధితులమన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. దళిత వర్గాన్ని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు, చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు. దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం బీఆర్ఎస్ పార్టీ కుసంస్కారానికి, అనాగరిక చర్యలకు నిదర్శనమని నిర్మలా జగ్గారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని, ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిర్మలా జగ్గారెడ్డి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మెన్ కూన వనితా సంతోష్,సిడిసి ఛైర్మెన్ రామ్ రెడ్డి, నాయకులు జార్జ్ ,కిరణ్ గౌడ్, సంతోష్ , శ్రీకాంత్ , రామ్ చందర్ నాయక్ , శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి,భూమేష్, తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణహిత మట్టి వినాయకులను పూజిద్దాం

- ఎస్టీపీపీ ఈడీ సిహెచ్.చిరంజీవి
- కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ప్రతిమల పంపిణీ



**జైపూర్, సెప్టెంబరు 11 ,ప్రజావాణి:** వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు దూరంగా ఉండి మట్టి వినాయకులనే పూజించాలని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ) ఈడీ సిహెచ్. చిరంజీవి పిలుపునిచ్చారు. ప్లాంట్ పరిపాలనా భవనంలో ఎన్విరాన్మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ.. రసాయనాలు, పీఓపీతో చేసే విగ్రహాల నిమజ్జనం వల్ల జల వనరులు కలుషితమై మత్స్య సంపద, ఇతర జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం కే. సూర్యనారాయణ రాజు, జీఎం (ఫైనాన్స్) ఈ. భీభత్స, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి పర్శయ్య, సీఎంఓఏఐ బ్రాంచ్ అధ్యక్షుడు డి. పంతులా, ఏజీఎం (ఓఅండ్ఎం) వి.వి. సుధాకర్ రెడ్డి, చీఫ్ (ఓఅండ్ఎం) కే. శివప్రసాద్, డీజీఎం (ఎన్విరాన్మెంట్) వాసుదేవ మూర్తి, ఈడీ ఎస్ఓ వెంకటయ్య, జీఎం ఎస్ఓ శంకర్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన



**చిలుకూరు సెప్టెంబర్ 11(ప్రజావాణి)::** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకానికి చిలుకూరు గ్రామంలో దరఖాస్తు చేసుకున్న వారి అర్హతను అధికారులు పరిశీలించారు. దరఖాస్తుదారుల అర్హత, సంబంధిత వివరాలను డిజిగ్నేటెడ్ వెరిఫికేషన్ ఆఫీసర్, ఎంపీడీఓ శ్రీ ముక్కపాటి నరసింహారావు పరిశీలించారు. అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు పెన్షన్ అందేలా ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. వీరితో పాటు పంచాయతీ కార్యదర్శి షరీపుద్దీన్, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# దళితులను అవమానించేలా ప్రవర్తించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డిమాండ్

**కోనరావుపేట: సెప్టెంబర్ 11 ప్రజావాణి** దళితులు నడిచిన రహదారి మలినమైందని, అపవిత్రమైందని వ్యాఖ్యానిస్తూ పసుపు నీటితో శుద్ధి చేసిన వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కోనరావుపేట మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గారికి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత సెప్టెంబర్ 7న ఎర్రబెల్లిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఫామ్‌హౌస్ వైపు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) యువకులు చేపట్టిన నిరసన కార్యక్రమం అనంతరం, దళితులు నడిచిన రహదారిని కొంతమంది వ్యక్తులు పసుపు నీటితో చల్లి శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టినట్లు సామాజిక మాధ్యమాలు, వీడియోల ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. దళిత వర్గాలను తీవ్రంగా అవమానించేలా, అంటరానితనాన్ని ప్రోత్సహించేలా వ్యవహరించిన సదరు వ్యక్తులపై SC/ST Atrocities Act 1989, Ac 1955, 2023 మరియు ఇతర సంబంధిత చట్టాల కింద తక్షణమే ఖ×= నమోదు చేసి, వారిని కఠినంగా శిక్షించాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల నాయకులు, మండల ప్రెసిడెంట్, మండల వైస్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శులు, గ్రామ అధ్యక్షులు ప్రతినిధులు మరియు ఎస్సీ విభాగం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ పట్టివేత

- చిలుకూరు శివారులో 360 లీటర్లు స్వాధీనం.. కేసు నమోదు



**చిలుకూరు సెప్టెంబర్ 11 (ప్రజావాణి):** చిలుకూరు గ్రామ శివారులోని మురుగన్ వెబ్రిడ్జ్ సమీపంలో చీఎ-167 రహదారి పక్కన ఏర్పాటు చేసిన స్టాల్‌లో నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించి 360 లీటర్ల నకిలీ ఉత్పత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇఐపిఆర్. ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సీనియర్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న గరికిముక్కు విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఖానారం ప్రజాపత్ అనే వ్యక్తి స్టాల్ ఏర్పాటు చేసి, సేల్స్‌మెన్‌ను నియమించి, టాటా మోటార్స్ లిమిటెడ్, గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ లిమిటెడ్ సంస్థల పేర్లు, లోగోలను ఉపయోగించి నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌ను అసలైన ఉత్పత్తులుగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సంబంధిత స్థలంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు 360 లీటర్ల నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు చిలుకూరు ఎస్ఐ బి. మోహన్ బాబు తెలిపారు.

# చిన్న ముప్పారం సబ్ స్టేషన్ అధికారులు సందర్శన..



**ప్రజావాణి ,ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా చిన్న ముప్పారం విద్యుత్ సబ్ స్టేషన్ ను విద్యుత్ అధికారులు శుక్రవారం సందర్శించారు. కరెంట్ లోడ్ పర్యవేక్షణలో భాగంగా సి ఈ గౌతమ్ రెడ్డి ఇతర అధికారులతో కలిసి సబ్ స్టేషన్ ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుత పరిస్థితులలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయానికి, గృహ అవసరాలకు సరఫరా పరిస్థితిపై సంబంధిత అధికారులు అడిగి ఆరా తీశారు. విద్యుత్ సరఫరాలో లోడ్ తదితర సమస్యలను అధిగమించడానికి మరో పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని సి ఈ గౌతమ్ తెలిపారు. కార్యక్రమంలో డి ఈ కృష్ణ, ఏ డి ఈ అశోక్, ఏ ఈ సాగర్, లైన్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, లైన్మెన్ లక్పతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శంకరంపేటలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం..
- దళితుల ఆత్మగౌరవంపై అవమానాన్ని సహించం:
- దళితుల గౌరవంతో చెలగాటమా? ---
- వివక్ష ఆరోపణలపై భగ్గుమన్న కాంగ్రెస్.. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నిరసన
- దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఊరుకోం:
- హామీలపై కాంగ్రెస్ నిలదీత
- హామీలు కాదు.. దళితులకు హక్కులు కావాలి
- మూడు ఎకరాలు, దళిత బంధుపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన
- దళితులపై వివక్షకు తావులేదు:
- పసుపు నీళ్లతో శుద్ధి చేశారనే ఆరోపణలపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం
- దళితుల గౌరవాన్ని అవమానిస్తే ప్రతిఘటన తప్పదు:
- శంకరంపేటలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన
- దళిత సీఎం హామీ ఏమైంది? దళిత బంధు పరిస్థితి ఏంటి?:
- గత హామీలను ప్రజల ముందు స్పష్టం చేయాలని కాంగ్రెస్ డిమాండ్
- దళిత స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి:
- అవమానంపై కాంగ్రెస్ ఆగ్రహం..
- సామాజిక న్యాయం కోసం పోరాటం.ఆగదు
- ప్రచారం కాదు.. దళితులకు సామాజిక న్యాయం కావాలి:
- శంకరంపేటలో కాంగ్రెస్ నిరసన.. కేసీఆర్ దిష్టిబొవ్మ దహనం
- దళితుల ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పోరుబాట:
- శంకరంపేట కాంగ్రెస్ నిరసన
- కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మోహన్ నాయక్







**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 11** దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను ఉపేక్షించం శంకరంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మోహన్ నాయక్

దళితులు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వచ్చిన సమయంలో వారు నడిచిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారనే ఆరోపణలపై తీవ్రంగా స్పందిస్తూ, మోహన్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం శంకరంపేట మండలంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించే విధంగా వ్యవహరించడం సరికాదని మోహన్ నాయక్ మండిపడ్డారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన హక్కులు ఉండాలని, కుల వివక్షకు తావులేదని అన్నారు. దళితుల నడకతో అపవిత్రమైందన్న భావన వచ్చేలా వ్యవహరించారనే ఆరోపణలు తీవ్రంగా ఖండించాల్సినవని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దళితుల కోసం ప్రకటించిన మూడు ఎకరాల భూమి హామీ, దళిత బంధు, దళిత సీఎం హామీ, దళిత ప్రజాప్రతినిధులకు అధికార భాగస్వామ్యం, దళిత యువతకు రాజకీయ అవకాశాలు ఏమయ్యాయని మోహన్ నాయక్ ప్రశ్నించారు. దళితుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

దళిత స్పీకర్‌ను అవమానించారనే విమర్శలపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత స్పీకర్‌కు వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రజాప్రతినిధికి గౌరవం ఉండాలని, కులం పేరుతో ఎవరినీ అవమానించే పరిస్థితి ఉండకూడదని అన్నారు. "హామీలు కాదు.. హక్కులు కావాలి, అవమానం కాదు.. ఆత్మగౌరవం కావాలి, ప్రచారం కాదు.. సామాజిక న్యాయం కావాలి" అని కాంగ్రెస్ నాయకులు నినదించారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని మోహన్ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమణ, స్థానిక సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్, పుల్లారావు, ప్రవీణ్, రవి, అశోక్ నాయక్, నవీన్, రమేష్, స్వామి నాయక్, రవీందర్, యాదగిరి, రాజశేఖర్ రెడ్డి, రమేష్ గౌడ్, మల్లేష్ కడిగాళ్ల, శంబుని రాజ్ కుమార్, అక్బర్, సాయిలు, ఉదయ్ కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# గురువుల సేవలకు గుర్తింపు.. ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

- ఓదెలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహణ





విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతూ, సమాజ అభివృద్ధికి తమ వంతు సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఓదెల మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి 45 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని గురువారం టీ.జీ.ఎం.ఎస్. ఓదెల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓదెల మండల విద్యాశాఖా ధికారి శ్రీ వై. రమేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి శ్రీ వి. అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, బోధనా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడం వంటి అంశాల్లో ప్రత్యేకంగా కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి సత్కరించడంతో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు.

ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయం

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు, అధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం విద్యను బోధించే వారే కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజంలో మంచి పౌరులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి మంచి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపుగా సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి లభించిన ఈ గౌరవం వారి సేవలకు గుర్తింపుగా నిలుస్తుందని, ఇలాంటి సన్మానాలు ఉపాధ్యాయుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఒక ఉపాధ్యాయుడి కృషి ఒక విద్యార్థి జీవితాన్నే కాకుండా భవిష్యత్ తరాలను ప్రభావితం చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఓదెల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు శ్రీ కనికి రెడ్డి సతీష్, శ్రీ పిట్టల రవికుమార్, శ్రీ ఎం. రవి యాదవ్, శ్రీమతి రాగిడి మంగ, శ్రీమతి అంబాల సారక్క, శ్రీమతి పుప్పాల స్వప్న, శ్రీ గోలి లింగారెడ్డి, శ్రీమతి చొప్పరి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఓదెల క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి వి. పద్మ, పోత్కపల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు శ్రీ వై. శ్రీనివాస్, కొలనూరు ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎన్. ఏసుదాసు, టీ.జీ.ఎం.ఎస్. ఓదెల ప్రిన్సిపాల్ శ్రీమతి శిరీష, కేజీబీవీ ఓదెల ప్రత్యేక అధికారి శ్రీమతి కె. జ్యోతి, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బందికి భోజన కార్యక్రమం నిర్వహించారు.

# కోటగిరిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల భారీ నిరసన రాస్తారోకో.

**కోటగిరి/ప్రజావాణి:**-నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజక వర్గం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన రాస్తారోకో నిర్వహిం చారు. ఇటీవల కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ దేశాయ్, కొట్టం మనోహర్ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కోటగిరి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఒక అట్టడుగు వర్గాల దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఉంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రాకుండా ఉంటారు. కానీ ఆయన పార్టీకి చెందిన నాయకులు మాత్రం బయటకు వచ్చి డ్రామాలు చేస్తున్నారనీ అన్నారు. వెంటనే స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ





తాతా మధుపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోనీ వెంటనే అరెస్ట్ చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ హుస్సేన్, మండల సర్పంచ్ల ఫోరం కన్వీనర్ బర్ల మధుకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్, పిఎసిఎస్ చైర్మన్ కూచి సిద్ధు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిరాజి, అఫ్జల్, అబ్బయ్య, శంకర్, సలీం, బోధన్ ఆనంద్, ఖాదర్, ఆటో సాయిలు, హైమద్, తయ్యబ్, సూర్యకాంత్, మిర్జాపూర్ సాయన్న, వహీద్, గణేష్, సాయిబాబా, అర్జున్, ఆనంద్, సాయిలు, సుదర్శన్, నాయుడు వేణు, రాజయ్య, విజయ్, రవి, గంగారాం, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సందడి

- చౌడేపల్లిలో సేవా కార్యక్రమాలతో హోరెత్తిన అభిమానుల సందడి
- ప్రత్యేక పూజలు.. రక్తదానం.. అన్నదానంతో ఘనంగా వేడుకలు

**మన ప్రజావాణి చౌడేపల్లి, సెప్టెంబర్ 11**రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు చౌడేపల్లి మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఎంపీ మిథున్‌రెడ్డిపై తమకున్న అభిమానాన్ని చాటుకుంటూ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీంతో చౌడేపల్లి మండలంలో జన్మదిన వేడుకలు రాజకీయ సందడిని తలపించాయి.చౌడేపల్లిలోని అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ భరత్ వరుణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మిథున్‌రెడ్డి ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనంతరం భరత్ వరుణ్ ఆధ్వర్యంలో ఎస్‌వీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత, నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. మిద్దింటి కిషోర్ ఆధ్వర్యంలో



అన్నదాన శిబిరం ఏర్పాటు చేసి పలువురికి అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, ఉపాధ్యక్షుడు అగ్గిదేవర రమణ, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, అంజిబాబు, వైస్ ఎంపీపీలు రామసాని సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి యాదవ్, బోయకొండ మాజీ చైర్మన్ శంకర్‌నారాయణ, మాజీ సర్పంచ్ శంషీర్‌భాషా, అల్తాఫ్, సద్దాం, మంజునాథ్, హరినాథ్, పాలేటి, వెంకటరెడ్డి, మల్లికార్జున, గోపి తదితరులు పాల్గొన్నారుఎంపీటీసీలు శ్రీరాములు, రమేష్, బ్రహ్మయ్య, విజయ్, వెంకటరెడ్డి, అనుప్రియ, పరికిదొనబాబు, బోయకొండ మాజీ సభ్యులు పవన్, సుబ్రమణ్యం రాజు, శెట్టిపేట శంకర, చెంగారెడ్డి, శేషాద్రితో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మిథున్‌రెడ్డికి జన్మదిన శు





భాకాంక్షలు తెలిపారు. పూజలు, రక్తదానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# కేటీఆర్ చేతుల మీదుగా సీడ్ గణపతి పంపిణీ ప్రారంభం

- చిర్రా రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో 5,000 పర్యావరణహిత గణపతి విగ్రహాల పంపిణీకి శ్రీకారం
- పర్యావరణం పట్ల అవగాహనా కల్పించడం అనేది మంచి నిర్ణయం
- చిర్రా రవీందర్ యాదవ్ పై కేటీఆర్ ప్రశంసలు

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్11(మన సమగ్ర ప్రజావాణి):-**పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు వినాయక చవితి వేడుకలను ప్రకృతి హితంగా నిర్వహించాలనే లక్ష్యంతో చిర్రా రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన సీడ్ గణపతి విగ్రహాల పంపిణీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా రూపొందించిన సీడ్ గణపతి విగ్రహాలను ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు.పర్యావరణం పట్ల అవగాహనా కల్పించడం అనేది మంచి నిర్ణయం అని కేటీఆర్ కొనియాడారు.ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ పై కేటీఆర్ ప్రశంసలు కురిపించారు.అనంతరం ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ,వినాయక చవితి సందర్భంగా భక్తి భావంతో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాలనే ఉద్దేశంతో సీడ్ గణపతి కార్యక్రమాన్ని



చేపట్టినట్లు తెలిపారు.మొత్తం 5,000 సీడ్ గణపతి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.పూజ అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు అందులోని విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా ఎదిగేలా వీటిని రూపొందించినట్లు తెలిపారు.సాంప్రదాయ పద్ధతులను కొనసాగిస్తూనే పర్యావరణానికి హాని కలగకుండా పండుగలను నిర్వహించాల్సిన అవసరం ఉందని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్,రసాయన రంగులు వంటి వాటితో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని,అందుకు ప్రత్యామ్నాయంగా మట్టి,సహజ పదార్థాలతో రూపొందించిన సీడ్ గణపతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఇంటికి ఒక సీడ్ గణపతి చేరేలా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.కేవలం విగ్రహాల పంపిణీకి పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణ,మొక్కల పెంపకం,స్వచ్ఛమైన నీటి వనరుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కేటీఆర్ చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కావడం తమకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని చిర్రా రవీందర్ యాదవ్ తెలిపారు. యువత,విద్యార్థులు, మహిళలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రతి కుటుంబం సీడ్ గణపతిని స్వీకరించి పూజ అనంతరం దాని ద్వారా ఒక మొక్కను పెంచితే పర్యావరణ పరిరక్షణకు అది గొప్ప తోడ్పాటుగా నిలుస్తుందని అన్నారు. భక్తితో గణపతిని పూజిద్దాం బాధ్యతతో ప్రకృతిని కాపాడుదాం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించే దిశగా ఈ కార్యక్రమం ప్రజల్లో స్ఫూర్తిని కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆగష్టు నెల నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ

- ౚపెండింగ్ కేసులలో జాప్యం చేస్తే కఠిన చర్యలు.
- జీరో ఎఫ్ఐఆర్ ను తక్షణమే నమోదు చేయాలి.
- సైబర్, ప్రాపర్టీ నేరాలపై కఠిన చర్యలు.
- CCTNS అప్‌డేట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి .
- గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా స మన్వయంతో పనిచేయాలి
- ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐ పి ఎస్.

**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-**ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐ పి ఎస్ ఆధ్వర్యంలో ఆగష్టు నెల క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఇూశ్రా ఏటూరునాగారం మనన్ భట్ ఐపీస్ , ములుగు డీఎస్ పి నలువాల రవీందర్ తో పాటు సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలను సమీక్షించి, కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జీరో ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి, అక్కడ తక్షణమే ఎఫ్ఐఆర్ రీ-రిజిస్ట్రేషన్ చేసి తదుపరి దర్యాప్తును చేపట్టేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.అలాగే జిల్లాలో నమోదైన సైబర్ క్రైమ్ కేసుల పురోగతిని సమీక్షిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ప్రాపర్టీ నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు పురోగతితో పాటు జజుచీూలో కేసు వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు.రానున్న గణేష్





ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. స్థానిక ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని తెలిపారు.ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో




పాటు, ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలను సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. నిబద్ధతతో పనిచేసిన అధికారులకు ప్రశంస పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ములుగు సిఐ దారం సురేష్ పసర సిఐ దయాకర్ ఎటురు నాగారం సిఐ సూర్యప్రకాష్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ ఆర్ఐ అడ్మిన్ రాధారత్ స్వామి రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఆపరేషన్ తిరుపతి ఆర్ ఐ ఎం టి ఓ వెంకటనారాయణ స్థానిక స్టేషన్ హౌస్ అధికారులు మరియు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా గాయత్రి బ్యాంక్ వార్షికోత్సవ వేడుకలు

**రాయికల్, సెప్టెంబర్ 11 (ప్రజావాణి):**సహకార రంగంలో విశ్వసనీయతకు మారుపేరుగా, ప్రజల ఆర్థిక అవసరాలకు అండగా నిలుస్తున్న గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 26వ వార్షికోత్సవ వేడుకలను రాయికల్ పట్టణంలో శుక్రవారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు.రాయికల్ బ్రాంచ్ లో నిర్వహించిన ఈ వేడుకలకు బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, డిపాజిటర్లు, వ్యాపారులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అతిథులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని సంబరాలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సోమ మధు మాట్లాడుతూ గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 26 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణమన్నారు.రాయికల్ బ్రాంచ్ ప్రారంభమైన నాటి నుంచి ప్రజలు తమపై ఉంచిన అచంచలమైన నమ్మకం, డిపాజిటర్లు అందించిన అపారమైన సహకారంతోనే నేడు సుమారు రూ.100 కోట్ల టర్నోవర్ అనే మైలురాయిని చేరుకోగలిగామని హర్షం వ్యక్తం చేశారు. కస్టమర్ల నమ్మకమే తమ బలమని, సిబ్బంది అంకితభావం, నిబద్ధతతో కూడిన పారదర్శక సేవలే ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత వేగవంతమైన, మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందించి, చిన్న వ్యాపారులు, రైతులు, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా మరింత అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.



బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల డిపాజిట్ పథకాలు, రుణ సౌకర్యాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం కస్టమర్లు మాట్లాడుతూ, గాయత్రి బ్యాంకులో తమ డిపాజిట్లు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని,సిబ్బంది అందిస్తున్న మర్యాదపూర్వక తక్షణ సేవల పట్ల పూర్తి సంతృప్తిగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు గంద్ర జగన్ మోహన్ రావు,అచ్యుత్ రావు,గంద్ర రమాదేవి,గరిపెల్లి శ్రీనివాస్,గోల్డ్ అప్రైజర్ గన్నవరం గంగాధర్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, డిపాజిటర్లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరి గొల్లవాడలో 90 రోజులుగా అంధకారం.. నిద్రపోతున్న పంచాయతీ!

- వీధి దీపాలు వెలగవు.. బిల్లులు మాత్రం వసూలు!
- ఫిర్యాదు చేసినా పట్టని సర్పంచ్.. పాముల భయంతో గొల్లవాజజడ
- వార్త రాసినా వెలగని వీధి దీపాలు..
- గొల్లవాడల కొనసాగుతున్న అంధకారం
- తిరుమలగిరి పంచాయతీ నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం


ప్రజావాణి

తిరుమలగిరి గొల్లవాడవాడలో వీధి దీపాలు వెలగక అంధకారం

- చీకట్లోనే రాకపోకలు.. పాముల భయంతో వణుకుతున్న ప్రజలు



**రేగొండ, సెప్టెంబర్ 11 (మన ప్రజావాణి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని గొల్లవాడలో వీధి దీపాల సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఈ సమస్యపై పత్రికల్లో వార్తలు వచ్చినా పంచాయతీ అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు.గొల్లవాడలో విద్యుత్ స్తంభాలకు లైట్లు గత 3 నెలలుగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో రోజూ సాయంత్రం 6 దాటితే వాడలో అడుగు పెట్టాలంటేనే భయమేస్తోందని అంటున్నారు. చీకట్లో పాములు తిరుగుతున్నాయి. లైట్లు వేయమని సర్పంచ్ కి, పంచాయతీ కార్యదర్శికి 5 సార్లు చెప్పాం. వస్తాం అంటారు తప్ప చేయరు. కానీ ఇంటి పన్నులు మాత్రం కట్టమని నోటీసులు ఇస్తారు" అని గొల్లవాడకు చెందిన మహిళ ఆగ్రహం వ్యక్తం చేసింది.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చీకట్లోగ్రామస్తులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు కూడా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పోషకాహారమే ఆరోగ్యానికి శ్రీరామరక్ష.

- హడ్కో అంగన్వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు.



**కోటగిరి/ప్రజావాణి:-**నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండల కేంద్రంలోని హడ్కో కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం వేడుకల్లో భాగంగా శుక్రవారం పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్లు కొమరవ్వ,వెంకటరమణమ్మ మాట్లాడుతూ.శరీర దారుఢ్యానికి,మెదడు చురుకుదనాని కి పండ్లు, ఆకుకూరలు,తృణధాన్యాలతో కూడిన సమతుల్య ఆహారం ఎంతో అవసరం అని అన్నారు.ఈ సమతుల్య ఆహారం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగి గర్భిణీలు, బాలింతలు,పిల్లల్లో పోషకాహార లోపాలను నివారిస్తుందనీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోతంగల్ వార్డు సభ్యులు అనురాధ, అంగన్వాడి టీచర్లు జయశ్రీ జ్యోతి అనసూయ షైనాజీ భాను,షాజిదాబేగం, తల్లులు,గర్భిణీలు,బాలింతలు,చిన్నారులు,తదితరులు పాల్గొన్నారు

# పరకాల డివిజన్ కమిటీలో శాయంపేటకు ప్రాతినిధ్యం..

- సతీష్‌కుమార్‌కు సంయుక్త కార్యదర్శి.. కార్తీక్‌కు కార్యవర్గ సభ్యుడి బాధ్యతలు





**ప్రజావాణి శాయంపేట**టీయూడబ్ల్యూజే--ఐజేయూ పరకాల డివిజన్ నూతన కార్యవర్గంలో శాయంపేట మండలానికి చెందిన కొమ్ముల సతీష్‌కుమార్‌ను సంయుక్త కార్యదర్శిగా, బత్తుల కార్తీక్ కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి అధ్యక్షతన, రాష్ట్ర హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ కార్యదర్శి వల్లాల వెంకటరమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడేపల్లి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరాం, ప్రెస్‌క్లబ్ కోశాధికారి అమర్ తదితరుల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.తమ ఎన్నికకు సహకరించిన జిల్లా సహాయ కార్యదర్శి గన్ను సంతోష్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు రంగు శ్రీధర్ సతీష్‌కుమార్, కార్తీక్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# పోషకాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి పునాది



**రాయికల్, సెప్టెంబర్ 11 (ప్రజావాణి):** తల్లీబిడ్డల ఆరోగ్యానికి, బంగారు భవిష్యత్తుకు పౌష్టికాహారమే ప్రధాన పునాది అని, ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని పలువురు సూచించారు. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని 5వ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ అభియాన్ లో భాగంగా నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ సుజాత, ఏఎన్ఎం రజిత మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాలు కలిగిన ఆహారం గురించి వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు,పండ్లు, పాలు, గుడ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్) వంటివి రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. గర్భిణీలకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రాధాన్యత, రక్తహీనత నివారణ చర్యలను వివరించారు.చిన్నారులకు 6 నెలల వరకు కేవలం తల్లిపాలే శ్రేష్టమని, ఆ తర్వాత వయసుకు తగిన అనుబంధ పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదల దృఢంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఉంచి వాటి ప్రయోజనాలను క్షుణ్ణంగా వివరించారు.అనంతరం సర్పంచ్ నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చివరగా పాల్గొన్న మహిళలందరితో 'పోషకాహారం తీసుకుంటాం - ఆరోగ్య సమాజాన్ని నిర్మిస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, వార్డు సభ్యురాలు ఏ. లావణ్య, పంచాయతీ కార్యదర్శి టి. రాజేష్, అంగన్వాడీ టీచర్ ఈ. సుజాత, ఏఎన్ఎం రజిత, ఆశా వర్కర్ సుమలత, గర్భిణీలు, బాలింతలు, ఐదేళ్ల లోపు పిల్లల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడిగా సయ్యద్ ఆసిఫ్ నియామకం



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** ఖమ్మం జిల్లా ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడిగా సయ్యద్ ఆసిఫ్ నియమితులయ్యారు. ఈ నియామకం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జాతీయ ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షులు వినోద్ జాఖర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తెలంగాణ రాష్ట్ర ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షులు యాదవల్లి వెంకట స్వామి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రితీష్ రావులకు సయ్యద్ ఆసిఫ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా సయ్యద్ ఆసిఫ్ మాట్లాడుతూ..."నాపై ఉంచిన నమ్మకాన్ని ఎల్లప్పుడూ నిలబెట్టుకుంటూ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మరియు ఎన్.ఎస్.యు.ఐ బలోపేతం కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తాను. మీరు నాకు అప్పగించిన ఈ గొప్ప బాధ్యతను నిజాయితీగా, సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతాను" అని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన పెద్దలందరికీ ఆయన మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీశైలమల్లన్నను దర్శించుకున్న ఆరుట్ల శ్రీమహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులు



**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా. ( ప్రజా వాణి ) సెప్టెంబర్ 11 మంచాల.**వర్షాలు బాగా కురవాలని శ్రీశైలం మల్లికార్జున స్వామిని మొక్కుకున్న శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మంచాల మండలం ఆరుట్ల గ్రామం ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులు శ్రీ శైలం యాత్రకు బయలుదేరి వెళ్లారు శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు సందర్భంగా శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ వర్షాలు సరైన సమయానికి కురవక రైతులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని వర్షాలు బాగా కురిసి రైతుల పంటలు బాగా పండి అందరూ సుఖసంతోషాలతో జీవించేలాచూడాలని ఆ శ్రీశైల మల్లికార్జున స్వామిని మొక్కుకుంటూ ప్రత్యేక పూజలు చేశామన్నారు. కార్యక్రమంలోశ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులు నూతన గంటి కృష్ణ మడపాకుల యాదగిరి పల్లె శ్రీనివాస్ గౌ డ్ యాట జలంధర్ ముదిరాజ్ ఎన్నుదుల మహేష్ అంతటి కృష్ణగౌడ్ ఆమంచ సంతోష్ నూత నగంటి చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు...

# సిఐటియు ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు అధికారుల నిరసన

- ఐదు రోజుల పని దినాలు పి ఎల్ ఐ ప్రధాన డిమాండ్ తో కార్యక్రమం



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** బ్యాంకు యూనియన్ ల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ రోజు బ్యాంకు ఉద్యోగులు అధికారులు నేడు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా రోడ్ లోని ఎస్బిఐ నుండి ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా తిరిగి ఎస్బిఐ× వరకు 1000మందికి పైగా బ్యాంకు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వారి డిమాండ్ లు సాధనకు ఉద్యమించారు. 5రోజుల పని దినాలను అమలు చేయాలనీ, పి ఎల్ ఐ అందరికి అమలు చేయాలనీ నినదించారు. తదుపరి ఎస్బిఐ ముందు జరిగిన సభ లో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వర్రావు, తుమ్మ విష్ణువర్ధన్ ఉపాధ్యక్షులు ఎం. తిరుమలా చార్యులు పాల్గొని సమ్మెకు మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల అధికారుల సమస్య ల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహారిస్తున్నదని, 5రోజుల పని దినాన్ని అమలుకు రోజుకు 40నిముషాలు ఎక్కువ సమయం పనిచేస్తామని చెప్పిన అమలు చేయకపోవడం, పి ఎల్ ఐ లో వివక్షత చూపిస్తూ ఉద్యోగుల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించడం అన్యాయం అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యం గా ఉద్యమించాలని పిలుపునిచ్చారు, సిఐటియు ఎల్లవేళ్ళల పోరాటాలకు అండ గా ఉంటుందని అన్నారు.ఈ నెల 28,29&30 తేదీలలో జరగబోయే సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ఒదించడం ద్వారా మన డిమాండ్ ల సాధన సాధ్యం అన్నారు, ఈ కార్యక్రమం లో బ్యాంకు యూనియన్ ల నాయకులు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బాలికతో అసభ్య ప్రవర్తన పెండెం సతీష్ పై పోక్సో కేసు నమోదు



**ప్రజావాణి న్యూస్ లక్షెట్టిపేట, సెప్టెంబర్ 11:** లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్ కు చెందిన పెండెం సతీష్ (41) అనే వ్యక్తి ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం సాయంత్రం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ధర్మపురికి చెందిన ఓ బాలికకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆ బాలిక తల్లి పెండెం సతీష్ జాతకాలు చూసి బాగు చేస్తాడని తెలుసుకుని అతని దగ్గరకు బాలికను తీసుకు వచ్చింది.ఈ నెల 8న తన కూతురితో అసభ్యంగా ప్రవర్తించి, ఎవరికైన చెబితే చంపుతానని బెదిరించాడని తెలిపారు.ఈ నెల 10న బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా, బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుణ్ణి గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. అనంతరం శుక్రవారం సాయంత్రం నిందితుణ్ణి కోర్ట్ కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రజలందరికి పోలీసులు మాయలు, మంత్రాలు, తంత్రాల, కడుపులో మందు పోయడం, ఎత్తి పోయడం లాంటి మూడ నమ్మకాలు లాంటివి ఉండవన్నారు. మూడ నమ్మకాలు నమ్మి ఎవరు మోసపోవద్దన్నారు. మంత్రాల ద్వారా రోగాలు నయమవుతాయని, గుప్తనిధులు లభిస్తాయని లేదా ఇతరులకు కీడు జరుగుతుందని చెప్పే దొంగ బాబాలు, మంత్రగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. శారీరక లేదా మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే అర్హత కలిగిన వైద్యులను లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి తప్ప, మంత్రగాళ్ల వద్దకు వెళ్లి సమయాన్ని, ప్రాణాలను పణంగా పెట్టవద్దన్నారు. ఈ విధమైన చర్యలు సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా చట్టరీత్యా తీవ్రమైన నేరమన్నారు. ఈ నమ్మకాలతో అమాయక ప్రజలను మోసం చేయడానికి ఎవరైనా పాల్పడితే తగిన చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ రమణ మూర్తి, ఎస్సై సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉండి దేశ ధర్మ రక్షణకు పాటుపడాలి





**రాయికల్, సెప్టెంబర్ 11 (ప్రజావాణి):**యువత గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, వ్యసనాలకు దూరంగా ఉంటూ జాతీయ భావనతో దేశ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాయికల్ పట్టణంలోని ప్రణుతి జూనియర్ కళాశాలలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ రాయికల్ ప్రఖండ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' లో భాగంగా విద్యార్థులకు అవగాహన, మార్గదర్శక సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఎద్దండి ముత్యంపు రాజురెడ్డి మాట్లాడుతూ, నేటి యువత మత్తు పదార్థాల వినియోగం వల్ల తమ ఆరోగ్యంతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యసనాల కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా చితికిపోతున్నాయని పేర్కొన్నారు. రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన, వ్యసనరహిత సమాజాన్ని అందించడమే 'నషా ముక్త్ భారత్' లక్ష్యమని తెలిపారు. యువత క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, ఏఎస్ఐ సైఫుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ బందెల తిరుపతి, శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించి తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరారు. మత్తు పదార్థాలు విక్రయించే వారి సమాచారాన్ని పోలీసులకు తెలపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ జిల్లా గోరక్ష ప్రముఖ్ వినయ్, మండల కో-కన్వీనర్ రాజు, కళాశాల ప్రముఖ్ వరుణ్, రవి కిరణ్, ప్రశాంత్, అజయ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూనిఫాం..సమానత్వానికి ప్రతీక

- పాపయ్యపేట ప్రభుత్వ బడిలో విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ
- పేదా.. ధనికా.. బడిలో అంత ఒక్కటే!



**చెన్నారావుపేట సెప్టెంబర్ 11 ప్రజావాణి** పాఠశాల అనేది కేవలం చదువుకునే ప్రదేశం మాత్రమే కాదు.. సమానత్వం, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను నేర్చుకునే వేదిక. అలాంటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులంతా ఒకే విధమైన యూనిఫాంలో కనిపించడం సమానత్వానికి ప్రత్యేకంగా నిలుస్తుందని పాపయ్యపేట గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాపయ్యపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య పేద, ధనిక అనే తేడాలు లేకుండా అందరూ సమానంగా భావించే వాతావరణాన్ని యూనిఫాం కల్పిస్తుందని అన్నారు. ఒకే రకమైన దుస్తులు ధరించడం వల్ల విద్యార్థుల్లో ఐక్యత భావం పెంపొందడంతో పాటు పాఠశాలపై గౌరవం, క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. యూనిఫాం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలోనూ తనవంతు పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫాం పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరటనివ్వడంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు. దుస్తుల విషయంలో ఎలాంటి వ్యత్యాసం లేకుండా అందరూ ఒకేలా పాఠశాలకు రావడం వల్ల పిల్లల్లో ఆత్మన్యూనత భావం తొలగిపోతుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. చదువుతోపాటు క్రమశిక్షణ, సమానత్వం, బాధ్యత వంటి విలువలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవగలరని సర్పంచ్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు గ్రామపంచాయతీ తరఫున తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీనివాస్, అనిత, నరసింహ,రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం...

- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- డీప్యూటి కమీషనర్ ఏ శైలజ
- బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో పర్యావరణహిత మట్టి విగ్రహాల పంపిణీ





**మేడిపల్లి సెప్టెంబర్ 11(మన ప్రజావాణి)**ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ అన్నారు.మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు,తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలను బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ మట్టి వినాయకులను పంపిణీ చేశారు.మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం, కాలుష్య నియంత్రణ మండలి నుంచి బోడుప్పల్ సర్కిల్‌కు మొత్తం 4,932 పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలు అందాయి.వీటిలో 8 అంగుళాల విగ్రహాలు 3,933, 12 అంగుళాల విగ్రహాలు 666, 15 అంగుళాల విగ్రహాలు 333 ఉన్నాయి.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఏ శైలజ మాట్లాడుతూ ప్రజలందరూ వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని అందువల్ల మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ డబ్ల్యూ ఎం అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో నేడు ఉదయం 9:30 గంటల నుంచి పంపిణీ

పీర్జాదిగూడ,మేడిపల్లి ప్రాంతాల కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సౌకర్యార్థం నేడు 9:30 గంటల నుంచి పీర్జాదిగూడ కౌన్సిల్ హాల్‌లో పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.సంబంధిత కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహిత గణేష్ విగ్రహాలతో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించాలని అధికారులు కోరారు.

# రేపటి పౌరులు.. నేటి రథసారథులు!

- ఎస్ వి వి 'లో కనులపండువగా విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం.
- సైనిక పరేడ్‌ను తలపించిన మార్చ్ ఫాస్ట్.. మురిసిపోయిన తల్లిదండ్రులు.
- ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.











**కేసముద్రం, సెప్టెంబర్ 11, ప్రజావాణి.**నాయకత్వ లక్షణాలు తరగతి గది నుంచే మొదలవుతాయి. పుస్తకాల చదువులతో పాటు సమాజానికి దిశా నిర్దేశం చేసే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో తాము ఎప్పుడూ ముందే ఉంటామని కేసముద్రం శ్రీ చైతన్య టెక్నో పాఠశాల మరోసారి నిరూపించింది. పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం (ఇన్వెస్టిచర్ సెరెమనీ) అత్యంత వైభవంగా, క్రమశిక్షణతో కూడిన సైనిక పరేడ్‌ను తలపించేలా సాగింది.

**జ్యోతి ప్రజ్వలనతో వేడుకల ప్రారంభం.**

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, ప్రముఖ నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, ఏజీఎం పద్మాకర్ రావు, ఎస్వీవీ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. ఉమాకర్, జోనల్ పీఈటీ ప్రవీణ్ లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు.వివేకానంద అందిస్తున్న విద్యా ప్రమాణాలను, విద్యార్థుల క్రమశిక్షణను ఈ సందర్భంగా అభినందించారు.

**బాధ్యతల బాటలో విద్యార్థి లీడర్లు.**

పాఠశాల నూతన హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లతో పాటు స్పోర్ట్స్ కెప్టెన్లు, వివిధ హౌస్ కెప్టెన్లకు ముఖ్య అతిథులు గౌరవపూర్వకంగా బ్యాడ్జీలు ధరింపజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ పాఠశాల కీర్తి ప్రతిష్టలను మరింత పెంచుతామని విద్యార్థి నాయకులు గంభీర స్వరంతో ప్రతిజ్ఞ చేశారు.

**నాలుగు రంగుల తోరణం.. మార్చ్ ఫాస్ట్ అద్భుతం!**

పాఠశాల విద్యార్థులంతా ఫారోస్, రాయల్స్, సీజర్స్, కింగ్స్ అనే నాలుగు హౌస్‌లుగా విడిపోయి.. తమ హౌస్ జెండాలను చేతబూని చేసిన మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల అడుగుల్లోని లయ, క్రమశిక్షణ చూసి అక్కడికి వచ్చిన తల్లిదండ్రులు కరతాళ ధ్వనులతో తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. తమ పిల్లలు లీడర్లుగా వేదికపై నిలబడటం చూసి ప్రతి తల్లిదండ్రుల కళ్లు ఆనందంతో మెరిశాయి.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. "విద్యార్థులకు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ప్రవర్తన, సేవా భావం అలవడాలి. కేవలం పుస్తకాల్లోని చదువే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని పిలుపునిచ్చారు.ఈ అద్భుత వేడుకలో పాఠశాల డీన్ కుమారస్వామి, ఇంచార్జ్‌లు మౌనిక, శ్రావణి, సీనియర్ పీఈటీ కె. అనిల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ,మల్బరీ సాగుతో రెండు లక్షల నికర ఆదాయం

- మేర రేషం -- మేర అభిమానం 2.0 (నా పట్టు -- నా అభిమానం 2.0)
- నూతన రైతులకు మల్బరీ సాగు లాభదాయకం
- పంట మార్పిడితో ప్రతీ గ్రామంలో 50 ఎకరాలలో అధిక ఆదాయాన్నిచ్చే మల్బరీ సాగు చేయాలి





**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 11. (మన సముద్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, కేంద్ర సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంలో గూడూరు మండలం లైన్ తండాలో మల్బరీ సాగు విస్తీర్ణం ను పెంచే క్రమంలో, నా పట్టు -- నా అభిమానం 2.0 (మేర రేషం -- మేర అభిమానం 2.0) కార్యక్రమాన్ని జి . అనసూయ, జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్ శాఖ వారి ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సిల్క్ బోర్డు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముఖ్య అతిథి మైసూర్ శాస్త్రవేత్త జె. శ్రీకాంత్ నాయక్, మల్బరీ సాగు గురించి రైతులకు పలు సాంకేతిక సలహాలు ఇస్తూ పలు సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతాంగం పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేపట్టి ఎకరానికి 2 లక్షల ఆదాయం పొందాలని తెలిపారు. ఈ పంట ఆదాయం సాఫ్ట్వేర్ ఇంజనీర్ జీతం తో సమానం అని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో సామూహికంగా మల్బరీ సాగు చేపట్టాలని దీనికి కోతులు, దొంగల బెడద లేదని, ఒక సంవత్సరం లో 5 నుండి 6 పంటలు తీసుకోవచ్చని ఎక్కువ స్థాయిలో ఎరువులు అవసరం లేదని, పురుగు మందులు అసలు అవసరం లేదని తెలుపుతు ఈ సాగు వైపు మొగ్గుచూపాలని తెలిపారు. వరి, మొక్క జొన్న, ప్రత్తి, మిరప సాగు విస్తీర్ణం తగ్గించి ఈ మల్బరీ పంటని సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న ఈ పంట సాగు వలన పరిశ్రమలు స్థాపించి యువతకు, స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉపాదిని కల్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కనుక రైతాంగం ఆలోచించి పంట మార్పిడి ద్వారా మల్బరీ సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జి .అనసూయ జాయింట్ డైరెక్టర్ , సీరికల్చర్, జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి, జె . శ్రీకాంత్, కేంద్ర సిల్క్ బోర్డు శాస్త్రవేత్త, కె.సురేష్ , సెరికల్చర్ అధికారి ,మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి.

- ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ కు సహకరించాలి.
- మఠంపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్.




**హుజూర్నగర్ సెప్టెంబర్11 (ప్రజావాణి)** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ కు సహకరించాలి, వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి పొందాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ సూచించారు. రహదారులపై ప్రజలకు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ వినియోగానికి అధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. డీజే సౌండ్ సిస్టమ్ కు అనుమతి లేదన్నారు. మండపాల వద్ద గొడవలు జరిగితే కమిటీదే బాధ్యతని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# జల్లి పాఠశాలలో విద్యార్థులకు డ్రెస్‌లు, షూస్ పంపిణీ

- విద్యతోపాటు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి: సర్పంచ్ యాట సుధాకర్



**చెన్నారావుపేట సెప్టెంబర్ 11 ప్రజావాణి** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జల్లి గ్రామ సర్పంచ్ యాట సుధాకర్ సూచించారు. చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు, షూస్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ యాట సుధాకర్ విద్యార్థులకు యూనిఫాంలు, షూస్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న ఉచిత యూనిఫాంలు, షూస్ వంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంలు, షూస్ వారి చదువుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సమానత్వ భావన పెంపొందించడంలో పాఠశాల యూనిఫాం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పసుపు నీటితో శుద్ధి చేసి దళిత జాతిని అవమానించారు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి






**ప్రజావాణి శాయంపేట,**దళితులు కేసీఆర్ ఫామ్ హౌస్ దగ్గరకు వచ్చారని బిఆర్ఎస్ శ్రేణులు పసుపు నీటితో శుద్ధిచేసి దళిత జాతిని అవమాన పరిచారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లు చేస్తున్న ఘటనలకు వ్యతిరేకంగా మండల కాంగ్రెస్ నాయకులు శనివారం శాయంపేటమండలకేంద్రంలో నల్ల బ్యాడ్జిలు ధరించి, నిరసన చేశారు. అదే విధంగా కేసీఆర్ దిష్టిబొమ్మ ను దగ్ధం చేసి, ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ...నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీకి హాజరు కావడం సహజమే అయినప్పటికీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉండడంతో నిబంధనలు లేవని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లు హంగామా సృష్టించి, మహిళా కానిస్టేబుల్స్ ను అసభ్యంగా తాకడం, పోలీసులపై దాడి చేయడం, అర్ధనగ్న ప్రదర్శన చేయడం, దళితుడైన గౌరవ స్పీకర్ ని చెప్పరాని భాషతో దూషించారని గుర్తు చేశారు. ఆగ్రహించిన దళితులు కేసీఆర్ ఫాం హౌస్ వద్ద డప్పు కొట్టి నిరసన తెలిపితే, దళితులు రావడంతో మైల పడిందనే దొర అహంకారంతో పసుపు నీటితో శుద్ధి చేసి దళిత జాతిని ఘోరంగా అవమానించారని ఆవేదన చెందారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో BRS బీఆర్ఎస్ నాయకులు అలజడి సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, జరిగిన ఘనటనలపై బేషరతుగా క్షమాపణ చెప్పకుండా, సమర్థించుకుంటున్నారని మండిపడ్డారు. కనీసం పశ్చాత్తాపం కూడా లేకపోవడం అహంకారానికి నిదర్శనమన్నారు.ఈ ఘటనలకు పూర్తి భాద్యుడు కేసీఆర్ అని, అసెంబ్లీ కి వచ్చి తెలంగాణ దళిత జాతికి ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, సరికాదన్నారు ప్రజాస్వామ్యంపై గౌరవంతో అటు ప్రభుత్వం, ఇటు కాంగ్రెస్ సైనికులు ఓపికతో చూస్తున్నామని, రెచ్చగొడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీనిపై పార్టీలు, కులాలకు అతీతంగా సమాజ మంతా ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు చల్లా చక్రపాణి, మారపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, చిందం రవి, వైనాల కుమారస్వామి, నిమ్మల రమేష్, మారపల్లి కట్టయ్య, చింతల రవిపాల్, హైదర్, ఏరుకొండ శంకర్, కొమ్ముల భాస్కర్ సర్పంచులు ఐలయ్య, సదర్ లాల్, సతీష్,శివాజీ, సరోజన, మాజీ ప్రజా ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు,వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడా ఎంపికలు



**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా చండూరు మండల పాఠశాల స్థాయి బాలబాలికల క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం శుక్రవారం చండూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. చండూర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఏ. కోటీశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి వి.సుధాకర్ రెడ్డి రిబ్బన్ కత్తిరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కబడ్డీ, ఖో ఖో,వాలి బాల్ ఆటలలో మండల ఫిజికల్ డైరెక్టర్లు జి.కరుణాకర్ రెడ్డి, అంజయ్య, సునీత, సాయి రాం లు ఎంపిక చేశారు. ఎంపికైన ఈ విద్యార్థులు మండలం తరపున నియోజకవర్గ స్థాయిలో క్రీడలలో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ం

# ఉద్దాన పలాసలో నకిలీ ఆధార్ కార్డులు ముఠా?

- లక్షల్లో అక్రమ వసూళ్ళు చేసి తమను మోసము చేసారు..
- నకిలీ ఆధార్ కార్డులు తయారీ కోసము బాధితులు వద్ద లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు..
- బడుగు వర్గాల వారి ఆశలకు తగిన సహాయము చేస్తామని నమ్మించి దగా చేశారు..
- పదివేలు మందికి ఆ ధార్ కార్డు హిస్టరీ సర్టిఫికేట్ ఇస్తామని నమ్మించారు
- ఇవ్వకుండా మోసము చేసారనీ,తామంతా మోసపోయాం







**పలాస ప్రజావాణి ప్రతినిధి** ఉద్దానము లోని ప్రజలు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు డబ్బు సంపాదన కోసం అడ్డదారుల్లో లక్షాధికారులు కావాలని ఆశతో ఆధార్ కార్డులు వ్యవహారా న్నీ అడ్డుపెట్టుకొని లక్షల రూపాయలు వసూలు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కొందరు రాజకీయాలు అడ్డుపెట్టుకుని మిడిమిడి జ్ఞానంతో అడ్డదారులు డబ్బులు సంపాదించాలని లక్ష్యంతో పేద మధ్య వర్గాలపై ఆర్థిక భారం మోపి అనవసర ఇబ్బందులు గురిచేసారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సర్కార్ ఇచ్చే ఫెన్షన్ మంజూరు కోసము అవసరమైన ఆధార్ కార్డులు ఇస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి వద్ద ఐదు వేల రూపాయలు నుంచి పదివేల రూపాయలు వరకు అక్రమంగా వసూళ్లు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇందు. కోసం ఇక్కడ బ్రోకర్లు కొందరు ఒడిశాలోని బరంపురం (బెర్హంపూర్) కేంద్రంగా సాగుతున్న నకిలీ ఆధార్ కార్డుల తయారు కోసము ఇక్కడ.భారీగా దందా నడిపారు .బయోమెట్రిక్/డేటాలను సునాయాసంగా తయారు చేసి నమ్మిన వారికి నట్టేట ముంచా రని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ఇటీవల కాలంలో బరంపురం పరిసర ప్రాంతాలలో ఆధార్ కార్డుల దుర్వినియోగం, డేటా చోరీకి సంబంధించిన తీవ్రమైన నెట్‌వర్క్‌లు వెలుగులోకి వచ్చాయి.

ఈ వ్యవహారానికి సంబంధించిన ప్రధాన వివరాలు:

ఆధార్ డేటా చోరీ నెట్‌వర్క్: ఆధార్ కార్డులు తయారు చేసే సంస్థలో పనిచేసిన ఒక మాజీ ఉద్యోగి (ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి),కంపెనీకి సంబంధించిన సున్నితమైన కంప్యూటర్ సిస్టమ్‌లను తన ఆధీనంలోకి తీసుకుని, వేలాది మంది ఒడియా పౌరుల ఆధార్ సమాచారాన్ని డేటా సమాచారాన్ని అక్రమంగా యాక్సెస్ చేసినట్లు తెలిసింది . నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసే దళారులపై చర్యలు తీసుకోవాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు..

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- ఇబ్రహీంపట్నం ఏసిపి రాజు.





**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా. (ప్రజావాణి) సెప్టెంబర్ 11**ఇబ్రహీంపట్నం.మంచాల సీఐ మధు ఇబ్రహీంపట్నం: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ సంస్థల ప్రతినిధులు మరియు యువజన సంఘాల సభ్యులకు సూచించారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, విద్యుత్ మరియు ఇతర ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని వర్గాల ప్రజల మధ్య శాంతి, సామరస్యం మరియు సోదరభావం కొనసాగించేలా ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు.అలాగే డీజేలు వినియోగించరాదని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. పోలీసు శాఖ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు ఇచ్చే సూచనలు, నిబంధనలను ప్రతి గణేష్ ఉత్సవ కమిటీ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.గణేష్ ఉత్సవాలను విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు పోలీసు శాఖతో పూర్తి స్థాయిలో సహకరించాలని ఏసీపీ కోరారు.ప్రజలకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనట్లయితే పోలీసు శాఖను వెంటనే సంప్రదించవచ్చని, ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఏసీపీ తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎలాంటి సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఏఈఈ సునీత, ఎస్ఎఫ్ఓ యాదయ్య, ఎంసీ సుదర్శన్, మంచాల్ ఇన్‌స్పెక్టర్ మధు, మీా పూరిట్ కీర్తన తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గణేష్ ఉత్సవ కమిటీలు, ఉత్సవ సంస్థలు మరియు యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు...

# ఐక్యంగా అడుగేద్దాం.. హక్కులు సాధిద్దాం

- ముదిరాజ్‌లంతా ఐక్య కార్యాచరణ సమితి వెంట నడవాలి
- మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్





**చెన్నారావుపేట సెప్టెంబర్ 11 ప్రజావాణి** హక్కుల సాధనలో ఐక్యతే బలమని, ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే డిమాండ్ కోసం అన్ని సంఘాలు ఒకే వేదికపైకి రావాలని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని కొనాపురం గ్రామం పెద్దమ్మ గుడిలో ముదిరాజ్‌ల ఐక్య కార్యాచరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. బీసీ-ఏలోకి మార్పు కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించే సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముదిరాజ్ సంఘాలు సిద్ధంగా ఉండాలన్నారు. ఒకే లక్ష్యంతో సంఘాలన్నీ కలిసికట్టుగా ఉద్యమిస్తే డిమాండ్ల సాధన మరింత బలపడుతుందని పేర్కొన్నారు.కొనాపురం గ్రామ సొసైటీ ఎన్నికల్లో కమిటీని ఏకగ్రీవం చేసేందుకు కుల సభ్యులంతా ఏకాభిప్రాయంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఐక్యతకు చొరవ చూపిన కుల పెద్దలను అభినందించారు. ఈ కార్యక్రమానికి కుల పెద్దలు కీసరి సాంబరాజు, మండల కుమారస్వామి నాయకత్వం వహించారు.ఈ కార్యక్రమంలో మండల నరసింహారాములు, నరసింహస్వామి, కీసరి రమేష్, కీసరి సదయ్య, మండల మొగిలి, మండల స్వామి, అన్నెబోయిన సారంగం, నూనె చిరంజీవి, అన్నెబోయిన రాకేష్, మండల నాగరాజు, అన్నెబోయిన స్వామి, శ్రీను, బోనాల భద్రయ్య, అన్నెబోయిన రాజు, లక్క రవి, లక్క అంజి, కీసరి శివ, జూల కుమారస్వామి, నాగరాజు, రాజు, మిట్టపల్లి నవీన్‌తో పాటు పలువురు కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



● కొత్తగూడ రేంజ్ ఆఫీసర్ వంశీ

కొత్తగూడ మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 11. (మన సమగ్ర ప్రజావాణి):- మహబూబాబాద్ జిల్లా, అటవీ సంపదను, వన్యప్రాణులను సంరక్షించేందుకు విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన అటవీ శాఖ సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని కొత్తగూడ రేంజ్ ఆఫీసర్ వంశీ కొనియాడారు. అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 11న కొత్తగూడ రేంజ్ అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో కొత్తగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రేంజ్ కార్యాలయ ప్రాంగణంలో అటవీ అమరవీరుల జ్ఞాపకార్థం మౌనం పాటించి, వారి చిత్రపటాలకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ వంశీ మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అటవీ అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో అటవీ శాఖ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అటవీ సంపదను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అడవుల పరిరక్షణకు ప్రజలు అటవీ శాఖకు సహకరించాలని రేంజ్ ఆఫీసర్ వంశీ కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ రేంజ్ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పౌష్టికాహారమే పిల్లల భవిష్యత్తుకు బలం

● పాపయ్యపేటలో పోషక ఆహార వారోత్సవం



చెన్నారావుపేట సెప్టెంబర్ 11 ప్రజావాణి చిన్నారుల ఆరోగ్యకర ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని పాపయ్యపేట సర్పంచ్ బుర్ర సుదర్శన్‌గౌడ్ అన్నారు. మండలంలోని పాపయ్యపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషక ఆహార వారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పిల్లలకు అందించే ఆహారంలో పోషక విలువలు ఉండేలా తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమతుల ఆహారంతో చిన్నారుల్లో శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం పోషకాహార ప్రాధాన్యతపై సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఉపసర్పంచ్ లింగాల సారంగం, వార్డు సభ్యుడు గుర్రం రవి, పంచాయతీ కార్యదర్శి కత్తెరపల్లి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కన్నం తిరుపతి, అంగన్వాడీ టీచర్లు మొగిలి పుష్పలత, బర్ల సుజాత, ఉప్పరి కవిత, బానోత్ కవిత, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి : బీజేపీ



నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17 ను అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బిజెపి చండూరు మున్సిపల్ అధ్యక్షులు భూతరాజు శ్రీహరి ఆధ్వర్యంలో ఆర్డీవో , ఎం ఆర్ ఓ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరువలేని మహోన్నతమైన రోజు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దురాగతాలు, జమీందారీ – జాగీర్దరీ దోపిడీ నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రక సందర్భానికి లికించిన రోజునీ గత ప్రభుత్వాలు ఎంఐఎం పార్టీ చేతిలో కీలు బొమ్మలు గా మారి విమోచన దినోత్సవం ను నిర్వహించలేదు అని కాంగ్రెస్ ప్రభుత్వం అయినా విమోచన దినోత్సవంను అధికారికంగా నిర్వహించాలని కోరారు. లేనిచో ప్రతి కార్యాలయం మీద జాతీయ జెండాలను ఎగురవేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అన్నెపర్తి యాదగిరి, బోడ ఆంజనేయులు, తడకమళ్ళ శ్రీధర్, రావిరాల శ్రీను,సామ వెంకట్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శిలు పడసబోయిన శ్రీను, సోమ శంకర్,ఆవుల అశోక్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు పేర్ల గణేష్, ఉపసర్పంచులు పల్లపు స్వామి, కడారీ నర్సింహా దోటి కిరణ్, కర్నాటి శ్రీను గండు శ్రీకాంత్, వరికుప్పల రామలింగయ్య నలపరాజు యాదయ్య, దోటి శివ ,మంచుకొండ సాగర్, కట్కూరి రామలింగయ్య, వరికుప్పల వెంకన్న, వరికుప్పల విష్ణు, ఇడికూడా శేఖర్, పులిజాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ క్యాన్సర్ తో పోరాడుతున్న 10 ఏళ్ల రితికేశ్వర్

● సాయం కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబం





మన ప్రజావాణి మందమర్రి:- ఆగస్టు 11 పట్టణానికి చెందిన 10 ఏళ్ల బాలుడు రితికేశ్వర్ బ్లడ్ క్యాన్సర్ తో పోరాడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల కోసం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. పట్టణంలోని మాంటిస్సోరి ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడి గా పనిచేస్తున్న వేనవంక నారాయణ తన భార్య, కూతురు, కొడుకు రితికేశ్వర్ తో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఐదు సంవత్సరాల క్రితం షార్ట్ సర్క్యూట్ తో సొంత ఇల్లు కాలిపోవడంతో అద్దె ఇంట్లో ఉంటూ, కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇలాంటి సమయంలో కొడుకుకు బ్లడ్ క్యాన్సర్ అని తేలడంతో ఆ కుటుంబానికి పెద్ద షాక్ తగిలింది. అనారోగ్యం కారణంగా హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయగా, బ్లడ్ క్యాన్సర్ గా నిర్ధారణ అయింది. క్యాన్సర్ ను ప్రారంభ దశలో గుర్తిస్తే థెరపీలతో నయం చేసే అవకాశం ఉండటంతో పలు దఫాలుగా థెరపీలు చేయించారు. అయితే జబ్బు నయం కాకపోగా ఇప్పటివరకు దాతల సహాయంతో దాదాపు 45 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం రక్తంలో ఇన్ఫెక్షన్ రావడంతో మరో 35 లక్షల వరకు వైద్య ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని బాలుడి తండ్రి నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక భారం మోయలేకపోతున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తన కొడుకును ఆదుకోవాలని వేడుకుంటున్నారు. రితికేశ్వర్ చదువుతున్న పాఠశాల యాజమాన్యం, తోటి విద్యార్థులు సైతం స్వచ్ఛందంగా విరాళాలు సేకరిస్తున్నారు. బ్లడ్ క్యాన్సర్ తో పోరాడుతున్న బాలుడు రితికేశ్వర్ కి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్న తండ్రి నారాయణ దాతలను వేడుకోవడం హృదయాలను కలిచి వేస్తుంది. రితికేశ్వర్ కు సాయం చేయదలచిన బాలుడి తండ్రి వేనవంక నారాయణ ఫోన్ పే, గూగుల్ పే నెంబర్ 9949156031 కు తమ విరాళాలు అందించి, రితికేశ్వర్ ప్రాణాలు కాపాడడానికి సహాయం చేయాల్సిందిగా బాలుడి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది

● రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్







మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 11 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి ) రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల, చిన్నారుల, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, అందులో ఏలాంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడు

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, జ్యోతి లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో శుక్రవారం పర్యటించారు. మేడ్చల్ తహాసీల్దారు కార్యాలయంలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి ఛైర్మన్ కు, సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా మేడ్చల్ లోని చౌక ధరల ధుకాణాలను పరిశీలించి డీలర్ తో స్టాక్ వివరాలు,రిజిష్టర్ల నమాదులు పరిశీలించారు. చౌకధరల దుకాణం వద్ద ఫిర్యాదుల బాక్సులు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఫిర్యాదులు ఇచ్చేందుకు గాను జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల తహాసీల్దార్ల ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని ఛైర్మన్ సూచించారు. సన్న బియ్యం అందుతున్నాయా అని, మీకు సౌకర్యవంతంగా డీలర్లు బియ్యం అందిస్తున్నారా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కిష్టాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ని సందర్శించి డైనింగ్ హాల్, స్టోర్ రూం పరిశీలించి ఎక్స్పైరీ డేట్ చెక్ చేస్తూ సరుకులను వాడాలని, నాణ్యమైన సన్నబియ్యం మాత్రమే వండాలని, బియ్యం నాణ్యత లేకుంటే వెంటనే అధికారులకు తెలియజేసి మార్చుకోవాలని తెలిపారు. స్కూలులో ఉడికించిన గుడ్లను పరిశీలించి వాటి రంగు మారిందని, తెల్లగా ఉండాల్సిన గుడ్లరంగు మారడానికి కారణాలు ఎమిటని అడిగారు. గుడ్లను సేకరించి ఎందుకురంగు మారాయని ఫుడ్ స్టేఫ్టీ అధికారి టెస్ట్ చేయించి నివేదిక అందించాలని ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ చెకప్ రిజిష్టర్లను పరిశీలించిరక్తహీనత ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ద వహించి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. పేరెంట్స్ కమిటీ మీటింగులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకొని సంబంధిత రిజిష్టర్లను పరిశీలించారు. పదవ తరగతి విద్యారుల తో ముచ్చటిస్తూ స్కూల్ లో ఏమైనా సమస్యలున్నాయా అని, మెను ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంచినీరు టాయిలెట్లు మౌళిక వసతులు సరిగా ఉన్నాయా అని అడిగి, ఏవైనా సమస్యలుంటే ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలని ఛైర్మన్ విద్యార్థులకు సూచించారు. నిర్భయంగా నిజాన్ని చెప్పే ధైర్యం ఉండాలని,అప్పుడే సమస్యలను ధైర్యంగా ఎదురుకుంటారని, తద్వారా భవిష్యత్తులో సమాజం పట్ల బాధ్యతగా ఉండగలరని విద్యార్థులకు భోధించారు. దమ్మాయిగూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు అధిక సంఖ్యలో లంచ్ బాక్సులు తెచ్చుకోవడం గమనించిన కమీషన్ సభ్యులు, ఎందుకు ఇంటి నుండి బాక్స్ తెచ్చుకుంటున్నారని అడుగగా, విద్యార్థులు భోజనం సరిగా ఉండడం లేదని కమీషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి లోపాలను ఉపేక్షించబోమని విచారించి సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, తాము మళ్లీ వచ్చి పరిశీలస్తామని అధికారులను హెచ్చరించారు. అనంతరం దమ్మాయిగూడలోని అంబేద్కర్ నగర్ లోని, జవహార్ నగర్ మల్కాపురంలోని అంగన్ వాడీ కేంద్రాలను ఛైర్మన్ సభ్యులు సందర్శించారు. కేంద్రాలలో ఎంత మంది చిన్నారులున్నారని, ఎంతమంది గర్భిణులు వస్తారని, వారికి సరిపడా పౌష్టికాహారం, గుడ్డు, పాలు అందించడం జరుగుతుందా అని పరిశీలించారు. అంగన్ వాడీ సెంటర్లలో భోజనం మెను ప్రదర్శించాలని అదేశించారు. గర్భిణులు, 14 సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారం తీసుకోవడం వారి హక్కు అని, చట్టబద్దమైన ఈ హక్కును కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కమీషన్ పైన ఉందన్నారు. ఈ హక్కు దారులకు నష్టం జరుగకుండా వారి హక్కులకు భంగం కలుగకుండా చూడడానికి కమీషన్ ఎప్పుడు సిద్దంగా ఉంటుందన్నారు. ఏక్కడైన సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని సభ్యులు తమ ఫోన్ నంబర్లను గర్భిణి స్త్రీలకు అందజేసారు. ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటి సంక్షేమ అధికారులు ఝాన్సీ రాణి, వినోద్ కుమార్, పద్మజా, కాంతమ్మ, డిఎం అండ్ హెచ్ఓ అనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించడానికి యత్నిస్తున్న బిజెపి

● సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
● సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ, సభ








ప్రజావాణి, సెప్టెంబర్11, హన్మకొండహనుమకొండ : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. రజాకార్లు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని శుక్రవారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలో బాలసముద్రం నుండి ఏకశిలా పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, ఏకశిలా పార్కు వద్ద గల, తెలంగాణ సాయుధ పోరాట అమరుడు ఠాణు నాయక్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు, కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని, సాయుధ పోరాట వీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన అసలైన చారిత్రాత్మక పోరాటమని కొనియాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నేతృత్వంలో ప్రజలు సాహసోపేతమైన పోరాటం చేశారని, ఆనాటి పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాటి సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగున్నర వేల కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో ఎర్ర బారిన నేల తెలంగాణ అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనను కూలదోసింది కమ్యునిస్టులేనని, పటేల్ సైన్యం కాదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయ్యిందని, పటేల్ సైనిక చర్య వల్ల కాదని అన్నారు. ఆ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 3 వేయి గ్రామాలను విముక్తి చేసింది కమ్యూనిస్టులేనని చెప్పారు. ఆనాడు పటేల్ చీకటి ఒప్పంద ఫలితమే నిజాం రాజుకు గవర్నర్ పదవి దక్కిందని అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట అమర వీరులను స్మరించుకుందామని, వారి ఆశయ సాధనకు ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్. అశోక్ స్టాలిన్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, యేషబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, నిమ్మల మనోహర్, అల్వాల రాజు, అలకుంట యాకయ్య, నోముల కిషోర్, రాంగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

● మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాలుష్యా నివారణకు మట్టి విగ్రహాల వినియోగానికి మనందరం ప్రోత్సహిస్తాం







ప్రజావాణి సెప్టెంబర్ 11 కమలాపూర్ మండల్ మట్టి వినాయక విగ్రహాలు తయారు చేద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం కమలాపూర్ మండల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమం కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించే ఉద్దేశంతో మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ జి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓఏ జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వయంగా మట్టి విగ్రహాలను తయారు చేశారు ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎస్ పి ఓ ఏ జ్యోతి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ఫారెస్ట్ రసాయనిగా రంగుల తో తయారు చేసిన విగ్రహాలను ఉపయోగించడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని అందువల్ల సహజమైన మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను పటిష్టించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించ వచ్చునని తెలిపారు విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించడంతో పాటు సాంప్రదాయ పద్ధతులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు కళాశాల ప్రిన్సిపాల్ జి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవార్చుకోవాలని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా చెరువులు నదులు ఇతర నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చు అని తెలిపారు ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు సామాజిక బాధ్యతలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు విద్యార్థులు ఎంతో ఆసక్తితో మట్టిని ఉపయోగించి వివిధ ఆకృతుల్లో వినాయక విగ్రహాలను తయారు చేశారు విగ్రహాల తయారీ విధానాన్ని తెలుసుకోవడంతో పాటు పర్యావరణ రహితమైన వినాయక చవితిని నిర్వహించాల్సిన అవసరాన్ని విద్యార్థులు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రజిత కవిత శారద చంద్రశేఖర్ కుమారస్వామి శోభా దేవి యామిని పాల్గొన్నారు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు మట్టి పర్యావరణాన్ని మేలు అనే సందేశాన్ని విద్యార్థులు సమాజానికి అందించారు

# పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక





**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 11. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో గురువారం ఘనంగా నిర్వహించిన పీఆర్టీయూ జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన బాధ్యుల వివరాలను జిల్లా అధ్యక్షుడు మిరియాల సతీష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్ సంయుక్తంగా అధికారికంగా ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు నూతన కార్యవర్గం నిరంతరం ముందుండి పోరాడుతుందని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు నీలం రమేష్, మనుగొండ రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు తొగరు కమలాకర్ రెడ్డి, బాల మురళిధర్, వాంకుడోత్ రాముడు, సి.హెచ్. శ్రీనివాస్, సంగేపు శ్రీనివాస్, డి. పగడయ్య, జిల్లా కార్యదర్శులు: నన్నపు శ్రీధర్, ఎన్. ఆనంద్, బి. రాంలాల్, వేముల కృష్ణమూర్తి, చాపల సంపత్, కొత్తపల్లి శ్రీనివాస్, గాదం స్వామినాథమ్, జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాళ్లు: గట్టు రజిత, బొమ్మినేని రేణుక, టి. రాణి, లక్ష్మి, జిల్లా మహిళా కార్యదర్శులు: ఎడాకుల హిమావతి, సి.హెచ్. సునంద, నరిశెట్టి జ్యోతి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు: గూడూరు మండలానికి చెందిన ఉపాధ్యాయులకు జిల్లా కమిటీలో సముచిత స్థానం కల్పించినందుకు, గూడూరు మండల పీఆర్టీయూ అధ్యక్షుడు మండల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సోనబోయిన రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మిరియాల సతీష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్‌లకు వారు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. నూతనం గా ఎన్నికైన ప్రతినిధులకు తోటి ఉపాధ్యాయులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్ఎస్యూఐ రాష్ట్ర కమిటీలో పట్టణ విద్యార్థికి చోటు

- ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శిగా గంట రాకేష్





**మన ప్రజావాణి మందమర్రి:- ఆగస్టు 11** పట్టణానికి చెందిన విద్యార్థి నాయకుడు గంట రాకేష్ కు అరుదైన గౌరవం దక్కింది. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్యూఐ రాష్ట్ర కమిటీలో ఆయనకు చోటు లభించింది. ఎన్ఎస్యూఐ రాష్ట్ర కమిటీ గురువారం విడుదల చేసిన రాష్ట్ర స్థాయి పదవుల జాబితాలో గంట రాకేష్ కు రాష్ట్ర కార్యదర్శి పదవి లభించింది. ఈమేరకు రాకేష్ కు ఎన్ఎస్యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవల్లి వెంకటస్వామి, జాతీయ లీగల్ సెల్ కో-కన్వీనర్ అక్బర్ లు నియామక పత్రాన్ని అందజేశారు. పట్టణానికి చెందిన రాకేష్ విద్యార్థి దశ నుంచే సామాజిక, విద్యార్థి సమస్యలపై చురుగ్గా పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేస్తూనే, విద్యార్థి నాయకుడిగా కొనసాగుతున్నారు. పట్టణం నుండి ఎన్ఎస్యూఐ రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకోవడం పట్ల విద్యార్థి, యువజన వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. పలువురు నాయకులు, విద్యార్థులు గంట రాకేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# 24 గంటల కరెంటు హామీ ఏమైంది? - ఒడ్డేలింగాపూర్, చింతలూర్ లో రైతుల ఆగ్రహం





**రాయికల్, సెప్టెంబర్ 11 (ప్రజావాణి):** వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో విద్యుత్ కోతలు, లో-వోల్టేజ్ సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతుండటంతో శుక్రవారం రెండు చోట్ల నిరసనలు వెల్లువెత్తాయి. రాయికల్ మండలం ఒడ్డేలింగాపూర్ సెక్షన్ పరిధిలో గత వారం రోజులుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని రైతులు ఆరోపించారు. ఆరు గంటల కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని, ఇచ్చే కొద్దిపాటి కరెంటు కూడా రాత్రి వేళల్లో ఇవ్వడంతో పాములు, తేళ్లు, చీకటి కారణంగా పొలాలకు వెళ్లి మోటార్లు ఆన్ చేయలేకపోతున్నామని వాపోయారు. దీంతో వరి నాట్లు, పత్తి పంటలు నీరు లేక ఎండిపోయే దశకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సహనం కోల్పోయిన రైతులు శుక్రవారం ఉదయం ఒడ్డేలింగాపూర్ లోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. వెంటనే విద్యుత్ అంతరాయాన్ని తొలగించి పగటిపూట 7 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు మద్దతుగా హాజరైన రైతు సంఘం నాయకుడు తురగ శ్రీధర్ మాట్లాడుతూ, అధికారుల నిర్లక్ష్యం, సబ్ స్టేషన్ లోని సాంకేతిక లోపాల వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. రైతు పంట ఎండిపోతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని, 48 గంటల్లో సమస్య పరిష్కరించకపోతే మండల కేంద్రంలో రాస్తారోకోతో పాటు ఉన్నతాధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముద్దం నారాయణ, శ్రీకాంత్, దరావత్ శ్రీనివాస్, అనుపురం రవీందర్, సుధాకర్, రమణయ్య, ముంజం చిన్నరెడ్డి, కదుర్ల భూమయ్య, అంబ్రియా నాయక్, బలుసు సురేష్, లింగారెడ్డి, జాటోత్ రాజు, అల్లాల అంజిత్, అల్లాల అజయ్, అనుపురం నారాయణ, సల్లూరి వెంకటేష్, జనార్దన్, కొత్తల మల్లయ్య, పల్లపు రజినీకాంత్, భూక్యా శంకర్, భూక్యా నరేష్, భూక్యా నందు, భూక్యా సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**చింతలూర్ లో ఎక్స్ ప్రెస్ ఫీడర్ కోసం వినతి:**

అదే సమయంలో చింతలూర్ గ్రామానికి చెందిన రైతులు తమ గ్రామానికి ప్రస్తుతం బోర్నపల్లి, జగన్నాథ్ పూర్ మీదుగా సుమారు 8 కి.మీ సుదీర్ఘ లైన్ ద్వారా విద్యుత్ వస్తోందని, దీనివల్ల తీగలు తరచూ తెగిపోవడం, లో-వోల్టేజ్ తో మోటార్లు కాలిపోవడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 2 కి.మీ దూరం లోనే ఒడ్డేలింగాపూర్ సబ్ స్టేషన్ ఉన్నందున, అక్కడి నుంచి నేరుగా ఎక్స్ ప్రెస్ ఫీడర్ ఏర్పాటు చేస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని విద్యుత్ శాఖ ఏఈకి చింతలూరు సర్పంచ్ వనిత రమేష్ నాయక్ వినతిపత్రం అందజేశారు.

# మట్టి గణపతినే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్




**జమ్మికుంట సెప్టెంబర్ 11 (ప్రజావాణి)** రానున్న వినాయక చవితి పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలోని యువతీయువకుల ఎనాతో సహా వినాయక మండప నిర్వాహకులు భక్తులందరం మట్టి గణపతినే ప్రతిష్ఠించి పూజించాలనే సంకల్పంతో ముందుకు సాగుదాం ప్రస్తుతం వర్షాలు తక్కువగా కురవడంతో జమ్మికుంట పట్టణంలోని చెరువుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉంది కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో వినాయక నిమజ్జనానికి కూడా అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది కాబట్టి నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినప్పటికీ, నీటి కొరత కారణంగా పరిస్థితి సవాలుగా మారింది ఈ నేపథ్యంలో మట్టి గణపతిని పూజించడం ఎంతో అనుకూలమైన మార్గం తక్కువ నీటిలోనే మట్టి గణపతిని నిమజ్జనం చేయవచ్చు మట్టి విగ్రహం నీటిలో త్వరగా కరిగిపోవడంతో పర్యావరణానికి కూడా ఎలాంటి హాని కలగదు అందువల్ల రాబోయే సంవత్సరాల్లోనూ నిమజ్జన కార్యక్రమాలకు ఉపయోగపడేలా అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది పట్టణంలోని ప్రతి గణపతి మండపాలనిర్వాహకులుభక్తులు ఈసారి మట్టి గణపతినే ప్రతిష్ఠించి పూజించి మన సంప్రదాయాలను కాపాడుతూపర్యావరణన్ని పరిరక్షిస్తూనీటి కొరతను దృష్టిలో పెట్టుకుని అందరం కలిసి మట్టి గణపతి నిమజ్జన కార్యక్రమానికి సహకరిద్దాం మట్టి గణపతి మన సంప్రదాయానికి ప్రతీక,పర్యావరణ పరిరక్షణకు మార్గం అందరూ సహకరించాలని తెలిపారు

# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు.!

- మండపాల ఏర్పాటుకు ముందే సమాచారం నమోదు చేసుకోవాలి.
- ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా.. నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు.
- అప్రమత్తతే భద్రతకు బలం.. పుకార్లను నమ్మొద్దు: సీఐ సత్యనారాయణ.



**కేసముద్రం, సెప్టెంబర్ 11,ప్రజావాణి** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్సై కె. క్రాంతి కిరణ్ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. కేసముద్రం మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ కేసముద్రం మున్సిపాలిటీ, మండల పరిధిలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసు శాఖ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

**మండపం.. కమిటీ.. నిమజ్జనం వివరాలు నమోదు.**

మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం వివరాలు, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, ప్రతిష్ఠాపన తేదీ, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం తదితర వివరాలను నమోదు చేయాలని తెలిపారు. మండపం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవడంతో పాటు వివాదాలకు తావులేని ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

**భద్రతకు సీసీ కెమెరాలు.. 24 గంటల నిఘా.**

ప్రతి గణేష్ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మండపం వద్ద 24 గంటల పాటు ఒక వాలంటీర్ ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేసి, వాలంటీర్లను నియమించాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తగా రెండు బకెట్ల నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా మండపాల ఏర్పాటు.**

ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. నిమజ్జనం నిర్దేశించిన సమయంలోనే పూర్తిచేయాలని తెలిపారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని, శోభాయాత్ర సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు ఏర్పాటు చేయరాదని సూచించారు.

**మద్యం, పేకాట..వివాదాస్పద కార్యక్రమాలకు దూరం.**

గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకర నృత్యాలు నిర్వహించడం, ఇతర మతాలను కించపరిచేలా ప్రసంగాలు చేయడం లేదా పాటలు పాడటం పూర్తిగా నిషేధమని పోలీసులు తెలిపారు. ప్రతి మండపం వద్ద కమిటీ, బాధ్యత వహించే వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని, తప్పనిసరిగా పాయింట్ పుస్తకాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే 112కు సమాచారం.**

మండపాల వద్ద అనుమానాస్పద బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు లేదా వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు, వదంతులను నమ్మవద్దని, ఏదైనా అనుమానం లేదా అవాంఛనీయ సంఘటనపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గణేష్ ఉత్సవాలు భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని సీఐ సత్యనారాయణ, ఎస్సై కె. క్రాంతి కిరణ్ కోరారు.

# వినాయక చవితి పోటీల్లో ముస్లిం చిన్నారి ప్రతిభ

- మత సామరస్యానికి ప్రతీక
- యాకూబ్ అలీ బాబా సానియా సుల్తానా దంపతుల కుమార్తె అలీజా తన ప్రతిభ
- మత సామరస్యానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచింది





**జమ్మికుంట సెప్టెంబర్ 11 (ప్రజావాణి)** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోనికృష్ణ కాలనీలో నివాసముంటున్న యాకూబ్ అలీ బాబా సానియా సుల్తానా దంపతుల కుమార్తె అలీజా తన ప్రతిభతో మత సామరస్యానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచింది స్థానిక న్యూ మిలీనియం పాఠశాలలో ఈ చిన్నారి మూడో తరగతి చదువుతోంది వినాయక చవితి పండుగ వేడుకల్లో భాగంగా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన గణపతి విగ్రహాల తయారీ ప్రదర్శన పోటీల్లో అలీజా ఎంతో ఉత్సాహంగా పాల్గొని గణనాథుడి ప్రతిమను రూపొందించింది. కులమతాలకు అతీతంగాఐక్యతా భావాన్ని చాటుతూ అలీజా చూపించిన ఈ ఉత్సాహాన్నిపాఠశాల ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు ఎంతో కొనియాడారుసంస్కృతులు పండుగలు మనుషులను ఏకం చేస్తాయని మత సామరస్యానికి ఈ చిన్నారి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందని పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి హర్షంవ్యక్తంచేశారువినూత్న ఆలోచనతో లౌకిక భావనతో పోటీల్లో భాగస్వామ్యమైన అలీజాను ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల యాజమాన్యంఅధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించాయి చిన్నతనం నుంచే పిల్లల్లో ఇలాంటి సౌభ్రాతృత్వాన్ని సమైక్యతా భావాన్ని ప్రోత్సహించడం సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పలువురు కొనియాడారు

# భళా.! విజ్ఞాన్ విద్యార్థుల కళ..

- మట్టి విగ్రహాలను తయారు చేసిన బాల బాలికలు..
- గ్రామస్తులకు అందజేసిన విజ్ఞాన్ హై స్కూల్..



**ప్రజావాణి,ఇనుగుర్తి:** పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజించాలనే సందేశం మండల కేంద్రం ఇనుగుర్తి లోని విజ్ఞాన్ హై స్కూల్ విద్యార్థులు విగ్రహాలను తయారుచేసి చాటారు. వినాయక చవితి పురస్కరించుకొని రసాయనాల తో చేసిన విగ్రహాలతో జీవకోటికి,పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని భావించిన బాల బాలికలు పాఠశాల యాజమాన్యం సూచన మేరకు శుక్రవారం మట్టితో గణనాధుల విగ్రహాలను తయారు చేయడానికి శ్రీకారం చుట్టి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ గంజి అర్చన రెడ్డి విద్యార్థుల లో దాగి ఉన్న కళను, సృజనాత్మకతను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ అభినందించారు. మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను బాలబాలికలకు వివరిస్తూ ప్రకృతి సహజ సిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను పూజించడం హిందువుల సాంప్రదాయమన్నారు. మట్టి విగ్రహాలు నీటిలో నిమజ్జనం చేసిన వెంటనే కరిగిపోతాయని తెలిపారు. రసాయనిక రంగులతో తయారుచేసిన విగ్రహాలు నీటిలో ఉన్న చేపలు ఇతర జీవులకు హాని కలిగించడంతోపాటు పర్యావరణానికి ముప్పు కలిగిస్తాయచెప్పారు. మట్టి విగ్రహాలైతే నీటిలో కరిగిన తర్వాత నీటి నాణ్యత మరింత పెరుగుతుందన్నారు. అనంతరం మట్టి విగ్రహాలను గ్రామస్తులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెనగండ్ల చంద్రమోహన్, తోట అనిత, బోళ్ల సుజాత, కారంపూరి అనూష, కదిరే రమ్య, ఉడత శ్వేత, గండి రమ్య, గుండ్రపల్లి స్రవంతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చండూరు మెయిన్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ తో ప్రమాదాలు - పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్ - మన సమగ్ర ప్రజావాణిలో కథనాలు వచ్చినా పట్టించుకోని అధికారులు



**నల్గొండ జిల్లా ప్రతినిధి (మన సమగ్ర ప్రజావాణి):** చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాలు ఇష్టానుసారంగా నిలపడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై మన సమగ్ర ప్రజావాణి పత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురించినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...చండూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న దుకాణాలు, కాంప్లెక్స్ ల ముందు వాహనదారులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీంతో రహదారి ఇరుకుగా మారి ట్రాఫిక్ జామ్ తో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారిపై ఈ సమస్య తీవ్రంగా ఉంది. పాదచారులు, విద్యార్థులు, మహిళలు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీకొంటున్నాయి. పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలి – ప్రజల డిమాండ్: ప్రధాన రహదారిపై వాహనాలు పెట్టకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడం వల్లే రోడ్డుపై వాహనాలు పెడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేసి, అక్రమ పార్కింగ్ లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రూ.19 లక్షలతో స్ట్రోమ్ వాటర్ డ్రైన్

- శ్రీనగర్ కాలనీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 (ప్రజావాణి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) నిధులతో పటాన్చెరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో రూ.19 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఉదయం శంకుస్థాపన జరిగింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పనులకు శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపేలా డ్రైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర బిక్షపతి, శ్రీధర్ చారి, టప్పు కుమార్, రాజిరెడ్డి, శాంతినగర్--శ్రీనగర్ కాలనీల అధ్యక్షుడు అంజిరెడ్డి, ఏ. వెంకట్‌రెడ్డి, టైలర్ విజయ్, రవీంద్ర చారి, కార్ రాజు, డీఈ కృష్ణవేణి, ఈఈ సురేష్‌కుమార్, ఏఈ లావణ్య, కాంట్రాక్టర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన సమగ్ర
ప్రజావాణి
తెలుగు డైలీ



# మళ్లీ పూర్తి రిథమ్ సాధించా..



**- భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్**

శ్రీలంక టూర్ సందర్భంగా తన బౌలింగ్ వేగం, రిథమ్ పడిపోవడంపై భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ పెదవి విప్పాడు. రెండు నెలల పాటు ఆటకు పూర్తిగా దూరంగా ఉండటం వల్లే క్రీజులో ఇబ్బంది పడ్డానని, అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయడం ద్వారా తిరిగి పాత లయను అందుకున్నానని తెలిపాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ సాధారణంగా వేసే 140 కిలోమీటర్ల వేగానికి బదులు కేవలం 120ల వేగంతోనే బంతులు విసిరాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 44 ఓవర్లు వేసినప్పటికీ బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయాడు. దీనిపై దులీప్ ట్రోఫీ ఫైనల్ అనంతరం సిరాజ్ మాట్లాడుతూ, “రెండు నెలల సుదీర్ఘ బ్రేక్ తర్వాత నేరుగా మ్యాచ్‌లోకి అడుగుపెట్టడంతో నా రిథమ్ దెబ్బతింది. నేను పూర్తిగా రిథమ్‌పై ఆధారపడే బౌలర్‌ని. శరీర కదలికలు సమన్వయంలో లేకపోతే క్రీజులో వేగం చూపించలేను. నా రన్‌అప్‌లో కొన్ని అడుగులు చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా పడటంతో ఫ్లో మిస్సయి పేస్ తగ్గింది” అని వివరించాడు. జూన్ 8న అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ ముగిసిన తర్వాత రెండు నెలల విశ్రాంతి తీసుకుని ఆగస్టు 7న శ్రీలంక పర్యటనకు సిరాజ్ వెళ్లాడు. అయితే చేపాక్‌లో ఈస్ట్ జోన్‌తో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్ తరఫున 41 ఓవర్ల పాటు బౌలింగ్ చేయడం ద్వారా రాబోయే కఠినమైన సీజన్‌కు తన శరీరం పూర్తిగా సిద్ధమైందని సిరాజ్ భావిస్తున్నాడు. “ఇక్కడ అంతా దారికొచ్చింది, దాంతో సహజంగానే పేస్ పెరిగింది. కొలంబో టెస్ట్ తర్వాత కేవలం వారం రోజుల్లోనే చెన్నైకి వచ్చి భానుడి ప్రతాపంలో బౌలింగ్ చేయడం చాలా కష్టమనిపించింది. కానీ దేశానికి ఆడుతున్నప్పుడు ఎలాంటి సాకులు చెప్పకూడదు. మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్లు రాకపోయినా, పడిన కష్టం అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తప్పక ఫలితాన్ని ఇస్తుంది. నా పదేళ్ల కెరీర్‌లో ఎప్పుడూ రెండు నెలల బ్రేక్ తీసుకోలేదు. నా శరీరం ఎక్కువ ఓవర్లు వేస్తేనే మెరుగ్గా స్పందిస్తుంది” అని అన్నాడు. ఈ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రత్యర్థి ఈస్ట్ జోన్ తరఫున ఆడిన తన పాత భాగస్వామి మహమ్మద్ షమీతో సిరాజ్ కాసేపు మాట్లాడాడు. ఈ సంభాషణ గురించి షమీ స్పందిస్తూ, “మొదటి ఇన్నింగ్స్‌లో సిరాజ్ తన సహజమైన రిథమ్ కోసం ఇబ్బంది పడ్డాడు. మళ్లీ ఫామ్‌లోకి రావాలంటే నీ సహజమైన బలాలపై మాత్రమే దృష్టి పెట్టాలని అతడికి గుర్తుచేశాను. రన్‌అప్, రిథమ్ సరిగ్గా కుదిరితే లైన్ అండ్ లెంగ్త్ ఆటోమేటిక్‌గా సెట్ అవుతాయి” అని తెలిపాడు. సీనియర్ బౌలర్ ఇచ్చిన సలహాలు సిరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుగ్గా బౌలింగ్ చేయడానికి తోడ్పడ్డాయి. పూర్తి ఫిట్‌నెస్‌తో పాటు రన్‌అప్ గాడిన పడటంతో రాబోయే న్యూజిలాండ్ సిరీస్‌లో సిరాజ్ మునుపటి వాడివేడి బంతులతో చెలరేగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజెంట్ సిరాజ్.. ఎక్కువగా అంతర్జాతీయ టెస్టులు మాత్రమే ఆడుతున్నాడు.

## రంజీ ట్రోఫీ షెడ్యూల్ మార్పులపై

# గవాస్కర్ ఆగ్రహం



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూపొందించిన దేశవాళీ షెడ్యూల్‌పై టీమ్ ఇండియా దిగ్గజ మాజీ సారథి సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రెడ్ బాల్ టోర్నీ రంజీ ట్రోఫీని బోర్డు చిన్నచూపు చూస్తోందని విమర్శించాడు. ప్రస్తుత క్యాలెండర్ ప్రకారం రంజీ ట్రోఫీని రెండు దశలుగా విభజించి, వాటి మధ్యలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలను నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ షెడ్యూలింగ్ గందరగోళంపై స్పోర్ట్‌స్టార్ కాలమ్‌లో గవాస్కర్ స్పందిస్తూ, “ఒక వైట్ బాల్ టోర్నమెంట్ కోసం రెడ్ బాల్ టోర్నమెంట్‌ను మధ్యలోనే ఎలా ఆపేస్తారు? ఇది ఆటగాళ్ల రిథమ్, మొమెంటమ్‌ను పూర్తిగా నాశనం చేస్తుంది” అని ఆవేదన చెందాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీని సెప్టెంబర్‌లోనే నిర్వహించవచ్చని, కానీ ఐపీఎల్ వేలానికి సమీపంలో ఉండాలనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఇలా చేస్తోందని గవాస్కర్ విమర్శించాడు. “రంజీ ట్రోఫీ తరహాలోనే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని కూడా క్వార్టర్ ఫైనల్ వరకు ఆడి, కొద్ది వారాల విరామం తర్వాత సెమీస్, ఫైనల్స్ నిర్వహించవచ్చు కదా? అలా చేయరు. ఎందుకంటే ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఐపీఎల్ వేలం జరుగుతుంది. ఒకవేళ వేలం రెండు నెలల తర్వాత జరిగినా ఫ్రాంచైజీలు ప్రతిభావంతులైన ఆటగాళ్లను మరిచిపోరు” అని అతడు తెలిపాడు. ఆట అసలు సిసలైన పునాది అయిన ఫస్ట్ క్లాస్ క్రికెట్‌ను పక్కనపెట్టి లీగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం సరైంది కాదని తెలిపాడు. ప్రస్తుత బీసీసీఐ వ్యవస్థలో అనుభవం లేని వ్యక్తుల జోక్యం పెరగడం వల్లే ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వస్తున్నాయని గవాస్కర్ విమర్శించాడు. గతంలో బోర్డులో టెక్నికల్ కమిటీ, ఫిక్చర్స్ కమిటీ ఉండేవని గుర్తుచేశాడు. “గతంలో మాజీ ఆటగాళ్లు, సీనియర్ అంపైర్లు, అనుభవజ్ఞులైన నిర్వాహకులు ఆ కమిటీల్లో సభ్యులుగా ఉండి మ్యాచ్‌ల నిర్వహణ సజావుగా సాగేలా చూసేవారు. అలాంటి అనుభవజ్ఞుల సేవలను మళ్లీ వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత భారత క్రికెట్ వ్యవస్థ కాస్త దారితప్పింది, సరైన నిపుణుల సలహాలతో దాన్ని సరిచేయాలి” అని సూచించాడు. టెస్ట్ క్రికెట్‌కు ఆటగాళ్లను అందించే రంజీ ట్రోఫీ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గకుండా చూడాలని, షెడ్యూలింగ్‌లో నిలకడ లేకపోతే యువ క్రికెటర్ల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు.

# బ్యాటింగ్ లైనప్‌పై టీమిండియాకు తలనొప్పే

**సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్**



అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో బ్యాటింగ్ లైనప్‌ను ఎంచుకోవడం టీమిండియాకు తలనొప్పేనని సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా తిలక్ వర్మను ఏ స్థానంలో ఆడిస్తారని, అతని ఎంపిక సవాల్‌గా మారుతుందని తెలిపాడు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌లో తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహాలు నెలకొన్నాయని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఘోర పరాజయాలను చవిచూసింది. ఆరు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో 3-0తో సిరీస్‌ను గెలుచుకుంది. సెప్టెంబర్ 13 నుంచి సొంతగడ్డపై అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ అనంతరం జపాన్‌తో చారిత్రాత్మక టీ20తో పాటు అక్కడే జరిగే ఆసియా గేమ్స్ 2026లో పాల్గొననుంది. టీమిండియా కాంబినేషన్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన డివిలియర్స్.. తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహం వ్యక్తం చేశాడు. ‘బ్యాటర్లను ఎంపిక చేయడంలో కచ్చితంగా కొన్ని సమస్యలు ఉంటాయి. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ ఉన్నారు. ఇక్కడే టీమ్ కాంబినేషన్ ఎంచుకోవడం కొంచెం కష్టం అవుతుంది.
తిలక్ వర్మ ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు? ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత తిలక్ వర్మ 10 ఇన్నింగ్స్‌ల్లో 159.36 స్ట్రైక్‌రేట్‌తో 255 పరుగులు చేశాడు. అయితే అతను కేవలం మూడు సార్లు మాత్రమే 50 పరుగుల మార్కును దాటాడు. ఇది అతని బ్యాటింగ్‌లోని నిలకడలేనితనాన్ని సూచిస్తుంది. ఇది చాలా బలమైన జట్టు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సరైన సమతుల్యతను సాధించడం కష్టం. ఇది టీ20 మ్యాచ్ కాబట్టి, వారు జట్టులోని చిన్న మార్పులు చేసి ఆడవచ్చు. ఆటగాళ్ల పాత్రలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. అఫ్గానిస్థాన్ వంటి ప్రమాదకరమైన జట్టును ఎదుర్కోబోతున్నందుకు ప్రతీ ఆటగాడి బాధ్యతను గుర్తు చేయడం చాలా కీలకం.’అని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు.

# ఫైనల్లో సబలెంకా, రిబకినా

- సెమీస్‌లో ఓడిన అమెరికా అమ్మాయిలు
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2026



**న్యూయార్క్ (యుఎస్ఏ):** యుఎస్ ఓపెన్‌లో బెలారస్ భామ తిరుగులేని జోరు కొనసాగుతుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో వరుస సెట్లలో విజయం సాధించిన అరినా సబలెంకా మహిళల సింగిల్స్‌లో వరుసగా నాల్గో సారి టైటిల్ పోరుకు చేరుకుంది. 7-5, 6-2తో అమెరికా అమ్మాయి, మూడో సీడ్ జెస్సికా పెగులాపై టాప్ సీడ్ అరినా సబలెంకా గెలుపొందింది. న్యూయార్క్‌లో మరోసారి జెస్సికా పెగులాను చిత్తు చేసిన సబలెంకా.. ఇక్కడ వరుసగా 19వ విజయం నమోదు చేసింది. ఏడు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసిన అరినా సబలెంకా.. జెస్సికా పెగులాపై ఏకపక్ష విజయం సాధించింది. తొలి సెట్లో సర్వ్ నిలుపుకున్న జెస్సికా పెగులా.. సబలెంకాకు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేసింది. కానీ 5-5తో స్కోరు సమంగా ఉన్న వేళ వరుసగా రెండు గేములు గెలుపొంది సబలెంకా తొలి సెట్‌ను ఖాతాలో వేసుకుంది. రెండో సెట్లో పెగులా డీలా పడిగా.. సబలెంకా దూకుడు పెంచింది. పాయింట్ల పరంగా 65-54తో సబలెంకా పైచేయి సాధించింది. గేముల పరంగా 13-7తో పెగులాను చిత్తు చేసింది. హార్డ్‌కోర్ట్ క్వీన్‌గా దూసుకెళ్తున్న సబలెంకా యుఎస్ ఓపెన్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసింది. ఈ ఏడాది ఆశించిన ప్రదర్శన చేయని సబలెంకా.. 99 వారాల తర్వాత వరల్డ్ నం.1 ర్యాంక్ చేజార్చుకునే ప్రమాదంలో పడింది.కానీ, శనివారం నాటి మహిళల సింగిల్స్ ఫైనల్లో విజయం సాధిస్తే టైటిల్‌తో పాటు వరల్డ్‌నం.1 ర్యాంక్ సబలెంకా సొంతం కానుంది.మహిళల సింగిల్స్‌లో మరో సెమీఫైనల్లో అమెరికా స్టార్ క్రీడాకారిణి కొకొ గాఫ్‌పై కజకిస్తాన్ అమ్మాయి ఎలెనా రిబకినా విజయం సాధించింది. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో నాల్గో సీడ్ కొకొ గాఫ్‌పై రెండో సీడ్ ఎలెనా రిబకినా 3-6, 6-4, 6-4తో గెలుపొందింది. ఎలెనా రిబకినా ఐదు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరువగా.. కొకొ గాఫ్ నాలుగు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లు సాధించింది. పాయింట్ల పరంగా 88-82తో రిబకినా, గాఫ్ హోరాహోరీగా పోటీపడ్డారు. రిబకినా 15 గేములు నెగ్గగా, కొకొ గాఫ్ 14 గేమ్‌లతో గట్టి పోటీ ఇచ్చింది. తొలి సెట్లో విజయంతో కొకొ గాఫ్ ముందంజ వేసినా.. వరుసగా రెండు సెట్లలో పైచేయి సాధించిన ఎలెనా రిబకినా టైటిల్ పోరుకు చేరుకుంది. **ఫైనల్‌కు చేరేదెవరో** పురుషుల సింగిల్స్‌లో ఫైనల్స్ రేసు రసవత్తరంగా మారింది. తొలి సెమీఫైనల్లో టాప్ సీడ్, జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో రష్యా ఆటగాడు కరెన్ కచనోవ్ తలపడనున్నాడు. భీకర ఫామ్‌లో ఉన్న జ్వెరెవ్‌ను ఢీకొట్టడం కరెన్‌కు అంత సులువు కాదు. మరో సెమీఫైనల్లో అమెరికా ఆటగాళ్లు ఫ్రాన్సెస్ తియాఫో, బెన్ షెల్టన్ పోటీపడుతున్నారు. బెన్ షెల్టన్ క్వార్టర్‌ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాస్‌కు షాక్ ఇచ్చి అందరి దృష్టిని ఆకర్షించాడు. నేడు సహచర ఆటగాడు ఫ్రాన్సెస్‌తో సెమీఫైనల్లో షెల్టన్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు.




# ఫైనల్లో యువ భారత్

**- మెన్స్ జూనియర్ హాకీ ఆసియా కప్**

**మోకి (చైనా) :** 2026 జూనియర్ మెన్స్ హాకీ ఆసియా కప్‌లో టీమ్ ఇండియా ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం చైనాలోని మోకిలో జరిగిన తొలి సెమీఫైనల్లో మలేషియాపై భారత్ 3-1తో ఘన విజయం సాధించింది. కెప్టెన్ అన్మోల్: ఎక్కా రెండు గోల్స్ నమోదు చేయగా, సుఖ్విందర్ సింగ్ ఓ గోల్ కొట్టాడు. మలేషియాకు రాహుల్ ఊరట గోల్ అందించాడు. రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్, దక్షిణ కొరియా తలపడనుండగా.. విజేతతో భారత్ టైటిల్ వేట సాగించనుంది.

# ఆసియా కప్ ఫైనల్లోకి దూసుకెళ్లిన భారత్..



**హైదరాబాద్ :** మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా జరిగిన సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆది నుంచి క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. షోర్నా అక్తర్ (22బి) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఆరంభంలోనే స్మృతి మంధాన (2) వికెట్‌ను కోల్పోయినా, షఫాలీ వర్మ తనదైన శైలిలో బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేసింది. ఆమెకు జతగా ప్రతిక రావల్ (20) రాణించింది. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24బి), రిచా ఘోష్ (21), దీప్తి శర్మ (13) వేగంగా పరుగులు చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగుల మంచి స్కోరును నమోదు చేసింది. రేపు (సెప్టెంబరు 11) జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.

# తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల

## నాకు వచ్చిన ప్రయోజనం ఏమీ లేదు: ఉదయభాను

ప్రముఖ యాంకర్, నటి ఉదయభాను టాలీవుడ్ పరిశ్రమలో తన ప్రస్తుత పరిస్థితిపై భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఒక ప్రముఖ మీడియా ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే తనకు పరిశ్రమలో ఆఫర్లు తగ్గిపోయి, క్రమంగా అవకాశాలు లేకుండా పోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో తెలంగాణ నేపథ్యం ఉన్న కథలు, సినిమాలు ఎక్కువగా వస్తున్నా... కేవలం ప్రాంతీయ నేపథ్యం ఉన్నంత మాత్రాన అవకాశాలు వచ్చేయవని ఆమె స్పష్టం చేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడకముందే తాను బుల్లితెరపై అత్యధిక షోలు, ఎన్నో ఈవెంట్లు చేశానని ఉదయభాను గుర్తుచేశారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత స్థానిక నటిగా తనకు ఎలాంటి అడ్వాంటేజ్ లభించలేదని, చివరికి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా తనను హోస్ట్‌గా పిలవలేదని వాపోయారు. తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల తనకు వచ్చిన ప్రయోజనం సున్నా అని ఆమె అభివర్ణించారు.దేవుడు ఇచ్చిన ప్రతిభతోనే పరిశ్రమలో తనని తాను నిలబెట్టుకున్నానని, సినిమాల్లో కొన్ని అవకాశాలు వచ్చినా సరైన కథలు లేకపోవడం వల్లే తాను నిరాకరించానని తెలిపారు. సీనియర్ హీరో రాజశేఖర్ సినిమాలో సాంగ్ తర్వాత తనకు అనేక ఆఫర్లు వచ్చినప్పటికీ, కొన్ని వ్యక్తిగత హద్దులు, నిబంధనలు పెట్టుకోవడం వల్ల వాటిని అంగీకరించలేదని వివరించారు. ప్రస్తుతం తాను సినీ నిర్మాణ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నానని, కొత్త ప్రతిభను ప్రోత్సహించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే నటనకు మాత్రం స్వస్తి చెప్పలేదని, ఇంప్రెస్ చేసే మంచి కథలు వస్తే కచ్చితంగా నటిస్తానని ఉదయభాను స్పష్టం చేశారు.





# ఇంటెన్స్ లవ్ స్టోరీ, పీరియడ్ ఫిలింస్ చేయాలని ఉంది

## : రకుల్ ప్రీత్ సింగ్

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు.

ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు.ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది

# విజయాలు చాలా చూశా..

## కానీ 'ఇరుముడి' నాకు ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిపెట్టింది: రవితేజ



మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం హైదరాబాద్‌లో 'జనరేషనల్ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్' పేరుతో విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ, ఈ చిత్రం తనకు ఒక నటుడిగా ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిందని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. "నా సినీ ప్రయాణంలో ఎన్నో విజయాలు, పరాజయాలు చూశాను. కానీ ఒక కళాకారుడిగా సమాజంలో నాకు లభించిన గౌరవానికి 'ఇరుముడి' ప్రత్యేక కారణమైంది. బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఒక ఎత్తయితే, నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని, అపారమైన గౌరవాన్ని సంపాదించుకోవడం మరో ఎత్తు. ఈ సినిమా నాకు ఆ అనుభూతిని ఇచ్చింది. డిస్ట్రిబ్యూటర్ల ముఖాల్లో కనిపించిన సంతృప్తి నాలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది" అని అన్నారు.ఈ ఘనతకు అసలైన కారణం దర్శకుడు శివ నిర్వాణ అని రవితేజ ప్రశంసించారు. "సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఆయన పడిన శ్రమ వర్ణనాతీతం. రాత్రింబవళ్లు తేడా లేకుండా పనిచేస్తూ మమ్మల్ని నడిపించారు. నా కెరీర్‌లో ఇంతగా నైట్ షూటింగుల్లో పాల్గొనడం ఇదే తొలిసారి. జీవీ ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ఆత్మలా నిలిచింది" అని కొనియాడారు. ఈ విజయోత్సవ వేడుకకు ప్రముఖ దర్శకులు అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బుచ్చిబాబు సానా ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ డివోషనల్ అండ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. సాయికుమార్, చిన్నారి నక్షత్ర కీలక పాత్రల్లో అద్భుతమైన నటనతో మెప్పించారు. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది.

# నాలుగు నెలలు ఉండగానే




## అనిల్ సందడి షురూ..!

2027 సంక్రాంతికి అనిల్ రావిపూడి 'జనవరి 12 విడుదల' సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే. ఎఫ్ 2, ఎఫ్ 3 సినిమాలు మల్టీస్టారర్‌గా తెరకెక్కించి సక్సెస్ దక్కించుకున్న అనిల్ రావిపూడి ఇప్పుడు మళ్లీ ఈ సినిమాను మల్టీస్టారర్‌గా రూపొందిస్తున్నాడు. వెంకటేష్‌తో పాటు తన మొదటి సినిమా హీరో కళ్యాణ్ రామ్‌ను ఈ సినిమాలో నటింపజేయడం వల్ల అనిల్ రావిపూడి మరోసారి సక్సెస్ ఫార్ములా వెంట నడుస్తున్నాడు. అనిల్ రావిపూడి తన ప్రతి సినిమాకు ఏదో పెద్ద హంగామా చేయకుండా,

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'.. టీజర్‌కు టైమ్ ఫిక్స్!




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను రేపు (శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు.గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది.ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# గ్లోబల్ స్టార్స్ కోసం వేట.

## . సౌత్ కొరియా సంస్థతో జతకట్టిన రష్మిక..



ప్రస్తుతం 'రణబాలి' చిత్రంతో బిజీగా ఉన్న రష్మిక మందన స్టార్ హీరోయిన్ రష్మిక మందన యువతకు స్ఫూర్తినిచ్చే ఓ కొత్త కార్యక్రమంతో ముందుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కే-పాప్ గ్రూప్ బీటీఎస్ సహా ఎన్నో పాప్ గ్రూప్‌లను ప్రపంచానికి పరిచయం చేసిన దక్షిణ కొరియా వినోద సంస్థ 'హైబ్' (న్దీజు). ఈ సంస్థ భారతదేశంలో 'హైబ్ ఇండియా' పేరుతో ప్రతిభావంతుల అన్వేషణకు ఆడిషన్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రష్మిక మందన భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు.ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "ప్రతి ప్రయాణం ఒక అవకాశంతో, ఆ మొదటి అడుగు వేయడానికి కావలసిన ధైర్యంతో మొదలవుతుంది. నా జర్నీని వెనక్కి తిరిగి చూసుకుంటే, మనపై మనం నమ్మకం ఉంచడం, కష్టపడి పనిచేయడం, ఊహించని అవకాశాలకు సరేననడం ఎంత ముఖ్యమో నాకు తెలుసు" అని ఆమె పేర్కొన్నారు. భారత్‌లో ఇలాంటి అవకాశం రావడం ఇదే మొదటిసారని రష్మిక అభిప్రాయపడ్డారు. "ప్రపంచవ్యాప్తంగా ఎందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన హైబ్ సంస్థ, ఇప్పుడు భారతీయ యువతలోని ప్రతిభను గుర్తించడానికి ముందుకు రావడం ఆనందంగా ఉంది. దేశంలో ఎంతోమంది అమ్మాయిలు కళాకారులుగా, పెర్ఫార్మర్‌లుగా ఎదగాలని కలలు కంటారు. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ తమ కలకు ఒక అవకాశం ఇవ్వాలి" అంటూ యువతలో ఆమె స్ఫూర్తి నింపారు. హైబ్ సంస్థ బీటీఎస్‌తో పాటు టీఎక్స్‌టీ (ఁశు), న్యూజీన్స్, ఇల్లిట్ వంటి ఎన్నో ప్రఖ్యాత కే-పాప్ గ్రూప్‌లను నిర్వహిస్తోంది.ఇక, సినిమాల విషయానికొస్తే.. రష్మిక ఇటీవల షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు. 1870ల కాలంలో దక్షిణ భారతదేశంలో తీవ్రమైన కరువు నెలకొన్న నేపథ్యంలో తన ప్రజలను, ప్రాంతాన్ని కాపాడుకోవడం కోసం ఓ తిరుగుబాటు యోధుడు బ్రిటిష్ కమిషనర్‌ను ఎలా ఎదుర్కొన్నాడు అనే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com